www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
గురువారం | 21-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 353

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి తె. 4.46 తదుపరి త్రయోదశి; నక్షత్రం: ఆశ్లేష రా. 1.28 తదుపరి మఖ; వర్జ్యం: మ.12.57-2.44, దుర్ముహూర్తం: ఉ.10.23-11.11, మ.3.11-3.59; అమృతఘడియలు: రా.11.40-1.28; రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 6.22, సూర్యాస్తమయం: 6.23

వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఎకరాకు రూ.10 వేలు

అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం

నష్టంపై సర్వేకు ఇప్పటికే అధికారులకు ఆదేశాలిచ్చాం

గతంలో యాసంగి పంటకు మే నెల వరకూ రైతుబంధు

ఖజానా ఖాళీగా ఉన్నా రైతుబంధు నిధులు జమచేస్తున్నాం

4-5 ఎకరాలున్న రైతులకు 2 రోజుల్లో నగదు బదిలీ పూర్తి

రుణమాఫీపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు: మంత్రి తుమ్మల

హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల చొప్పున నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. పంట నష్టంపై సర్వే చేయాలని ఇప్పటికే అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. నష్టం జరిగిన

మిగతా 13వ పేజీలో...

బిడ్డా.. ఇది నా అడ్డా

ఒకరి అడ్డాలో మరొకరు ప్రయాణికుల్ని ఎక్కించుకోవడంపై ఆటోవాలాల ఘర్షణ

ఆటోను వెంబడించి మరో ఆటోతో ఢీకొట్టిన వైనం

ప్రమాదంలో ఓ నర్సింగ్ విద్యార్థినికి తీవ్ర గాయాలు

సిద్దిపేటలో ఘటన.. కేసు నమోదు చేసిన పోలీసులు

14



సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని నవ్య

మంత్రి పొన్నం ఫోన్ సంభాషణ లీక్!

కల్యాణలక్ష్మి చెక్కులను మీరే పంచండి

ఆర్డీవో, తహసీల్దార్‌కు మంత్రి ఆదేశం

సోషల్ మీడియాలో వైరల్

ఆర్డీవోపై సీఎస్‌కు పొన్నం ఫిర్యాదు

12



58 ఏళ్ల వయసులో ఐవీఎఫ్‌కు అనుమతి ఎలా?

రెండో బిడ్డను కన్న సిద్దూ మూసేవాలా తల్లిదండ్రులకు న్యాయపరమైన చిక్కులు

ఐవీఎఫ్‌కు అనుమతించే వయసు 21-50

చట్టపరమైన పత్రాలను సమర్పించండి

పంజాబ్ ప్రభుత్వాన్ని కోరిన కేంద్రం

2



అన్నారం బ్యారేజీ వైఫల్యానికి

డిజైన్లే కారణం

మాకు సంబంధం లేదు: నిర్మాణ సంస్థ

బ్యారేజీ ప్రమాదంలో ఉంది.. రక్షణ చర్యలు చేపట్టాలి.. శాశ్వత మరమ్మతులు చేయాలి: అఫ్కాన్స్

హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మరో బ్యారేజీ వైఫల్యంపై నిర్మాణ సంస్థ చేతులెత్తేసింది. డిజైన్ లోపం వల్లే అన్నారం బ్యారేజీ ప్రమాదంలో పడిందని, దీనికి తాము ఎంతమాత్రం బాధ్యులం కాదని అఫ్కాన్స్-విజేత-పీఈఎస్ జాయింట్ వెంచర్ తెలిపింది. ఈ మేరకు ప్రభుత్వానికి ఇటీవల లేఖ రాసింది. ఇప్పటికే మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి తాము కారణం కాదని, మరమ్మతులు/పునరుద్ధరణ చేపట్టాలంటే మళ్లీ ఒప్పందం చేసుకోవాల్సిందేనంటూ నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ తేల్చిచెప్పిన విషయం తెలిసిందే. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోగా.. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో భారీగా సీపేజీలు బయటపడ్డాయి. అన్నారం బ్యారేజీ నిర్మాణం 2016 జూన్‌లో చేపట్టగా.. 2019లో పనులు పూర్తయ్యాయి. డిఫెక్ట్ లయబిలిటీ కాలం 2021 డిసెంబరులో పూర్తయింది. అయితే వరద ప్రవాహంతో బ్యారేజీ దిగువ భాగంలో రంధ్రాలు ఏర్పడ్డాయని, పైల్స్‌కు, సీకెంట్ పైల్స్‌కు మధ్య గ్యాప్ ఏర్పడిందని, ఇది అత్యంత ప్రమాదకరమైనదని నిర్మాణ సంస్థ గుర్తు చేసింది. దీనివల్ల భారీగా సీపేజీ ఏర్పడిందని నివేదించింది. బ్యారేజీని కాపాడుకోవాలంటే తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంటుందని పేర్కొంది. అన్నారం బ్యారేజీ

మిగతా 3వ పేజీలో...

బ్యారేజీల డిజైన్లు ఎలా తయారు చేశారు?

ఆమోదానికి ప్రామాణికమేంటి?

లైడార్ సర్వే సరైనదేనా?

అధికారులను ప్రశ్నించిన ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీ

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలపై క్రాస్ ఎగ్జామినేషన్

నేడు, రేపు కూడా కొనసాగనున్న కమిటీ భేటీలు

3

వైద్యశాఖలో కొలువుల జాతర

5,348 పోస్టులకు సర్కార్ గ్రీన్ సిగ్నల్

డీఎంఈ పరిధిలోనే 3,235, టీవీవీపీలో 1,255, డీహెచ్‌లో 575 పోస్టులు

మొత్తం కొలువుల్లో 1,989 నర్స్‌పోస్టులు

లోక్‌సభ ఎన్నికల కోడ్‌కు ముందే జీవో

మెడికల్ బోర్డు ద్వారా నియామకం

జూన్‌లో నోటిఫికేషన్ వచ్చే అవకాశం?



హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో కొలువుల జాతర మొదలైంది. ఆయా విభాగాధిపతుల పరిధిలో ఖాళీల భర్తీకి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. 5,348 పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు ఈ నెల 16న స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పోస్టులన్నింటిని మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా భర్తీ చేయాలని జీవోలో పేర్కొన్నారు. కాగా లోక్‌సభ ఎన్నికల కోడ్‌కు ముందే ఈ జీవో జారీ చేయగా.. నాలుగు రోజుల తర్వాత ఇది బయటకు వచ్చింది. వైద్యవిద్య కళాశాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడమే లక్ష్యంగా

మిగతా 13వ పేజీలో...

పాలిసెట్ తేదీ మార్పు

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మే 17 నుంచి 24వ తేదీకి వాయిదా

'ఎప్‌సెట్' తేదీల మార్పుకు ప్రతిపాదన

జూన్ 23న నీట్ పీజీ పరీక్ష

14

నిందితులను జైల్లోనే ఉంచేందుకు

ఎన్ని చార్జిషీట్లు?

ఈడీపై సుప్రీంకోర్టు ఆగ్రహం

దర్యాప్తు పూర్తయ్యే వరకు నిందితుడిని అరెస్టు చేయొద్దు

అదే డిఫాల్ట్ బెయిల్ ఉద్దేశమన్న కోర్టు

ఝార్ఖండ్ మైనింగ్ కేసులో హేమంత్ సోరెన్ పీఏ బెయిల్ పిటిషన్‌పై విచారణ

నిందితుడిని 18 నెలలుగా జైల్లోనే ఉంచడం ఇబ్బందికి గురిచేసిందని వ్యాఖ్య

చివరకు ఈడీ అభ్యర్థనతో బెయిల్ నిరాకరణ



న్యూఢిల్లీ, మార్చి 20: మనీ లాండరింగ్ కేసుల్లో నిందితులకు డిఫాల్ట్ బెయిల్ తిరస్కరించడానికి, వారిని జైల్లోనే ఉంచే ఉద్దేశంతో ఎన్ని అనుబంధ చార్జిషీట్లు దాఖలు చేస్తారంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. విచారణ లేకుండానే నిందితులను నిరవధికంగా జైల్లోనే ఉంచేందుకు ఈడీ అనుసరిస్తున్న పద్ధతి సరికాదంటూ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం ఆక్షేపించింది. 'డిఫాల్ట్ బెయిల్ ఉద్దేశమేమిటంటే.. దర్యాప్తు పూర్తయ్యేవరకు మీరు నిందితుడిని అరెస్ట్ చేయకూడదు. మీరు (నిందితులను అరెస్టు చేసి కూడా) దర్యాప్తు పూర్తి చేసేవరకు విచారణ చేయొద్దని మాకు చెప్పలేరు. అనుబంధ చార్జిషీట్లు దాఖలు చేస్తూ విచారణ లేకుండా నిందితులను నిరవధికంగా జైల్లో ఉంచలేరు' అంటూ ఈడీ తరపు

మిగతా 2వ పేజీలో...

రూ.8,350 కోట్లు

2023 డిసెంబరు 29-ఫిబ్రవరి 15 మధ్య కేంద్రం ముద్రించిన ఎలక్టోరల్ బాండ్ల విలువ

ఆర్టీఐ ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ జవాబు

2

సీజేఐ లేకపోతే స్వతంత్రంగా వ్యవహరించదా?

ఈసీ స్వతంత్రతకేమీ ముప్పు లేదు

సీఈసీ చట్టంపై నిరాధార ఆరోపణలే

సుప్రీంకోర్టుకు స్పష్టం చేసిన కేంద్ర ప్రభుత్వం



సద్గురు జగ్గీ వాసుదేవ్‌కు బ్రెయిన్ సర్జరీ

4 వారాలుగా తీవ్రమైన తలనొప్పితో ఇబ్బంది

అయినప్పటికీ ఉత్సాహంగా శివరాత్రి వేడుకలకు హాజరు

17న ఆరోగ్యం క్షీణించడంతో ఆస్పత్రిలో చేరిక

వెంటనే సర్జరీ చేసిన వైద్యులు

సద్గురుకు ప్రధాని పరామర్శ

న్యూఢిల్లీ, మార్చి 20: ఆధ్యాత్మికవేత్త, ఇషా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు జగ్గీ వాసుదేవ్ (66)కు బ్రెయిన్ సర్జరీ జరిగింది. గత నాలుగు వారాలుగా తీవ్రమైన తలనొప్పితో బాధపడుతున్న ఆయన మార్చి 14న న్యూఢిల్లీలోని అపోలో

మిగతా 2వ పేజీలో...

అందరి సమస్యలూ

వింటా

తెలంగాణ గవర్నర్‌గా రాధాకృష్ణన్‌తో ప్రమాణం చేయించిన సీజే అలోక్ అరాధే. చిత్రంలో సీఎం రేవంత్



వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటా

గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాధాకృష్ణన్

ప్రమాణం చేయించిన హైకోర్టు సీజే అలోక్ అరాధే

సీఎం రేవంత్‌తో పాటు ఇతర ప్రముఖుల హాజరు

యాదగిరిగుట్ట ఆలయాన్ని సందర్శించిన గవర్నర్

బీజేపీ సభ్యత్వం తీసుకున్న తమిళిసై

కష్టమైన నిర్ణయాన్ని ఇష్టపడే తీసుకున్నానని వ్యాఖ్య

హైదరాబాద్/యాదగిరిగుట్ట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ బాధ్యతలు స్వీకరించారు. రాజ్‌భవన్ దర్బార్‌హాల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే.. రాధాకృష్ణన్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం గవర్నర్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సహకరించేందుకు తెలంగాణ రాజ్‌భవన్ నిబద్ధతతో ఉందన్నారు. సామాన్య ప్రజల అవసరాలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు అన్ని రాజకీయ పార్టీలు, అధికారులు, ప్రజా సంఘాలు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. గవర్నర్‌గా ప్రతి ఒక్కరి సమస్యలు వింటానని, వాటి పరిష్కారానికి

మిగతా 13వ పేజీలో...

మలి జాబితాపై

ఉత్కంఠ!

ఇంకా విడుదల కాని కాంగ్రెస్ 'లోక్‌సభ' రెండో లిస్ట్

పెండింగ్‌లో ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, భువనగిరి, హైదరాబాద్

నేడు సీఈసీలో తెలంగాణపై లేని చర్చ.. ఇతర రాష్ట్రాల జాబితాతో కలిసి ప్రకటించే చాన్స్

హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ అభ్యర్థుల మలి జాబితాపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. సామాజిక సమతుల్యత, ఆర్థిక పరిస్థితి, నేతలకు ఇచ్చిన హామీలు, సర్వే నివేదికల ఆధారంగా అభ్యర్థుల ఎంపికపై ఏఐసీసీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) ఈ నెల 19న సుదీర్ఘంగా చర్చించినా.. ఆరేడు సీట్లపై ఇంకా స్పష్టత రానట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, భువనగిరి, హైదరాబాద్ సీట్లలో అభ్యర్థుల ఎంపిక పెండింగ్‌లో పడినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అన్ని సీట్లపైనా స్పష్టత వచ్చాకే అధిష్ఠానం జాబితాను ప్రకటిస్తుందా.. లేక స్పష్టత వచ్చిన సీట్లకు అభ్యర్థులను గురువారం ప్రకటిస్తుందా.. అన్న చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. 19న జరిగిన సీఈసీ సమావేశంలో సికింద్రాబాద్ (దానం నాగేందర్), మల్కాజిగిరి (పట్నం సునీతా మహేందర్‌రెడ్డి), చేవెళ్ల (రంజిత్‌రెడ్డి), వరంగల్ (పసునూరి దయాకర్), పెద్దపల్లి (గడ్డం వంశీ), నాగర్‌కర్నూలు (మల్లు రవి), ఆదిలాబాద్ (డాక్టర్ సుమలత) సీట్లపై స్పష్టత వచ్చినట్లు చెబుతున్నారు. ఇక నిజామాబాద్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, స్థానికంగా డాక్టర్ అయిన కవితారెడ్డి పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. కరీంనగర్ సీటుకు ప్రవీణ్‌రెడ్డి, వెలిచాల రాజేందర్ పేర్లను సీఈసీ పరిశీలించింది. అయితే పక్కపక్కనే ఉన్న నిజామాబాద్, కరీంనగర్ సీట్లను రెడ్డి సామాజికవర్గానికి కేటాయించడంపై తర్జన భర్జన నడిచినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో నిజామాబాద్ సీటును బీసీకి కేటాయిస్తే ఎలా

కారు దిగిన నేతలకు కాంగ్రెస్‌లో సీట్లు!

మిగతా 12వ పేజీలో...

రూ.75కే లీటర్ పెట్రోలు

500కే సిలిండర్.. చెన్నైలో సుప్రీం బెంచ్

ఇండియా కూటమి గెలిస్తే సీఏఏ రద్దు

రైతుల రుణాలు వడ్డీ సహా మాఫీ

గృహిణులకు నెలకు రూ.వెయ్యి

జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదా, ఎన్నికలు

డీఎంకే 'లోక్‌సభ' మేనిఫెస్టోలో వరాలు

2



ఎన్డీఏ కూటమికే మా మద్దతు

కూటమితోనే ఏపీకి భవిష్యత్తు

చంద్రబాబు చేసిన అభివృద్ధిని వైసీపీ నిర్వీర్యం చేసింది

లోక్‌సత్తా జయప్రకాశ్ నారాయణ

12

సీఎంకు రైతుల కన్నీళ్లు కనిపించవా?

ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేయడమేనా?

ప్రజాపాలన అంటే ఫక్తు రాజకీయమేనా?

పార్టీ ఫిరాయింపులపై ఉన్న దృష్టి పంట నష్టంపై లేదెందుకు?: కేటీఆర్



లోక్‌సభ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ షురూ

తొలి దశ పోలింగ్‌కు నోటిఫికేషన్ విడుదల

నామినేషన్ సమర్పణకు మార్చి 27 తుది గడువు

2

తక్కువ ధరలకే బెస్ట్ లిథియం మెటల్ బ్యాటరీలు!

టీఐఎఫ్ఆర్ శాస్త్రవేత్తల ఘనత




హైదరాబాద్, మార్చి 20: తక్కువ ధరలకే సురక్షితమైన, నాణ్యమైన లిథియం మెటల్ బ్యాటరీలను తయారు చేసే విధానాన్ని హైదరాబాద్‌లోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్(టీఐఎఫ్ఆర్) శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఎలక్ట్రికల్ వాహనాలతో పాటు ఎలక్ట్రానిక్ సాధనాల్లో ఉపయోగించే లిథియం అయాన్ బ్యాటరీల కంటే లిథియం మెటల్ బ్యాటరీల్లో పది రెట్లు అధిక సామర్థ్యముంటుంది. అయితే వేగంగా చార్జింగ్ చేసేందుకు ఇవి అనుకూలంగా లేకపోవడం, అతిగా వేడెక్కి, షార్ట్ సర్క్యూట్ కావడం వంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ సమస్యలను నివారించి అధిక స్టోరేజ్ సామర్థ్యమున్న లిథియం మెటల్ బ్యాటరీలను తయారు చేయడంపై టీఐఎఫ్ఆర్‌కు చెందిన టీఎన్ నారాయణన్ నేతృత్వంలో శాస్త్రవేత్తలు పరిశోధనలు జరిపి సఫలీకృతులయ్యారు. దీనిపై శాస్త్రవేత్తలు ప్రీతియాదవ్, పల్లవి ఠాకూర్ మాట్లాడుతూ.. 'బ్యాటరీల్లో ఉండే ఎలక్ట్రోడ్ల మధ్య ఒక విభజన పొర ఉంటుంది. అది ఎలక్ట్రోడ్లను నిరంతరం వేరువేరుగా ఉంచుతుంది. షార్ట్ సర్క్యూట్‌ను నివారించాలంటే ఎలక్ట్రోడ్లను విడివిడిగా ఉంచడం ముఖ్యం. బ్యాటరీలను కొంతకాలం ఉపయోగించాక వాటిలోని ఎలక్ట్రోడ్లలో చెట్టు వేర్ల మాదిరిగా ఒక పదార్థం అభివృద్ధి చెందుతుంది. ఇలాంటివి అపరిమితంగా పెరిగిపోతే షార్ట్ సర్క్యూట్ అవుతుంది. గ్రాఫైట్ పొడిని ఉపయోగించి బ్యాటరీలోని ఎలక్ట్రోడ్లను విడివిడిగా ఉంచడంతో పాటు వేర్ల వంటి పదార్థం అభివృద్ధి చెందకుండా చేయడంలో విజయం సాధించాం' అని వివరించారు.

సత్వరమే యుద్ధాన్ని ముగించండి!

పుతిన్, జెలెన్‌స్కీలకు మోదీ ఫోన్

న్యూఢిల్లీ, మార్చి 20: రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ప్రధాని మోదీ బుధవారం వేర్వేరుగా ఫోన్‌లో మాట్లాడారు. రష్యా- ఉక్రెయిన్ యుద్ధాన్ని త్వరగా ముగించాలని, సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని ఇరుదేశాలకు ఆయన సూచించారు. అయిదోసారి రష్యా అధ్యక్షుడిగా గెలుపొందినందుకు పుతిన్‌కు అభినందనలు తెలిపారు. రాబోయే రోజుల్లో భారత్-రష్యా మధ్య ప్రత్యేక, విశేష వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు అంగీకారం కుదిరినట్లు మోదీ ఎక్స్(ట్విటర్) వేదికగా వెల్లడించారు. అలాగే ద్వైపాక్షిక సహకారానికి సంబంధించిన అంశాలతో పాటు భారత్-రష్యాలకు సంబంధించిన అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలపై మోదీ, పుతిన్ చర్చించారు. చర్చలు, దౌత్య యత్నాల ద్వారానే ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగించాలన్న భారత్ వైఖరిని మోదీ మరోసారి పునరుద్ఘాటించారు. ఆ తర్వాత జెలెన్‌స్కీతో మాట్లాడుతూ.. రష్యా- ఉక్రెయిన్ సమస్యను పరిష్కరించేందుకు చేసే ప్రయత్నాలకు భారత్ మద్దతు కొనసాగుతుందని మోదీ తెలిపారు. భారత్-ఉక్రెయిన్ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం గురించి జెలెన్‌స్కీతో చర్చించినట్లు ఆయన వెల్లడించారు. కాగా, సార్వత్రిక ఎన్నికల తర్వాత మోదీని తమ తమ దేశాలకు రావాల్సిందిగా పుతిన్, జెలెన్‌స్కీలు ఆహ్వానించారని అధికారులు తెలిపారు.

లోకం తీరు




ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	36.0	23.4
నిజామాబాద్	35.5	22.8
ఆదిలాబాద్	34.2	19.2
సంగారెడ్డి	32.0	22.0
హైదరాబాద్	32.0	22.4

నిందితులను జైల్లోనే ఉంచేందుకు ఎన్ని చార్జిషీట్లు?

(మొదటి పేజీ తరువాయి)



న్యాయవాది అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజుకు తెలిపింది. ఝార్ఖండ్ అక్రమ మైనింగ్ కేసులోని నిందితుడు ప్రేమ్ ప్రకాశ్ (మాజీ సీఎం హేమంత్ సోరెన్ సహాయకుడు) దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. 'నిందితుడు 18 నెలలుగా జైల్లోనే ఉన్నాడు. ఇది మమ్మల్ని ఇబ్బందికి గురిచేస్తోంది. అందుకే మీ (ఈడీ) దృష్టికి తీసుకొస్తున్నాం. నిందితుడిని మీరు అరెస్టు చేసినప్పుడే విచారణ మొదలు కావాలి' అని స్పష్టంచేసింది. దీనిపై స్పందించిన ఎస్వీ రాజు.. పిటిషనర్ సాక్ష్యాధారాలను తారుమారు చేసే అవకాశముందని వాదించారు. అయితే ఆయన వాదనతో ఏకీభవించని కోర్టు.. 'అతను (ప్రేమ్ ప్రకాశ్) అలాంటిది ఏదైనా చేస్తే మా వద్దకు రండి' అంటూ వ్యాఖ్యానించింది. అలాగే ఢిల్లీ మద్యం కేసులో అరెస్టయిన ఆప్ సీనియర్ నేత మనీశ్ సిసోడియా జైలు శిక్షను కూడా కోర్టు ప్రస్తావించింది. అయితే దర్యాప్తు పురోగతిని నిర్ధారించేందుకు ఒక నెల పాటు విచారణ జరపాలన్న ఈడీ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న కోర్టు.. ప్రేమ్ ప్రకాశ్‌కు మధ్యంతర బెయిల్‌ను నిరాకరిస్తూ విచారణ వాయిదా వేసింది.

ఫాస్టర్ సెల్‌ను రోజూ రెండుసార్లు చూడండి

న్యూఢిల్లీ, మార్చి 20: నిందితులకు బెయిల్ ఇస్తూ తాము ఇచ్చిన ఆదేశాలను కొందరు జైలు అధికారులు వెంటనే అమలు చేయకపోవడంపై సుప్రీంకోర్టు స్పందించింది. కోర్టు ఆర్డర్లకు సంబంధించి 2022 మార్చిలో అప్పటి సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ హయాంలో 'ఫాస్ట్ అండ్ సెక్యూర్డ్ ట్రాన్స్‌మిషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్ రికార్డ్స్ (ఫాస్టర్) సెల్' పేరిట ఏర్పాటు చేసిన ప్రోటోకాల్‌ను జైలు అధికారులందరూ తప్పనిసరిగా పాటించాలని ఆదేశించింది. దేశవ్యాప్తంగా ఉన్న జైలు సూపరింటెండెంట్లందరూ రోజుకు రెండుసార్లు (ఉదయం, సాయంత్రం) విధిగా ఫాస్టర్ సెల్ ద్వారా వచ్చే కోర్టు ఆదేశాలను చూడాలని ఆదేశాలు జారీచేసింది.

సీజేఐ లేకపోతే స్వతంత్రంగా వ్యవహరించదా?

» ఎన్నికల కమిషన్ స్వతంత్రతకేమీ ముప్పు లేదు: కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం కమిషనర్లను ఎంపిక చేసే కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేనంత మాత్రాన ఈసీ స్వతంత్రంగా వ్యవహరించదని ఎలా అంటారని కేంద్ర ప్రభుత్వం నిలదీసింది. ఎన్నికల కమిషనర్ల నియామకంపై తాము గత సమావేశాల్లో ఆమోదించిన సీఈసీ చట్టాన్ని రాజకీయ దురుద్దేశాలతోనే వ్యతిరేకిస్తున్నారని సుప్రీంకోర్టుకు తెలిపింది. తాజాగా ప్రభుత్వం చేపట్టిన ఇద్దరు ఎన్నికల కమిషనర్ల నియామకాన్ని నిలిపివేయాలంటూ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) సంస్థ , కాంగ్రెస్ పార్టీ దాఖలు చేసిన పిటిషన్లను ప్రభుత్వం వ్యతిరేకించింది. తాము నియమించిన కమిషనర్ల సామర్థ్యం, అర్హతలపై ఎలాంటి అభ్యంతరాలు రాలేదని బుధవారం కేంద్ర ప్రభుత్వం తరఫున న్యాయ శాఖ అదనపు కార్యదర్శి సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో తెలిపారు. పిటిషనర్లు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం విచారణ జరపనుంది. కాగా, తాము ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడేందుకే కొత్త చట్టం చేశామని కేంద్రం తెలిపింది. ఎన్నికల కమిషనర్ల భద్రతకు, స్వతంత్రతకు ఢోకా లేదని స్పష్టం చేసింది.

రోహింగ్యాలను శరణార్థులుగా గుర్తించలేం

న్యూఢిల్లీ, మార్చి 20: రోహింగ్యాలను శరణార్థులుగా గుర్తించలేమని కేంద్రం తేల్చి చెప్పింది. రోహింగ్యాల అక్రమ వలసలతో దేశ భద్రతకు తీవ్రమైన ముప్పు పొంచి ఉందని హెచ్చరించింది. ఈ మేరకు బుధవారం సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్ దాఖలు చేసింది. 'విదేశీయుల చట్టం, 1946' కింద లేదా ఏ కారణాలూ లేకుండా జైళ్లలో మగ్గుతున్న రోహింగ్యాలను విడుదల చేయాలని కోరుతూ గతంలో దాఖలైన పిటిషన్‌కు సంబంధించి కేంద్రం ఈ అఫిడవిట్ సమర్పించింది. విదేశీయులకు శరణార్థులుగా గుర్తింపునివ్వటం దేశ విదేశాంగ విధానానికి సంబంధించిన అంశం కూడానని, ఆయా దేశాలతో ఉన్న సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలు వంటివి దీంతో మిళితమై ఉంటాయని కేంద్రం వెల్లడించింది. ఇది కోర్టులు, చట్టాల పరిధికి అతీతమైనదని పేర్కొంది.

పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగాన్ని నోటిఫై చేసిన కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 20: ఆన్‌లైన్‌లో ఉన్న సమాచారాన్ని తనిఖీ చేసి అవి నిజమో కాదో చెప్పేందుకు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ప్రారంభించిన 'ఫ్యాక్ట్ చెక్ (నిజనిర్ధారణ)' విభాగాన్ని కేంద్ర ఐటీ శాఖ బుధవారం నోటిఫై చేసింది. తప్పుడు వార్తలు ప్రచురించినా, ప్రసారం చేసినా వాటిని తొలగించాలంటూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌కు, ఇంటర్‌నెట్ సర్వీస్ ప్రొవైడర్లకు, ఇతర సర్వీస్ ప్రొవైడర్లకు ఆదేశాలు జారీ చేసే అధికారం ఈ విభాగానికి ఉంటుంది. అయితే.. పీఐబీ ఇలా ఫ్యాక్ట్ చెక్ యూనిట్‌ను ఏర్పాటు చేయడం భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు విఘాతం కలిగించడమేనని 'ద ఇండియన్ న్యూస్ పేపర్ సొసైటీ' తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ఫ్యాక్ట్‌చెక్ విభాగాన్ని నోటిఫై చేయకుండా ఆదేశాలివ్వాలంటూ ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై సుప్రీంకోర్టు గురువారం విచారణ జరపనుంది. ఇంతలోనే కేంద్రం.. పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగాన్ని నోటిఫై చేయడం గమనార్హం.

రూ.8,350 కోట్లు

» 2023 డిసెంబరు 29 నుంచి ఫిబ్రవరి 15 మధ్య జారీ చేసిన ఎలక్టోరల్ బాండ్ల విలువ ఇది

» ఆర్టీఐ ద్వారా అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ జవాబు

న్యూఢిల్లీ, మార్చి 20: ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది ఫిబ్రవరి 15నే అయినా.. ఆ తీర్పును రిజర్వ్ చేసింది 2023 నవంబరులో. ఆ తర్వాత.. డిసెంబరు 29 నుంచి తీర్పు వెలువరించే రోజు దాకా మోదీ సర్కారు ముద్రించిన ఎన్నికల బాండ్ల విలువ ఎంతో తెలుసా? అక్షరాలా రూ.8,350 కోట్లు. ఈ రెండున్నర నెలల సమయంలో మోదీ సర్కారు ఒక్కొక్కటీ రూ.కోటి విలువ చేసే 8,350 ఎలక్టోరల్ బాండ్లను ముద్రింపజేసింది. లోకేశ్ బాత్రా అనే సామాజిక కార్యకర్త సమాచారహక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ ఇచ్చిన సమాచారమిది. అంటే.. సుప్రీంకోర్టు ఈ పథకంపై యథాతథస్థితిని కొనసాగిస్తుందనే నమ్మకం కేంద్రానికి ఉన్నట్లుగా కనిపిస్తోందని లోకేశ్ బాత్రా అభిప్రాయపడ్డారు. 2018లో ఈ పథకం అమల్లోకి వచ్చినప్పటి నుంచీ ప్రభుత్వం ముద్రించిన మొత్తం ఎలక్టోరల్ బాండ్ల విలువ రూ.35,600 కోట్లు. ఇక.. 2018 నుంచి 2023 నడుమ ఎన్నికల బాండ్లను జారీచేసినందుకుగాను, ఈ పథకాన్ని అమలు చేసినందుకుగాను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన కమీషన్‌గా తీసుకున్న సొమ్ము రూ.13.5 కోట్లు అని ఆర్టీఐ సమాధానం ద్వారా వెల్లడైంది. ఈ ఏడాది ముద్రించిన 8350 బాండ్లకు అయిన ఖర్చు వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

దేశంలో స్టార్టప్ విప్లవం

2014లో వందలోపే.. ప్రస్తుతం 1.25 లక్షల స్టార్టప్‌లు.. మళ్లీ వచ్చేది మేమే

» కొందరిని పదేపదే లాంచ్ చేయాల్సి వస్తోంది

» 'స్టార్టప్ మహాకుంభ్'లో రాహుల్‌ను ఉద్దేశిస్తూ మోదీ


స్టార్టప్ మహాకుంభ్‌లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, మార్చి 20: కేంద్రంలో ఎన్డీయే అధికారంలోకి వచ్చాక దేశంలో స్టార్టప్‌ల సంఖ్య గణనీయంగా పెరిగిందని.. 2014లో వందలోపు ఉన్న స్టార్టప్‌లు ప్రస్తుతం 1.25 లక్షలకు చేరుకున్నాయని, వాటితో దాదాపు 12 లక్షల మంది యువత ప్రత్యక్షంగా అనుబంధాన్ని కలిగి ఉన్నారని ప్రధాని మోదీ తెలిపారు. ప్రపంచంలోనే భారత్ మూడో అతిపెద్ద స్టార్టప్‌ల దేశమని, మన వద్ద వందకుపైగా యూనికార్న్‌లున్నాయని వెల్లడించారు. భారతీయ స్టార్టప్‌లు 12 వేలకుపైగా పేటెంట్ల కోసం దరఖాస్తు చేసుకున్నాయని, ఈ సంఖ్య మరింత పెరగాలని మోదీ సూచించారు. వేగంగా మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు పేటెంట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో మూడు రోజులుగా జరుగుతున్న 'స్టార్టప్ మహాకుంభ్'ను మోదీ బుధవారం సందర్శించి ప్రసంగించారు.ఐటీ రంగంలో ఒక స్టార్టప్ విజయం సాధించకపోతే మరో స్టార్టప్‌ను తీసుకొస్తారని.. కానీ, రాజకీయాల్లో మాత్రం కొందరిని పదేపదే ప్రయోగించాల్సి వస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీని ఉద్దేశించి ప్రధాని మోదీ చెణుకులు విసిరారు. 'స్టార్టప్‌లను లాంచ్ చేసే వారి సంఖ్య ఎక్కువే. రాజకీయాల్లో ఇటువంటి వారి సంఖ్య మరింత ఎక్కువ. స్టార్టప్‌ల రంగం ప్రయోగాత్మకంగా ఉంటుంది. ఒకటి విఫలమైతే మరో కొత్త దాని కోసం పరిశోధిస్తారు. కానీ, రాజకీయాల్లో అలా లేదు. కొందరిని పదే పదే లాంచ్ చేయాల్సి వస్తోంది' అంటూ రాహుల్ పేరు ప్రస్తావించకుండా పరోక్షంగా వ్యాఖ్యానించారు. ఎన్నికల తర్వాత వరుసగా మూడోసారి ప్రభుత్వంలోకి వచ్చి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడతామని మోదీ ధీమా వ్యక్తం చేశారు. సాధారణంగా ఎన్నికలు ముగిసిన తర్వాతే వ్యాపార, వాణిజ్య సంస్థలు భారీ కార్యక్రమాలు పెట్టుకుంటాయని, కానీ, పెద్ద ఎత్తున జరుగుతున్న స్టార్టప్ మహాకుంభ్ కార్యక్రమం మళ్లీ తమ ప్రభుత్వమే వస్తుందనటానికి ఓ సంకేతమన్నారు.

ఆలోచనా ధోరణి మారింది

ఒకప్పుడు విద్య అంటే ఉద్యోగం కోసమేనని, ప్రభుత్వ ఉద్యోగం వస్తేనే జీవితంలో స్థిరపడ్డామనే అభిప్రాయాలు ఉండేవని.. ఇప్పుడు ఆ ఆలోచనా ధోరణి మారిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారతీయ యువత ఉద్యోగాలు అడగటం లేదని, ఉద్యోగాలను సృష్టిస్తోందన్నారు. ఇదంతా దేశాన్ని ఊపేస్తోన్న స్టార్టప్ విప్లవం వల్లే సాధ్యమైందని చెప్పారు. గతంలో ఏదైనా కొత్త ఆలోచనతో ఉన్న వారికి దానిని ఆచరణలో పెట్టాలంటే నిధులు ఎవరు సమకూరుస్తారన్న బెంగ ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని తెలిపారు. యువత తమ సామర్థ్యాన్ని చాటుకుంటోందని ప్రశంసించారు. అంతరిక్షం వంటి పలు రంగాల్లో భారతీయ స్టార్టప్‌లు గొప్ప ఫలితాలను సాధిస్తున్నాయన్నారు.

బాండ్ల వివరాలు బయటకొస్తే.. రాహుల్ మొహం చూపించలేరు!

ఎలక్టోరల్ బాండ్ల పూర్తి సమాచారం వెల్లడైనప్పుడు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ప్రతిపక్ష ఇండియా కూటమి మొహం చూపించలేరని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ఈ బాండ్ల ద్వారా రూ.6,200 కోట్లు ఎందుకు తీసుకున్నారో రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 'న్యూస్ 18' నిర్వహించిన సదస్సులో అమిత్ షా మాట్లాడారు. రాహుల్ గాంధీ నాయకత్వంలోని ఇండియా కూటమి గతంలో మాదిరిగానే 'కట్ మనీ' (కమీషన్లు) దండుకోవాలనుకుంటోందని, అందుకే ఎలక్టోరల్ బాండ్లను వ్యతిరేకిస్తోందని ఆరోపించారు. ఈ బాండ్ల పూర్తి వివరాలు బయటపెట్టాలన్న సుప్రీం కోర్టు తీర్పు వల్ల రాజకీయ పార్టీలకు విరాళాల్లో మళ్లీ నల్లధనం ప్రవేశించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బాండ్ల వల్ల నల్లధనం అంతమయ్యే దశకు వచ్చిందన్నారు. "గతంలో రాజకీయ విరాళాలు నగదు రూపంలో వచ్చేవి. ఎవరైనా రూ.1500 విరాళం ఇస్తే, రూ.100 మాత్రమే పార్టీ ఖజానాకు వెళ్లేవి. మిగతా రూ.1400 సొంత జేబుల్లోకి వెళ్లేవి. దాన్ని స్విస్ బ్యాంకుకు తరలించేవారు" అని అమిత్ షా అన్నారు.

లోక్‌సభ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ షురూ

న్యూఢిల్లీ, మార్చి 20 : లోక్‌సభ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. తొలి దశలో దేశంలోని 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 102 లోక్‌సభ సీట్లకు ఏప్రిల్ 19న పోలింగ్ జరగనుంది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఎన్నికల సంఘం బుధవారం జారీ చేసింది. దీంతో నామినేషన్ల స్వీకరణ కూడా ప్రారంభమైంది. అభ్యర్థులు తమ నామినేషన్లు సమర్పించేందుకు మార్చి 27వ తేదీ తుది గడువు. అయితే, ఓ పండగ నేపథ్యంలో బిహార్‌లో మార్చి 27న సెలవు రోజు కావడంతో అక్కడ మాత్రం నామినేషన్ల స్వీకరణ మార్చి 28తో ముగుస్తుంది. అభ్యర్థుల నుంచి స్వీకరించిన నామినేషన్ల పరిశీలన మార్చి 28న జరుగుతుంది. బిహార్‌లో మాత్రం మార్చి 30న నిర్వహిస్తారు. ఇక, నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు మార్చి 30 కాగా బిహార్‌లో ఈ గడువును ఏప్రిల్ 2గా నిర్ణయించారు. తొలి దశలో అరుణాచల్ ప్రదేశ్, అసోం, బిహార్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, జమ్మూకశ్మీర్, లక్షద్వీప్, పుదుచ్చేరిలో ఎన్నికలు జరగనున్నాయి.

ఒక్కశాతం మంది చేతిలో 40శాతం సంపద

» దేశంలో పరిస్థితులపై వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ ల్యాబ్ నివేదిక

న్యూఢిల్లీ, మార్చి 20: దేశంలోని కొద్ది మంది చేతుల్లోనే సంపద కేంద్రీకృతమవుతూ నానాటికీ అది మరింత వృద్ధి చెందుతోంది. ఫలితంగా ఆదాయ అసమానతలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. ఈ విషయం తాజాగా మరో అధ్యయనంలో స్పష్టమైంది. 2022-23 సంవత్సరంలో అగ్రశ్రేణిలోని ఒక శాతం మంది సంపన్నుల ఆదాయం, సంపద వరుసగా 22.6 శాతానికి, 40.1 శాతానికి ఎగబాకిందని 'ఇన్‌కమ్ అండ్ వెల్త్ ఇన్‌ఈక్వాలిటీ ఇన్ ఇండియా, 1922-2023: ది రైజ్ ఆఫ్ బిలియనీర్ రాజ్' పేరుతో వెల్లడైన వర్కింగ్ పేపర్ తెలిపింది. థామస్ పికెట్టి (పారిస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ లాబ్), లుకాస్ చాన్సెల్ (హార్వర్డ్ కెనెడీ స్కూల్, వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ లాబ్), నితిన్ కుమార్ భారతి (న్యూయార్క్ యూనివర్సిటీ, వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ లాబ్) ఈ నివేదికను రూపొందించారు. 2022-23 నాటికి అగ్రశ్రేణి 1 శాతం సంపన్నుల ఆదాయం, సంపద చరిత్రాత్మక గరిష్ఠ స్థాయిలో ఉన్నాయని పేపర్ పేర్కొంది. ఆదాయ వాటాలో ప్రపంచంలో అత్యధికం కాగా, ఈ విషయంలో దక్షిణాఫ్రికా, బ్రెజిల్, అమెరికాను కూడా అధిగమించినట్టు తెలిపింది. భారత్ ప్రస్తుతం బ్రిటిష్ రాజ్‌కన్నా ఎక్కువ అసమానత్వంతో ఉందని పేర్కొంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1980 ప్రారంభం వరకు ఈ అసమానత్వం తగ్గింది. అయితే 2000 తర్వాతి నుంచి ఇది వేగంగా పెరిగింది. 1922లో దేశంలోని అగ్రస్థాయి 1 శాతం సంపన్నుల ఆదాయం వాటా 13 శాతం ఉండేదని వర్కింగ్ పేపర్ తెలిపింది. ప్రభుత్వం ఆర్థిక సంస్కరణ లకు శ్రీకారం చుట్టిన తర్వాత సంపన్నుల ఆదాయం గణనీయంగా పెరుగుతూ వస్తోంది. కాగా, 2022-23లో దేశంలోని 167 సంపన్న కుటుంబాల నికర సంపదపై 2 శాతం 'సూపర్ టాక్స్' విధించి ఉంటే జాతీయ ఆదాయంలో 0.5 శాతం రాబడి వచ్చేదని, అది పెట్టుబడులకు దోహదపడేదని నివేదిక సూచించింది. దేశంలో ఆర్థిక సమాచారం పేలవంగా ఉందని పేర్కొంది.

సంతోషకర దేశాల్లో భారత్ ర్యాంకు 126

» మనకంటే పేద దేశాల్లో ఆనందం ఎక్కువే

» ఏడేళ్లుగా టాప్‌లో 'ఫిన్లాండ్'.. 2,3 స్థానాల్లో డెన్మార్క్, ఐస్‌ల్యాండ్



టాప్-10 దేశాలు
ఫిన్లాండ్, డెన్మార్క్, ఐస్‌ల్యాండ్, స్వీడన్, ఇజ్రాయెల్, నెదర్లాండ్స్, నార్వే, లక్సెంబర్గ్, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా.

న్యూయార్క్, మార్చి 20: ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదుగుతున్న భారత్.. మానవాభివృద్ధి సూచీ(హెచ్‌డీఐ), నిరుద్యోగిత, సంతోషం వంటి సూచీల్లో మాత్రం వెనకబడే ఉంది. 'అంతర్జాతీయ ఆనంద దినోత్సవం(మార్చి 20)' సందర్భంగా బుధవారం ఐక్యరాజ్య సమితి(ఐరాస) అనుబంధ సంస్థ సస్టైనబుల్ డెవలప్‌మెంట్(సుస్థిరాభివృద్ధి) సొల్యూషన్స్ నెట్‌వర్క్ సంతోషకర దేశాల ర్యాంకులను విడుదల చేసింది. 143 దేశాలు ఈ జాబితాలో ఉండగా.. భారత్ స్థానం 126. గత ఏడాది స్థానాన్ని భారత్ పదిలపరుచుకుంది. అయితే.. మిగతా దేశాలతో పోలిస్తే.. యువత(127వ ర్యాంకు), దిగువ మధ్య వయసు(127), ఎగువ మధ్యవయసు(121), వయోవృద్ధులు(121) కేటగిరీల ర్యాంకులను బట్టి.. భారత్‌లో సంతోషం అనేది అన్నివయసుల వారికి దాదాపుగా సమానంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఆత్మ సంతృప్తి, తలసరి జీడీపీ, సామాజిక మద్దతు, జీవనకాలం, స్వేచ్ఛ, దాతృత్వం, అవినీతి వంటి అంశాల ఆధారంగా సంతోషకర దేశాల జాబితాను రూపొందిస్తారు. ఇక సంతోషకర దేశాల్లో ఫిన్లాండ్ ఎప్పటి లాగే అగ్రస్థానంలో నిలిచింది. ఫిన్లాండ్ టాప్‌లో ఉండడం ఇది వరుసగా ఏడోసారి. మొదటి మూడు స్థానాలను నార్డిక్ దేశాలు-- ఫిన్లాండ్, డెన్మార్క్, ఐస్‌ల్యాండ్ కైవసం చేసుకోవడం గమనార్హం.! గత ఏడాది అక్టోబరు నుంచి హమాస్‌తో యుద్ధం చేస్తున్న ఇజ్రాయెల్ కూడా ఐదో ర్యాంకులో ఉంది. టాప్-10లో పెద్ద దేశాలు లేవు. టాప్-10లో 1.5 కోట్ల కంటే ఎక్కువ జనాభా ఉన్న దేశాలు నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా మాత్రమే. టాప్-20లో కూడా 3 కోట్ల కంటే ఎక్కువ జనాభా ఉన్న దేశాలు కెనడా, బ్రిటన్ మాత్రమే..! ఈ జాబితాలో మన పొరుగుదేశాలు-- చైనా(60), నేపాల్(93), పాకిస్తాన్(108), మయన్మార్(118) మెరుగైన ర్యాంకుల్లో ఉండగా.. శ్రీలంక 128వ, బంగ్లాదేశ్ 129వ ర్యాంకులను కైవసం చేసుకున్నాయి. తాలిబాన్ల పాలనలోకి వెళ్లిన తర్వాత తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ఆఫ్ఘానిస్థాన్ ఈ జాబితాలో అట్టడుగున నిలిచింది. 2006 నుంచి ఆఫ్ఘానిస్థాన్‌తోపాటు.. లెబనాన్, జోర్డాన్ ప్రజలు ఆనందాన్ని కోల్పోతూ వస్తున్నారని, సెర్బియా, బల్గేరియా, లాత్వియా వంటి దేశాల్లో పరిస్థితి మాత్రం మెరుగైందని 'ప్రపంచ సంతోషకర దేశాలు-2024' నివేదిక స్పష్టం చేస్తోంది.

ర్యాంకులు చేజార్చుకున్న అమెరికా, జర్మనీ

సుమారు దశాబ్దకాలంపాటు అమెరికా, జర్మనీ దేశాలు ఈ జాబితాలో టాప్-20లో ఉండేవి. ఈ ఏడాది అవి కిందకు దిగజారి, 23, 24 స్థానాలకు చేరాయి. అయితే.. కోస్టారికా, కువైత్ దేశాలు టాప్-20లోకి ఎగబాకడం గమనార్హం..! ఈ దేశాలు వరుసగా 12, 13 స్థానాలను దక్కించుకున్నాయి.

సద్గురు వాసుదేవ్‌కు బ్రెయిన్ సర్జరీ

(మొదటి పేజీ తరువాయి)



ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకున్నారు.ఆయనకు స్కానింగ్‌లు నిర్వహించిన వైద్యులు ఆయన తలలో రక్తస్రావం అవుతున్నట్లు గుర్తించారు. మార్చి 17న ఆయనకు సర్జరీ చేశారు. ఇప్పుడాయన వేగంగా కోలుకుంటున్నారని వైద్యులు ప్రకటించారు. "సద్గురు మెదడులో ప్రాణాంతక పరిస్థితి ఉన్నప్పటికీ ఆయన రోజువారీ కార్యక్రమాల్లో తలమునకలై దాన్ని పట్టించుకోలేదు. ఆయనకు తీవ్రమైన తలనొప్పి వేధిస్తున్నప్పటికీ మార్చి 8న జరిగిన శివరాత్రి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మార్చి 15, 16వ తేదీల్లో ఢిల్లీలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు తీవ్రమైన తలనొప్పితోనే ఆయన మార్చి 14న అక్కడకు వెళ్లారు. తలనొప్పి ఎక్కువగా ఉండడంతో అదే రోజు ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకున్నారు. ఆయన తలలో తీవ్రమైన రక్తస్రావం అవుతోందని డాక్టర్లు గుర్తించి వెంటనే సర్జరీ చేయాలని సూచించారు. మార్చి 17న ఆయన ఆరోగ్యం మరింత క్షీణించడంతో హుటాహుటిన అపోలో ఆస్పత్రిలో చేరారు. ఆయన ఆస్పత్రిలో చేరిన కొద్ది గంటల్లోనే వైద్యులు ఆయనకు బ్రెయిన్ సర్జరీ నిర్వహించారు." అని ఇషా ఫౌండేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. ఆస్పత్రిలో కోలుకుంటున్న సద్గురు బుధవారం తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో హాస్యాత్మక ధోరణిలో ఒక వీడియోను విడుదల చేశారు. తన తలలో ఏదో వెతికేందుకు వైద్యులు తన తలను కోశారని, ఖాళీగా ఉండడంతో వెంటనే కుట్లు వేశారని చెప్పారు. కాగా, ఆస్పత్రిలో ఉన్న సద్గురుకు ప్రధాని మోదీ ఫోన్ చేసి పరామర్శించారు.

500కే సిలిండర్.. 75కే లీటర్ పెట్రోల్

» రైతు రుణాలు వడ్డీ సహా మాఫీ

» గృహిణులకు నెలకు రూ.వెయ్యి

» డీఎంకే మ్యానిఫెస్టోలో వరాలు



చెన్నై, మార్చి 20(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి తమిళనాడులోని అధికారపక్షం డీఎంకే ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేసింది. డీఎంకే మహిళా విభాగం నాయకురాలు కనిమొళి నాయకత్వంలో ఏర్పాటైన ప్రత్యేక కమిటీ ఈ మ్యానిఫెస్టోను రూపొందించింది. స్టాలిన్ మ్యానిఫెస్టోను ఆవిష్కరించారు. ప్రతిపక్ష ఇండియా కూటమి లోక్‌సభ ఎన్నికల్లో గెలిస్తే పౌరసత్వ సవరణ చట్టం-2019(సీఏఏ)ను రద్దు చేస్తామని ప్రకటించారు. అలాగే, జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామన్నారు. వంటగ్యాస్ సిలిండర్‌ను రూ.500కే ఇస్తామని, లీటరు పెట్రోలు రూ.75, డీజిల్ రూ.65కు అందజేస్తామని తెలిపారు. దేశవ్యాప్తంగా రైతుల రుణాలు వడ్డీతో సహా మాఫీ చేస్తామని, అన్ని రాష్ట్రాల్లో గృహిణులకు ప్రతినెలా రూ.1,000 అందజేస్తామని పేర్కొన్నారు. గవర్నర్ వ్యవస్థ రద్దుకు కృషి చేస్తామని, నీతి ఆయోగ్‌ను రద్దు చేస్తామని, హైవేలపై టోల్‌గేట్లను రద్దు చేస్తామని ప్రకటించారు. తమిళనాడులో నీట్‌ను రద్దు చేస్తామని, శ్రీలంక తమిళులకు భారత పౌరసత్వం ఇస్తామని వెల్లడించారు. దేశవ్యాప్తంగా బడిపిల్లలందరికీ ఉదయం అల్పాహారం అందజేస్తామని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కోసం స్వామినాథన్ సిఫారసులు అమలు చేస్తామన్నారు.

కాంగ్రెస్‌లోకి బిహార్ నేత పప్పు యాదవ్

న్యూఢిల్లీ, మార్చి 20 : లోక్‌సభ ఎన్నికల వేళ బిహార్‌లో రాజకీయాలు వేగంగా మారిపోతున్నాయి. గతంలో ఐదుసార్లు ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన, ప్రాంతీయ పార్టీ జన్ అధికార్ అధినేత రాజేశ్ రంజన్ అలియాస్ పప్పు యాదవ్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశారు. ఈ సందర్భంగా పప్పు యాదవ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మోదీ నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడతానని అన్నారు. కాంగ్రెస్, ఆర్జేడీ కలిసి పోటీ చేయడం వల్ల లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. పప్పు యాదవ్ భార్య రంజిత్ రంజన్ ప్రస్తుతం కాంగ్రెస్ తరఫున రాజ్యసభ ఎంపీగా ఉన్నారు. బిహార్‌లోని సీమాంచల్ ప్రాంతంలో పేరున్న పప్పు యాదవ్‌కు ఎంపీ టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు తెలిసింది. మరోవైపు బీఎస్పీ బహిష్కృత ఎంపీ డానిష్ అలీ కూడా కాంగ్రెస్‌లో చేరారు. ఆయన ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహా నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

58 ఏళ్ల వయసులో ఐవీఎఫ్‌కు అనుమతి ఎలా?

» సిద్ధూ మూసేవాలా తల్లిదండ్రులకు చిక్కులు

న్యూఢిల్లీ, మార్చి 20: ప్రముఖ పంజాబీ గాయకుడు, దివంగత సిద్ధూ మూసేవాలా తల్లిదండ్రులు బాల్‌కౌర్ సింగ్, చరణ్ కౌర్ ఐవీఎఫ్ (ఇన్-విట్రో ఫెర్టిలైజేషన్) పద్ధతిలో రెండో బిడ్డకు జన్మనిచ్చిన అంశం వివాదానికి కారణమవుతోంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ప్రస్తుతం చరణ్‌కౌర్ వయస్సు 58 సంవత్సరాలు, బాల్‌కౌర్ సింగ్‌కు 60 ఏళ్లు. దీంతో వీరు చిక్కుల్లో పడ్డారు. నిబంధనల ప్రకారం ఐవీఎఫ్ పద్ధతిలో బిడ్డను కనడానికి అనుమతించే వయస్సు 21 నుంచి 50 ఏళ్లు మాత్రమే. కానీ, మూసేవాలా తల్లి చరణ్ కౌర్‌ను 58 ఏళ్ల వయసులో ఈ విధానానికి ఎలా అనుమతించారని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పంజాబ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. చరణ్ కౌర్ ఐవీఎఫ్ చికిత్స ద్వారా గర్భం దాల్చిన విషయం ఇటీవల ఒక వార్తాపత్రికలో వచ్చిన కథనం ద్వారా తమ దృష్టికి వచ్చిందని, ఈ చికిత్సకు సంబంధించిన నివేదిక సమర్పించాలని కోరుతూ ఈ నెల 14న పంజాబ్ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ విషయాన్ని ఆప్ నేతృత్వంలోని భగవంత్ మాన్ ప్రభుత్వం బుధవారం ఎక్స్ (ట్విటర్) వేదికగా వెల్లడించింది. 'సీఎం భగవంత్ మాన్ పంజాబీల గౌరవాన్ని, మనోభావాలను ఎల్లప్పుడూ గౌరవిస్తారు. బాల్‌కౌర్ దంపతుల ఐవీఎఫ్ చికిత్సకు సంబంధించిన పత్రాలను అడుగుతోంది కేంద్ర ప్రభుత్వమే.. మేం కాదు' అని ట్వీట్ చేసింది. కాగా, బాల్‌కౌర్ సింగ్, చరణ్‌కౌర్ దంపతులకు సిద్ధూ మూసేవాలా ఒక్కడే సంతానం. గాయకుడు, కాంగ్రెస్ నేత అయిన సిద్ధూను 2022 మే 29న దుండగులు తుపాకీతో కాల్చి చంపారు.

షేర్‌మార్కెట్‌లో నష్టపోయి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

» నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఘటన

మిర్యాలగూడ అర్బన్, మార్చి 20: షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోవడంతో మనస్తాపానికి గురైన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం రాత్రి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌లో ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గోలి శ్రీనివాసరావు (43) ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా (వర్క్ ఫ్రమ్ హోం) పని చేస్తున్నాడు. అతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. రెండేళ్ల క్రితం విభేదాలు తలెత్తడంతో భార్య అతనితో ఉండటం లేదు. భార్యాభర్తల మధ్య ఏర్పడిన గొడవల కారణంగా పోలీస్‌స్టేషన్‌లో కేసులు సైతం పెట్టుకొని కోర్టు విచారణ ఎదుర్కొంటున్నారు. అయితే, శ్రీనివాసరావు షేర్ మార్కెట్‌లో నష్టాలు చవిచూడటం ద్వారా ఆర్థికంగా దెబ్బతిని అప్పుల ఊబిలో చిక్కుకున్నాడు. దీంతో మానసికంగా కుంగిపోయాడు. తల్లిదండ్రులు బయటకు వెళ్లిన సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలు తెలుసుకున్నారు. శ్రీనివాసరావు గదిలో పోలీసులకు సూసైడ్ నోట్ లభ్యమైంది. షేర్ మార్కెట్ నష్టం, భార్య, పిల్లలు దూరమవడంతో మానసికంగా నలిగిపోతూ ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్‌లో రాసినట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు శ్రీనివాసరావు తండ్రి హన్మంతరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాంగ్రెస్ పాలనను చూసి ఓర్వలేకే ఆరోపణలు

» బీసీలు తలదించుకునేలా మాట్లాడుతున్న ఈటల: బీర్ల ఐలయ్య

హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బీసీలు తలదించుకునేలా ఈటల రాజేందర్ మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మల్కాజిగిరిలో ఈటల గెలవడానికి బీజేపీ, బీఆర్ఎస్‌తో చీకటి ఒప్పందం చేసుకుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపై ఈటల చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం ఐలయ్య విలేకరులతో మాట్లాడారు. మాల్కాజిగిరిలో బీజేపీ గెలుపును సులువు చేసేలా బీఆర్ఎస్ డమ్మీ అభ్యర్థిని నిలబెట్టిందని, కేసీఆర్ తురుంఖాన్ అంటూ ఇప్పుడు బీజేపీ నాయకులు పొగుడుతున్నారన్నారు. ఇతర పార్టీల నుంచి నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల తరువాత బీజేపీ, బీఆర్ఎస్ ఖాళీ అవుతాయన్నారు. మతచిచ్చు పెట్టి ఓట్లు దండుకోవాలని బీజేపీ చూస్తోందన్నారు. కార్పొరేషన్ పదవుల్లో బీసీలకు అన్యాయం జరగలేదని, అన్ని సామాజిక వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. సర్వేల ఆధారంగానే కాంగ్రెస్ అధిష్ఠానం టికెట్లు కేటాయిస్తుందన్నారు. ఫోన్ ట్యాపింగ్ సంస్కృతి బీజేపీ, బీఆర్ఎస్‌లదేనని విమర్శించారు.


ప్లాస్టిక్ బాటిల్ నీటిలో పోషకాలు తక్కువే

» ఐఐటీ, మద్రాసు వర్శిటీ పరిశోధనలో వెల్లడి

చెన్నై, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ బాటిళ్లు, క్యాన్లలో విక్రయించే మినరల్ వాటర్‌లో పోషకాలు చాలా తక్కువ శాతం ఉన్నట్లు ఐఐటీ మద్రాసు, మద్రాసు విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహించిన పరిశోధనలో వెల్లడైంది. అధ్యయనంలో భాగంగా ప్రముఖ సంస్థలకు చెందిన ప్లాస్టిక్ బాటిళ్లు, క్యాన్ల ద్వారా సరఫరా చేసే నీటిలో చాలా తక్కువ శాతం మినరల్స్ ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. భూగర్భ జలాలను శుద్ధీకరించి ఆయా సంస్థలు మినరల్ వాటర్ పేరుతో ప్లాస్టిక్ బాటిళ్లు, క్యాన్లలో నీటిని విక్రయిస్తున్నాయని, అయితే ఆ నీళ్లలో క్యాల్షియం శాతం చాలా తక్కువగా ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. మనం తాగే నీటిలో 188 మిల్లీగ్రాముల దాకా క్యాల్షియం ఉండాలని భారత ప్రామాణిక సంస్థ చెబుతుండగా, ఈ ప్రైవేటు సంస్థలు సరఫరా చేసే నీటిలో 3.5 మిల్లీ గ్రాముల క్యాల్షియం మాత్రమే ఉంటున్నట్లు తేలిందన్నారు. ఇదే విధంగా 1.5 మిల్లీ గ్రాముల మేరకు ఫ్లోరైడ్ ఉండాలని ప్రామాణిక సంస్థ చెబుతుండగా క్యాన్, బాటిల్ నీటిలో 0.08 మిల్లీగ్రాములు ఫ్లోరైడ్ మాత్రమే ఉంటుందన్నారు. మినరల్స్ శాతం తక్కువగా ఉన్న క్యాన్, బాటిల్ వాటర్ తాగితే రెండు మూడు రోజులకే ప్రాణాలు కోల్పోతారని మద్రాసు ఐఐటీ ప్రొఫెసర్ ఇళంగో పేర్కొన్నారు.

బ్యారేజీల డిజైన్లు ఎలా తయారు చేశారు?

అధికారులను ప్రశ్నించిన ఎన్‌డీఎస్‌ఏ కమిటీ.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలపై క్రాస్ ఎగ్జామినేషన్



హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల డిజైన్లలో లోపాలు, నిర్మాణ వైఫల్యాలపై జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) విచారణ మళ్లీ మొదలైంది. ఇందుకోసం బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్న చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ.. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి దాకా జలసౌధలో అధికారులను వివిధ అంశాలపై ప్రశ్నించింది. కాళేశ్వరం లింక్-1లో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్న రామగుండం మాజీ ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లుతోపాటు ఈఎన్‌సీ(జనరల్)గా పనిచేసి, ఇటీవలే రాజీనామా చేసిన సి.మురళీధర్‌రావును కమిటీ విచారించింది. ప్రధానంగా ఈఎన్‌సీ (జనరల్) విభాగంలో పనిచేసిన అధికారులతోపాటు ప్రాజెక్టు ప్లానింగ్, హైడ్రాలజీ, ఇన్వెస్టిగేషన్, డీపీఆర్‌ల తయారీ విభాగం అధికారులను ఆరా తీసింది. లైడార్ సర్వే ఆధారంగా డీపీఆర్ తయారు చేశామని అధికారులు చెప్పగా.. ఆ లైడార్ సర్వే సరైందా? కాదా? అన్నది పరిశీలించారా? దీనిపై క్షేత్రస్థాయిలో ఏమైనా సర్వే చేశారా? అని కమిటీ ప్రశ్నించింది. లైడార్ సర్వే వాస్తవంగా ఉందా? లేదా? అన్నది ఏ అధికారులు పరిశీలించారని ఆరా తీసింది. అనంతరం నీటిపారుదల శాఖలోని కీలకమైన సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) అధికారులందరినీ కమిటీ ప్రశ్నించింది. డిజైన్లను ఏ విధంగా తయారు చేశారు? ఏయే పరీక్షల ఆధారంగా డిజైన్లు తయారయ్యాయి? భూ పరీక్షల నివేదికలతోపాటు జియోగ్రాఫికల్ రిపోర్టులేమైనా ఉన్నాయా? డిజైన్ల ఆమోదానికి ప్రామాణికమేంటి? వంటి వివరాలను ఆరా తీశారు.

అన్నారం బ్యారేజీ వైఫల్యానికి డిజైన్లే కారణం

(మొదటి పేజీ తరువాయి)

రక్షణ కోసం రెండు రకాల చర్యలను జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సూచించిందని, ఇందులో ఒకటి వానాకాలంలోపు చేపట్టాల్సింది కాగా, మరొకటి శాశ్వత ప్రాతిపదికన చేపట్టాలని తెలిపింది. బ్యారేజీ తీవ్రంగా దెబ్బతిన్నందున.. మోడల్ స్టడీస్ ఆధారంగా శాశ్వత మరమ్మతులే పరిష్కారమని నిర్మాణ సంస్థ నివేదించింది. దీనికోసం బ్యారేజీని ఖాళీ చేయాలని కోరినా చేయలేదని గుర్తు చేసింది. బ్యారేజీ రక్షణ కోసం డిజైన్, డ్రాయింగ్ అందిస్తే.. వాటి ఆధారంగానే రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది. తక్షణమే బ్యారేజీని ఖాళీ చేయాలని, ఆ తర్వాత మరమ్మతులు/పునరుద్ధరణ పనులు చేపట్టేదాకా అన్ని గేట్లనూ తెరిచి.. వచ్చిన వరదను వచ్చినట్లే దిగువకు వదిలిపెట్టాలని పేర్కొంది.

అన్నారం బ్యారేజీపై సమగ్ర నివేదిక..

విచారణ సందర్భంగా నీటిపారుదల శాఖ అధికారులు అన్నారం బ్యారేజీపై సమగ్ర నివేదికను నిపుణల కమిటీకి అందజేశారు. రూ.1452.81 కోట్లతో అన్నారం బ్యారేజీ నిర్మాణం జరిగిందని, 2019 జూలై 21వ తేదీన బ్యారేజీని ప్రారంభించుకోగా.. 2019 డిసెంబరు 17వ తేదీన పని పూర్తయినట్లు సర్టిఫికెట్లు జారీ చేసినట్లు తెలిపారు. 2019లో వరదల తరువాత గేట్లను తెరవగా.. దిగువ భాగంలో రక్షణ చర్యల కోసం నిర్మించిన పనులన్నీ కొట్టుకుపోయాయని నివేదించారు. ఇక బ్యారేజీకి 2020లో 5.06 లక్షల క్యూసెక్కుల వరద వచ్చిందని, 2021లో 10.73 లక్షల క్యూసెక్కులు, 2022లో 17.40 లక్షల క్యూసెక్కులు, 2023లో 12.92 లక్షల క్యూసెక్కుల వరద వచ్చిందని వివరించారు. భారీ వరదలతో దిగువన ఉన్న సిమెంట్ కాంక్రీట్ బ్లాకులు కొట్టుకుపోయాయని, వాటిని తిరిగి యథాతథ స్థితిలోకి చేర్చినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. 2019 నుంచి ఏటా దిగువ భాగంలో బ్యారేజీ రక్షణ కోసం కట్టిన కట్టడాలు కొట్టుకుపోతూనే ఉన్నాయని, దాంతో వరద ప్రవాహ వేగంపై నమూనా అధ్యయనాలు చేయించామని తెలిపారు. దాంతో బ్యారేజీ దిగువ భాగంలో అప్రాన్‌లను విస్తరించాలని నివేదిక ఇచ్చినట్లు గుర్తు చేశారు.

నేడు మళ్లీ సీడీవోతో భేటీ

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల డిజైన్లకు సంబంధించి సీడీవో అధికారులను నిపుణుల కమిటీ గురువారం కూడా విచారించనుంది. ప్రాజెక్టు అధికారులతో సమావేశం కానుంది. మధ్యాహ్నం నిర్మాణ సంస్థలతో పాటు ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీలు, క్వాలిటీ కంట్రోల్, ఇన్వెస్టిగేషన్ అథారిటీలతో సమావేశమవుతుంది. ఇక శుక్రవారం ఉదయం స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్‌తోపాటు నిపుణులు, వివిధ సంస్థలతో చంద్రశేఖర్ అయ్యర్ కమిటీ సమావేశం కానుంది. మధ్యాహ్నం టీఎస్‌ఈఆర్‌ఎల్ అధికారులతో సమావేశమై నమూనా అధ్యయనాలను పరిశీలించనుంది.

అమెరికాలో హైదరాబాద్ విద్యార్థి కిడ్నాప్!

» తండ్రికి ఫోన్ చేసి రూ.లక్ష డిమాండ్

» ఈ నెల 7 నుంచి అర్ఫాత్

జాడ లేదని కుటుంబీకుల ఆవేదన

హైదరాబాద్/సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్య కోసం అమెరికా తెలుగు విద్యార్థులపై దాడులు, కిడ్నాప్‌లు పెరుగుతూనే ఉన్నాయి. బోస్టన్‌లో ఇంజనీరింగ్ చదువుతున్న అభిజిత్ పరుచూరు హత్య జరిగిన వారం రోజుల్లోనే మరో విద్యార్థి కిడ్నాప్ విషయం వెలుగుచూసింది. హైదరాబాద్‌లోని నాచారం ప్రాంతానికి చెందిన మహ్మద్ అబ్దుల్ అర్ఫాత్(25) గత ఏడాది మేలో ఒహైయోలోని క్లీవ్‌లాండ్ యూనివర్సిటీలో మాస్టర్స్ చదవడానికి వెళ్లాడు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులతో క్రమం తప్పకుండా మాట్లాడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో అర్ఫాత్ ఈ నెల 7న చివరిసారిగా తండ్రి మహ్మద్ సలీంతో మాట్లాడాడు. ఆ తర్వాత అతని ఫోన్ స్విచాఫ్ కావడమే కాకుండా ఆచూకీ తెలియలేదని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం అమెరికాకు చెందిన ఓ ఫోన్ నంబరు నుంచి సలీంకు ఫోన్ వచ్చింది. 'మీ కుమారుడ్ని కిడ్నాప్ చేశాం. వెంటనే 1200 డాలర్లు (రూ.లక్ష) పంపకపోతే అతన్ని కిడ్నీలు తీసుకునే మాఫియాకు అప్పగిస్తాం' అని బెదిరించారని సలీమ్ తెలిపారు. అయితే ఆ సొమ్ము ఎలా చెల్లించాలనే విషయాన్ని వారు చెప్పలేదన్నారు. వెంటనే వాషింగ్టన్ పోలీసులకు ఆ ఫోన్ నంబరును ఇచ్చి, జరిగిన విషయాన్ని తెలియజేసినట్లు చెప్పారు. అర్ఫాత్ కోసం లుక్అవుట్ నోటీస్ జారీచేసిన వాషింగ్టన్ పోలీసులు.. ఫోన్ నంబరు ఆధారంగా అర్ఫాత్ కోసం గాలిస్తున్నారని సలీం తెలిపారు. అర్ఫాత్ జాడ త్వరగా తెలుసుకోవాలని, అందుకు సహకరించాలంటూ ఎంబీటీ నేత అంజదుల్లాఖాన్ సాయంతో విదేశాంగ శాఖను కోరారు. కాగా, అమెరికాలో పై చదువుల కోసం వెళ్లిన భారతీయ విద్యార్థులపై దాడులు, కిడ్నాప్‌లు సాధారణమవుతుండగా, తెలుగు విద్యార్థులకు సంబంధించి 3 నెలల్లో ఇది తొమ్మిదో ఘటన కావడం గమనార్హం. వరుస ఘటనల నేపథ్యంలో అమెరికాలో ఉన్నత విద్య కోసం పిల్లలను పంపిన తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

బీజేపీ సభ్యత్వం తీసుకున్న తమిళిసై

» కష్టమైన నిర్ణయాన్ని ఇష్టపడే తీసుకున్నానని వ్యాఖ్య



చెన్నైలో బీజేపీ సభ్యత్వం స్వీకరిస్తున్న తమిళిసై, చిత్రంలో కిషన్ రెడ్డి

చెన్నై, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ పదవికి రాజీనామా చేసి మళ్లీ బీజేపీకి సేవలందించాలనే కష్టమైన నిర్ణయాన్ని ఇష్టపడే తీసుకున్నానని తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాల మాజీ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ వ్యాఖ్యానించారు. బుధవారం ఆమె బీజేపీ సభ్యత్వం తీసుకున్నారు. చెన్నైలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు అన్నామలై, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, ఎల్. మురుగన్ సమక్షంలో ఆమె పార్టీ సభ్యత్వం స్వీకరించారు. ఈ సందర్భంగా తమిళిసై మాట్లాడుతూ.. బీజేపీ తమిళనాడు శాఖ అధ్యక్షురాలిగా పార్టీకి, గవర్నర్‌గా రెండు రాష్ట్రాల ప్రజలకు సేవలందించిన తాను మళ్లీ క్రియాశీలక రాజకీయాల్లో ప్రవేశించడం ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుతం తాను సాధారణ కార్యకర్తగా పార్టీలో చేరానని, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ విజయానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రస్తుతం తమిళనాట బీజేపీకి సానుకూల పవనాలు వీస్తున్నాయని చెప్పారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరవాలి

» రాష్ట్ర ప్రభుత్వానికి మండవ లేఖ

హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): యాసంగి వరి కోతలు ప్రారంభమైన నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు బుధవారం ప్రభుత్వానికి లేఖ రాశారు. రెండు, మూడు రోజుల వరకు క్వింటాలుకు రూ.2,400 చొప్పున ధాన్యం కొనుగోలు చేసిన రైస్‌మిల్లర్లు, వ్యాపారులు.. వాతావరణ పరిస్థితులు మారగానే ధరను 1,900కు తగ్గించారని, దీంతో రైతులకు కనీస మద్దతు ధర అందటంలేదని, ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి రాసిన లేఖలో విజ్ఞప్తి చేశారు. అకాల వర్షాలకు కొన్ని జిల్లాల్లో పంటనష్టం జరిగిందని, రైతులకు పరిహారం చెల్లించాలని మండవ వ్యవసాయ తుమ్మలకు లేఖ రాశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఎదురులేని నేత!

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇటీవల జరిగిన ఎన్నికల్లో అత్యధిక శాతం ఓట్లు సాధించి ఐదోసారి మళ్ళీ అధ్యక్షుడైనారు. ఆయనకు వ్యతిరేకంగా పోటీచేసిన మూడుపార్టీల అభ్యర్థులకు నాలుగుశాతం చొప్పున ఓట్లు పడితే, మిగతా 88శాతం ఓట్లు పుతిన్‌కే వచ్చాయి. తొలి ఓటు పడడానికి ముందే ఫలితం నిర్ణయమైపోయింది అంటూ పాశ్చాత్యమీడియా ఎప్పటినుంచో రాస్తున్నది, ఆయా దేశాల ప్రతిస్పందన కూడా తదనుగుణంగానే ఉన్నది. రష్యా మిత్రదేశాధినేతలు పుతిన్‌ను అభినందించారు, కలసికట్టుగా ప్రపంచాన్ని ఉద్ధరించాలని ఆకాంక్షించారు.

ప్రధానిగా, అధ్యక్షుడిగా మొత్తం పాతికేళ్ళు గద్దెమీద ఉన్న పుతిన్ అంటే ప్రజలకు నిజంగానే విసుగెత్తలేదో, సుదీర్ఘకాలం అధికారంలో ఉండటం వల్ల ఒనగూరిన ప్రయోజనమో తెలియదు కానీ, 2030లో కూడా గెలిస్తే ఈయన ఏకంగా స్టాలిన్ రికార్డునే బద్దలుకొడతారట. పుతిన్‌కు వ్యతిరేకంగా అధ్యక్ష ఎన్నికల బరిలో నిలబడినవారు నిజమైన ప్రత్యర్థులు కారన్న విషయం అందరికీ తెలుసు. ఉక్రెయిన్ యుద్ధాన్ని వ్యతిరేకించే ఒకరిద్దరిని సైతం చివరిదశలో అభ్యర్థుల జాబితాలోనుంచి తొలగించి పుతిన్ ప్రజాదరణకు ప్రమాదం లేకుండా అధికారులు చూసుకున్నారు. అసలు ఉక్రెయిన్ యుద్ధాన్ని ప్రశ్నించడమే తీవ్రమైన నేరం కిందకు మార్చేసిన తరువాత, ఎన్నికల్లో ప్రధానమైన అంశమంటూ ఏమీ మిగలకుండా పోయింది. ఉక్రెయిన్ యుద్ధాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన అలెక్సీ నావెల్నీ కనుక బతికుంటే, ఎన్నికల వేళ స్వేచ్ఛగా తిరగగలిగివుంటే ఫలితాలు ఈ విధంగా ఉండేవా? ఆరేళ్ళనాటి ఎన్నికల్లో పుతిన్‌కు కంటినిండా నిద్రలేకుండా చేసినందుకు ఈ జనాకర్షక ప్రజానాయకుడు ఈ ఎన్నికలకు సరిగ్గా నెలరోజుల ముందు ఆర్కిటిక్ జైలులో అనుమానాస్పదంగా మరణించాడు. దేశాన్ని విడిచిపోయినవాడు, తిరిగి ప్రజలకోసమంటూ వచ్చినందుకు ప్రాణాలు కోల్పోయాడు. నావెల్నీ మాత్రమే కాదు, ఆయనకు ముందు పుతిన్‌కు సవాలువిసరగలడనుకున్న బోరిస్ నెమ్త్సోవ్ అనే నాయకుడు ఏకంగా నడిరోడ్డుమీదే హత్యకు గురైనాడు. అనేకమంది అసమ్మతినేతలు, రాజకీయ ప్రత్యర్థులు అనూహ్యంగా కన్నుమూస్తుండటంతో, పుతిన్‌తో వైరం ఉన్నవారు ఎత్తయిన భవనాల్లో నివసించకూడదని, ముఖ్యంగా బాల్కనీలో నిలబడి ప్రకృతిని ఆస్వాదించకూడదని ఓ హెచ్చరికలాంటి జోక్ ప్రచారంలో ఉంది. రాజకీయ ప్రత్యర్థులను అణచివేయడం, అసమ్మతి గొంతునొక్కడంలో పుతిన్ ఇంకా సంపూర్ణ విజయం సాధించలేకపోయి ఉండవచ్చును కానీ, అన్ని వ్యవస్థలమీదా ఆయన ఆధిపత్యం నూరుశాతం పూర్తయింది.

అంతమాత్రాన, పుతిన్ ఇప్పుడు సాధించిన ఘనవిజయమంతా అక్రమంగా ఆర్జించినదేనని అనడం అన్యాయమవుతుంది. బలమైన ప్రత్యర్థి అంటూ లేకపోయినందువల్ల ఆయన ఇంకా బలపడివుండవచ్చునేమో కానీ, ప్రజల్లో ఆయనకు విశేషమైన ఆదరణే ఉంది. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నంతో కృంగి, కృశించిన రష్యాకు తిరిగి ప్రాభవాన్ని కట్టబెట్టిన నేతగా ఆయనను అభిమానిస్తున్నవారున్నారు. ఒకప్పుడు పాశ్చాత్యదేశాల ముందు తలదించుకున్న దేశాన్ని తిరిగి తలెగరేసే స్థాయికి తెచ్చాడని, అవమానభారం నుంచి బయటపడవేశాడని ఆయనను కీర్తిస్తున్నవారు ఉన్నారు. ఆయన నిర్ణయాలు, చర్యలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉన్నదన్న పాశ్చాత్యదేశాల ప్రచారం పూర్తిగా తప్పని, రష్యా ప్రయోజనాల పరిరక్షణ వినా పుతిన్‌కు ఏ స్వార్థమూ లేదని నమ్మే ప్రజల సంఖ్య అధికంగానే ఉన్నదని కొందరు అంటారు. ఉక్రెయిన్ యుద్ధంతో రష్యన్లు తీవ్రంగా విసిగిపోయి ఉన్నారని, అది తెచ్చిన కష్టాలతో నానాబాధలు పడుతున్నారని విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. కానీ, పాశ్చాత్యదేశాల రాజ్య విస్తరణ కాంక్షను ప్రతిఘటించేందుకు, నాటో వీరంగానికి అడ్డుకట్టవేసేందుకు ఈ యుద్ధం సాగుతోందని రష్యన్లు నమ్ముతున్నారు. దీనికితోడు, పశ్చిమదేశాల ఆంక్షలు రష్యాను గట్టిగా దెబ్బతీయలేకపోయాయి. మిగతారోజుల్లో కంటే ఈ యుద్ధకాలంలో అనేక రెట్ల చమురు తోడుతూ, అమ్ముతూ రష్యా ఆర్థికంగా మరింత బలంగా ఉంది. యుద్ధం మూడోఏడాదిలోకి ప్రవేశించినప్పటికీ, రష్యాదే పైచేయిగా ఉంటోంది. ఈ ఎన్నికలను ఉక్రెయిన్ యుద్ధం మీద రెఫరెండమ్‌గా ప్రచారం చేసుకున్న పుతిన్, ఫలితాలు వెలువడిన అనంతరం ప్రజలకు ధన్యవాదాలు తెలియచేశారు. ఈ సందర్భంగా యుద్ధాన్ని కొనసాగించే విషయంలో ఆయన చేసిన వ్యాఖ్యలు, పాశ్చాత్య దేశాలకు చేసిన హెచ్చరికలను గమనిస్తే, ఆయన సమధికోత్సాహంతో ఉన్నాడని అర్థమవుతుంది. ఇప్పటికైతే పుతిన్‌ను సవాలు చేయగల నేత కనుచూపుమేరలో ఎవరూ లేరు.

పాతికేళ్లు ఆలస్యమైనా, సరైన తీర్పు!

జేఎంఎం ముడుపుల కేసుపై 1998 నాటి దురదృష్టకర తీర్పును తోసిపుచ్చుతూ మార్చి 5న సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఏకగ్రీవంగా ఇచ్చిన తీర్పు స్వాగతించాల్సినది. నిజానికి ఎప్పుడో జరగాల్సిన దిద్దుబాటిది. 1998 తీర్పు అత్యంత లోపభూయిష్టమైనది. 105(2), 194(2) అధికరణాలకు కోర్టు ఆ రోజు వక్రభాష్యం చెప్పింది. చట్టసభ సభ్యులు పార్లమెంటు లేదా రాష్ట్ర శాసనసభలో ఓటు వేసే లేదా ప్రసంగించే సందర్భాల్లో లంచం తీసుకుంటే నేర విచారణ నుంచి వారికి మినహాయింపు ఉంటుందని ప్రకటించింది. తద్వారా చట్టసభలో తమ ఓటును లేదా ప్రసంగాన్ని ప్రభావితం చేయటానికి సభ్యులు లంచం తీసుకున్నా ఎటువంటి చట్టపరమైన చర్యలూ తీసుకోకుండా 1998 తీర్పు సంపూర్ణ రక్షణ కల్పించింది. ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఉండాల్సిన రక్షణకు ఇది దిగ్భ్రాంతికర వ్యాఖ్యానం. ఆ తీర్పు తప్పని చెప్పటం ద్వారా కోర్టు ఇప్పుడు సరైన రీతిలో వ్యవహరించింది.

రాష్ట్రంలో, జాతీయ స్థాయిలో ఎన్నికైన ప్రజాప్రతినిధులు, నియమితులైన అధికారులు అందరూ ప్రజాసేవకులే. అధికారంలో ఉన్నారు కాబట్టి వారి చర్యలకు పూర్తిస్థాయి రక్షణ అంటే ఆమోదయోగ్యం కాదు. తాను అధ్యక్షుడిగా ఉన్నప్పుడు చేసిన పనులన్నిటికీ సంపూర్ణ రక్షణ ఉండాలని డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు డిమాండ్ చేస్తున్నారు. అమెరికా సుప్రీంకోర్టు వచ్చే కొన్ని వారాల్లో ఆ కేసును విచారిస్తుంది. ట్రంప్ కేసు తీర్పులో కొత్తగా చేసే నిర్ణయం ఏమీ లేదు: అధ్యక్షుడు దైవాంశసంభూత చక్రవర్తి కాదు, ఎల్లకాలం సంపూర్ణ రక్షణ లభించదు.

దీనర్థం, ప్రభుత్వాధికారులు, చట్టసభ సభ్యులకు ఎటువంటి రక్షణా వద్దనటం కాదు. విధి నిర్వహణలో భాగంగా చట్టబద్ధంగా తీసుకునే నిర్ణయాలు, చర్యలకు సంబంధించి వారిపై సివిల్, క్రిమినల్ కేసులు దాఖలు చేయాలనటం కాదు. సభలో స్వేచ్ఛగా అభిప్రాయాల్ని చెప్పటం, లేదా ప్రశ్న అడగటం, ఓటు వేయటం సందర్భాల్లో అటువంటి రక్షణ చట్టసభ సభ్యులకి వర్తిస్తుంది. కానీ ఒక నిర్దేశిత రీతిలో ఓటు వేయటానికి, లేదా సభలో మాట్లాడటానికి, ఓ ప్రశ్న లేవనెత్తటానికి లంచాన్ని అంగీకరిస్తే, ఆ రకంగా లంచం తీసుకోవటానికి చట్టపరమైన చర్యల నుండి రక్షణ లభించదు. లంచం తీసుకోవటం ప్రజాసేవకుడి అధికారిక బాధ్యతల్లో భాగం కాదు. లంచం తీసుకునే వ్యక్తి ఏ స్థాయి ప్రజాసేవకుడైనా, అది నేరం. రాజ్యాధినేత వంటి బాధ్యతల్లో ఉన్న కొందరు ప్రజాసేవకులకు వాళ్ల పదవీ కాలంలో ప్రాసిక్యూషన్ నుంచి రక్షణ ఉండవచ్చు, కానీ అధికారం నుంచి వైదొలిగాక ఆ రక్షణ కొనసాగదు.

చట్టబద్ధ చర్యలు లంచాలకు మాత్రమే కాకుండా, సభ్యుల ఇతర చట్టవిరుద్ధ చర్యలకు కూడా వర్తిస్తుంది. ఉదాహరణకు, జో బైడెన్ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ధ్రువీకరించకుండా అమెరికా కాంగ్రెస్‌ను అడ్డుకునే ఉద్దేశంతో జనవరి 6, 2021న మూకలతో అరాచకత్వాన్ని రెచ్చగొట్టాడని, క్యాపిటల్‌పై దాడిని ప్రేరేపించాడని ట్రంప్‌పై ఆరోపణ. రాజ్యాంగబద్ధ వ్యవస్థను కూల్చటానికి నేరాన్ని ఎగదోసేందుకు బరితెగించాడు. అటువంటి చర్యలకు ప్రాసిక్యూషన్ నుంచి ఎటువంటి రక్షణా ఉండదు. అయితే, అధికారంలో ఉన్నప్పుడు తీసుకునే కొన్ని రకాల చర్యలకు భవిష్యత్తులో న్యాయ విచారణ నుంచి రక్షణ ఉండాలి. ఉదాహరణకు, తమ దేశానికి వ్యతిరేకంగా యుద్ధం చేసే తీవ్రవాదులను చంపేందుకు అమెరికా అధ్యక్షులు కొన్ని సందర్భాల్లో ఆదేశాలివ్వొచ్చు. అటువంటి కేసులకు సంబంధించి కీలక నాయకత్వ స్థానాల్లో ఉన్న కొద్దిమందికి మాత్రం సమాచారం తెలియచేస్తుంటారు. అందుకు ఎప్పటినుంచో ఓ పద్ధతి ఉంది. అదేవిధంగా, తీవ్రవాద ముప్పును తొలగించటానికి కొందరు వ్యక్తులు లక్ష్యంగా చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక ఆపరేషన్లకు భారత్‌లో ప్రధానమంత్రి అనుమతి మంజూరు చేయాల్సి ఉండవచ్చు. అటువంటి అధికారం ప్రధాని ప్రమాణ స్వీకారంలో భాగమైన అధికారిక చర్యే అవుతుంది. కాబట్టి భవిష్యత్తులో క్రిమినల్ న్యాయ విచారణ చర్యల నుంచి పూర్తిస్థాయి రక్షణ ఉండాలి.



జేఎంఎం ముడుపుల కేసుపై 1998 నాటి దురదృష్టకర తీర్పును తప్పని చెప్పటం ద్వారా సుప్రీంకోర్టు ఇప్పుడు సరైన రీతిలో వ్యవహరించింది. ఒకే ఒక్క బాధాకర అంశం న్యాయ వ్యవస్థ అలసత్వం. ప్రజాజీవితంలో నిజాయితీ, జవాబుదారీతనానికి సంబంధించిన ఒక కీలక అంశంపై ఇంగితజ్ఞానానికి సైతం అర్థమయ్యే తప్పుడు తీర్పుని తిరగరాయటానికి 25 ఏళ్లు పట్టటం న్యాయ వ్యవస్థకి గౌరవం కాదు.

సుప్రీంకోర్టు నిర్ణయం ఏ రకంగానూ ప్రభుత్వాధికారుల, చట్టసభ సభ్యుల అధికారాన్ని బలహీనపరచదు; అవినీతి, అధికార దుర్వినియోగాలకు సంబంధించి జవాబుదారీతనాన్ని పెంచుతుంది. లంచం తీసుకోవటానికి సంబంధించి మాత్రమే ప్రాసిక్యూషన్ వర్తిస్తుంది, ఆ తర్వాత సభ్యుడు ఎవరికి ఓటు వేశారన్నది ఆ పరిధిలోకి రాదు.

ఈ మొత్తం సుదీర్ఘ పరిణామంలో ఒకే ఒక్క బాధాకర అంశం న్యాయ వ్యవస్థ అలసత్వం. ప్రజాజీవితంలో నిజాయతీ, జవాబుదారీతనానికి సంబంధించిన ఒక కీలక అంశంపై ఇంగితజ్ఞానానికి సైతం అర్థమయ్యే తప్పుడు తీర్పుని తిరగరాయటానికి 25 ఏళ్లు పట్టటం న్యాయ వ్యవస్థకి గౌరవం కాదు. శిబూ సోరెన్ (జేఎంఎం ముడుపుల కేసులో ప్రధాన నిందితుడు) కోడలు సీతా సోరెన్ న్యాయ విచారణ నుంచి తనకు రక్షణ కోరిన సందర్భం నుంచే ఆ కేసు రావటం యాదృచ్ఛికం. 2012 రాజ్యసభ ఎన్నికల్లో ఒక ఎమ్మెల్యేగా జార్ఖండ్ అసెంబ్లీలో ఒక స్వతంత్ర అభ్యర్థికి ఓటు వేయటానికి సీతా సోరెన్ లంచం తీసుకున్నారన్నది ఆరోపణ. చివరికి తన పార్టీ అభ్యర్థికే ఆమె ఓటు వేశారు; కానీ లంచం తీసుకున్నారనటానికి ఆధారాలుంటే, ఎవరికి ఓటు వేశారన్నది ప్రాసిక్యూషన్‌కి అసంగతం. సీతా సోరెన్‌కి వ్యతిరేకంగా క్రిమినల్ న్యాయ విచారణ చర్యలను రద్దు చేయటానికి జార్ఖండ్ హైకోర్టు తిరస్కరించటం సరైన చర్య. దీనిపై 2012లో ఆమె సుప్రీంకోర్టుకు వెళ్లారు. ఏ రకమైన గందరగోళం లేని అటువంటి కీలక కేసుపై నిర్ణయం తీసుకోవటానికి సుప్రీంకోర్టుకి 11 ఏళ్లు పట్టింది! ఇద్దరు జడ్జీల బెంచ్ (2012) నుంచి ఆ కేసు నత్తనడకన ముగ్గురు జడ్జీల బెంచ్‌కి (2014) మారింది. చివరికి విస్తృత ధర్మాసనం ముందుకి (2019) వచ్చి, ఇప్పుడు 2024లో తేలింది. ఈ అసాధారణ జాప్యం చెబుతున్న పాఠం సుస్పష్టం: అత్యున్నత రాజ్యాంగ కోర్టు తనను తాను సమీక్షించుకోవాలి, మార్గాన్ని సరిదిద్దుకోవాలి. ఇటువంటి కేసులపై నిర్ణయం కొన్ని వారాల్లో చేయవచ్చు. రాజ్యాంగపరంగా తలెత్తే పర్యవసానాల దృష్ట్యా ఇలాంటి కేసులకి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. అటువంటి ముఖ్యమైన అంశాలను త్వరితంగా, సమర్థంగా న్యాయం అందిస్తూ పరిష్కరించేలా ఒక శాశ్వత రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటుకి బహుశా సమయం ఆసన్నమైంది.

○ డాక్టర్ జయప్రకాష్ నారాయణ్
లోక్‌సత్తా వ్యవస్థాపకులు

'దక్షిణ' ద్వారం తెరుచుకుంటుందా?

శివుడూ పార్వతీ పెళ్లిచేసుకుంటుంటే, అంబానీ చిన్న కొడుకు పెళ్లికి వచ్చినట్టుగా, పొలోమంటూ దేవలోకంలోని వివిఐపీలు అందరూ హిమాలయాలకు వెళ్లారట. ఉత్తరం దిక్కున బరువు ఎక్కువై భూమి ఒకవైపు ఒరిగిపోవడం మొదలుపెట్టింది. దక్షిణంవైపు బరువు పడితే కానీ, తూకం సరిపోదని అనుకుని అగస్త్యముని దక్షిణాదికి వచ్చి, బేలన్స్ చేశాడట. ఇదికాక మరొక కథ కూడా ఉంది. వింధ్య పర్వతం అడ్డూఆపూ లేకుండా నిలువుగా పెరిగిపోవడం మొదలు పెట్టిందట. ఆకాశంలోకి చొచ్చుకువెళ్లి సూర్యుడికీ చంద్రుడికీ కూడా అడ్డుపడి, గ్రహగతులు ఆగిపోయేట్టు చేసిందట. ఉత్తరానికీ దక్షిణానికీ రాకపోకలు కూడా అసాధ్యమయ్యాయట. లోకమంతా వచ్చి మొరపెట్టుకుంటే, అగస్త్యుడు వింధ్య దగ్గరికి వచ్చి, నేను దక్షిణం వైపు పోవాలి దారివ్వమని అడిగాడు. అగస్త్యుడంటేనే పర్వతాలనే కదిలించగలవాడు అని అర్థం కదా, అందుకని గౌరవంగా, వింధ్యుడు తలవంచి, తన ఎత్తు తగ్గించుకున్నాడు. నేను మళ్లీ దక్షిణం నుంచి ఉత్తరం వైపుకు తిరిగివెడతాను, అప్పటిదాకా ఇట్లాగే ఉండు అని అగస్త్యుడు చెప్పాడు. అగస్త్యుడు తిరిగి ఉత్తర దిక్కు వెళ్లలేదు. వంగిపోయిన వింధ్య అట్లాగే, దక్షిణానికి దారి ఇస్తూ మిగిలిపోయింది. దక్షిణం వాళ్లు, ముఖ్యంగా తమిళుల కథలో కొన్ని చేర్పులుంటాయి. తమిళుల మొదటి వ్యాకరణం పేరు అగత్తియం. రాసింది అగస్త్యుడు. అతను ఉత్తరాది నుంచి వస్తే వచ్చాడు కానీ, దక్షిణంలో స్థిరపడి, ద్రావిడం నేర్చుకుని భాషకు సేవ చేశాడు. ఆర్యద్రావిడ సమాజాలకు మధ్య అవరోధాలను తొలగించి, ఉత్తరం వారు దక్షిణానికి వలసరావడానికి, దక్షిణాన్ని లోబరచుకోవడానికి అగస్త్యుడిని ఒక సంకేతంగా చెప్పేవాళ్లు ఉన్నారు. బలిచక్రవర్తి కథ కూడా అటువంటిదే అంటారు!

ప్రధానమైన ద్రావిడ భాషలు మాట్లాడే ప్రాంతాలు భారతదేశంలో దక్షిణంలో ఉన్న మాట నిజమే కానీ, అంత మాత్రమే చెబితే సరిపోదు. మూడువైపులా సముద్రం ఆవరించిన ద్వీపకల్ప భాగంలో ఉన్నాయని కూడా చెప్పుకోవాలి. మధ్య ఆసియా నుంచి ఉత్తరభారతంలోకి ప్రవేశించిన ఆర్యులు ఐదునదుల మైదానాల నుంచి క్రమంగా గంగా యమునా బేసిన్‌లోకి విస్తరించి తమదైన నాగరికతను నిర్మించుకున్నారు. తమ ప్రస్థానాన్ని దక్షిణాదికి కొనసాగించడం వారికి అంత సులభం కాలేదు. వంగ దేశం నుంచి సముద్రతీరం గుండా ఓఢ్రదేశం మీదుగా దక్షిణానికి రావడం కూడా ఏమంత సులువు కాలేదు. మరణానంతర వైతరిణి ఒరిస్సాలోనే ఉందట. వింధ్యపర్వతశ్రేణి, దండకారణ్యం నైసర్గిక కుడ్యాలుగా నిలిచాయి. అశోకుడు ఆంధ్ర, కర్ణాటకలలో కూడా శిలాశాసనాలు వేశాడు కానీ, ఈ ప్రాంతాలు మగధలో భాగమయ్యాయో లేదో చెప్పలేము. మౌర్యులు, శాలివాహనులు, కాకతీయులు, మొగలులు, కుతుబ్ షాహీలు దిగువకు దూసుకుపోయారు కానీ, దక్షిణాన ఎంతో కొంత కొస అజేయంగానే మిగిలిపోయింది. భారతీయ జనతాపార్టీ పదేళ్ల రాజసూయంలో కూడా దక్షిణాగ్ర భాగం ఇంకా స్వాధీనం కాలేదు.

దక్షిణ రాష్ట్రాలలో కలిగే ప్రయోజనానికి మించి నరేంద్ర మోదీ ఎక్కువ కష్టపడుతున్నారు. 'సౌత్ పుష్' అంటున్నది జాతీయ ఇంగ్లీషు మీడియా. కొరకరాని కొయ్యగా ఉన్న దక్షిణాదిని ఈసారి లొంగదీసుకోవాలని ఆయన పట్టుదలగా ఉన్నారని చెప్పుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా దేశమంతటికీ తన రాజకీయ ప్రాబల్యాన్ని విస్తరించినా, ఆ పార్టీలో కూడా ఉత్తరాది నాయకత్వానిదే పైచేయి అయినా, స్థానికంగా అటానమీని అనుమతించింది. అనేక రంగాలలో ఉత్తరాది ఆధిపత్యానికి తానొక రాయబారిగా కాంగ్రెస్ వ్యవహరించలేదు. దక్షిణభారతంలో వ్యక్తమైన స్థానిక ఆకాంక్షలను నెరవేర్చింది, భయాలను గౌరవించింది. ప్రాంతీయ పార్టీ చేతిలో ఓడిపోవడం తమిళనాడుతోనే కాంగ్రెస్ మొదటిసారిగా రుచిచూసింది. బీజేపీ పరిస్థితి వేరు. అతి బలహీనంగా ఉన్న కాలం నుంచి (జనసంఘంగా ఉన్నప్పుడు కూడా) దాన్ని ఉత్తరాది పార్టీగానే దక్షిణాది జనం భావించారు. ఎమర్జెన్సీ తరువాత కానీ, 1980 దశకం చివరలో కానీ ఉత్తరాది మధ్యే వాద పార్టీ ప్రభంజనాలు దక్షిణాదిని పెద్దగా కదిలించలేదు. తమ జాతీయ వాదానికి దేశవ్యాప్త ఆమోదం కోసం, 'ప్రగతిశీల' భారతంలో విజయం కోసం భారతీయ జనతాపార్టీకి బెంగాల్ లోను, దక్షిణ రాష్ట్రాలలోను గెలుపు కావాలి. అతి సూక్ష్మ స్థాయి నుంచి పనిచేసుకుంటూ పథకం ప్రకారం బలాన్ని పెంచుకోగలిగిన 'శక్తి' బీజేపీకి ఉంది. కార్యశీలురైన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఫలితాలు ఎట్లా ఉన్నా, వారి ప్రయత్నాన్ని మెచ్చుకోవచ్చు.



ఒకనాడు ఎక్కడ ప్రజా ఉద్యమాలు బలంగా ఉన్నాయో అటువంటి చోట్లనే ఇప్పుడు మత ఉద్రిక్తతలు, తీవ్రజాతీయవాదంపై ఆకర్షణలు పెరిగిపోయాయి. చిన్న పట్టణాలలో, జిల్లా కేంద్రాలలో యువకులు, విద్యార్థులు మోదీ ఆకర్షణలో ఉన్నారని, 'కొత్త' రాజకీయాలంటే ఉర్రూతలూగుతున్నారని వింటున్నప్పుడు, తెలంగాణలో అనూహ్యమైనది జరగబోతున్నదా అనిపిస్తున్నది. నాలుగైదు స్థానాలు గెలుస్తుందని కొందరు, లేదు, తొమ్మిది స్థానాల దాకా గెలిచి కాంగ్రెస్‌ను రెండోస్థానంలోకి నెట్టివేస్తుందని మరి కొందరు లెక్కలు వేస్తున్నారు. ఏది నిజమైనా, అది బీజేపీని తెలంగాణలో రెండో స్థానానికి తెస్తుంది. బీఆర్ఎస్‌లో కొందరిని, కాంగ్రెస్‌లో కూడా కొందరిని తమ వైపు తిప్పుకుని చక్రం తిప్పగల అవకాశం బీజేపీకి వస్తుంది. 'మితవాద' జాతీయ జీవనస్రవంతిలో కలిసే అవకాశం తెలంగాణకు లభిస్తుంది.

అశోకుడు కాకపోయినా, హర్షుడు కొంత, ఔరంగజేబు మరికొంత దక్షిణంలోకి చొచ్చుకువచ్చి ఆ తరువాత ఆగిపోయారు. గోవా ఎట్లాగూ భౌగోళికంగా తప్ప సాంస్కృతికంగా దక్షిణం కాదు. తక్కిన ఐదు రాష్ట్రాలూ ఉత్తరాది ప్రభావం నుంచి సమానంగా రక్షించుకున్నాయని చెప్పలేము. కర్ణాటక విజయం బీజేపీకి కొత్తేమీ కాదు. పొత్తులతోనో, ఫిరాయింపులతోనో బీజేపీ కర్ణాటకలో ఒకటి రెండుసార్లు అధికారంలోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో 2014లోనే ఒక మైనర్ భాగస్వామిగా అయినా ప్రభుత్వంలో ఉన్నది. తెలంగాణలో, ముఖ్యంగా హైదరాబాద్‌లో ప్రభావశీలమైన ఉనికితో ఎప్పటి నుంచో ఉంటూ, గత పార్లమెంటు ఎన్నికలలో నాలుగు స్థానాలతో, సుమారు 20 శాతం ఓట్లతో పెద్ద విజయవిస్తరణ చేసుకోగలిగింది. కేరళలో 2016లో ఒక ఎమ్మెల్యేను గెలిపించుకున్న బీజేపీ, 2021లో 11 శాతానికి పైగా ఓట్లను సంపాదించింది. మరి కొత్తగా, దక్షిణ ద్వారాన్ని బద్దలు కొట్టడమనే ఘన కార్యంలో మోదీ ప్రస్తుతం ఉన్నారని అనడం సమంజసమేనా? అక్కడక్కడా బలంగానో, బలహీనంగానో ఉనికిలో ఉన్నప్పటికీ, సారాంశంలో దక్షిణాది ఇంకా పట్టుబడలేదన్న లోటు మాత్రం బీజేపీకి ఉన్నది. వింధ్యపర్వతం ఎక్కడున్నదో గుర్తించి, దాన్ని వంచగలిగితే, దక్షిణంలోకి మహాద్వారం తెరుచుకుంటుందని ఆశిస్తున్నది.

అంచుల్లో పలచబడుతున్నప్పటికీ, లోలోపలి అడవి దట్టంగానే మిగిలినట్టు, దక్షిణాదిలో కూడా కొంత అతి దక్షిణం ఉన్నది. భావపరంగానూ, భౌగోళికంగానూ కూడా ఉత్తరత్వానికి కొరుకుడుపడని కంచుకోటలు దక్షిణంలో మిగిలే ఉన్నాయి. వాటిని కొట్టగలిగితే, గంగా కావేరీ అనుసంధానం జరిగినట్టే. బీజేపీకి, మోదీకి అదే అంతిమలక్ష్యం కావచ్చును కానీ, ప్రస్తుతం దానిమీదే గురిపెట్టారనడం సరి కాదు. ఎందుకంటే, మోదీ 'సౌత్ పుష్' దాడి వ్యూహం కాదు. ఆత్మరక్షణా వ్యూహం మాత్రమే. ఉత్తరాదిలో ఈ సారి తరిగిపోయే అవకాశమున్న సంఖ్యను దక్షణాదిలో భర్తీ చేసుకోవడం కోసం మాత్రమే ఈ ప్రత్యేక ప్రయత్నం. తమిళనాడు, కేరళల్లో ప్రస్తుతానికి కొత్త ఆశ ఏమీ లేదు. ఆ రెండు రాష్ట్రాలలో గతం కంటె నాలుగు ఓట్లు పెంచుకోవడమే లక్ష్యం. అతి దక్షిణం అని భౌగోళికంగా చెప్పగలిగే రాష్ట్రాలు ఆ రెండూ. కర్ణాటకలో ఒకవేళ కాంగ్రెస్ మీద విముఖత కలిగినా, గతంలో ఉన్న బలాన్ని దాదాపుగా నిలుపుకోవడమే తప్ప అదనపు ప్రయోజనం లేదు. సాంస్కృతికంగా, సామాజికంగా ఆ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలు ఈ పాటికే ఉత్తరాది ప్రభావంలో పడిపోయాయి. కొత్తగా భావజాల పరంగా గెలుచుకునే ప్రాంతాలు, వర్గాలు ప్రస్తుతం అయితే లేవు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు, జనసేన, బీజేపీ కూటమి విజయం సాధించినప్పటికీ, అందులో బీజేపీ పాలు అతి తక్కువ. కాకపోతే, దీర్ఘకాలికంగా బీజేపీ విస్తరణ ప్రయత్నాలకు ఆ విజయం తోడ్పడవచ్చు. తెలంగాణలో బీజేపీ ప్రభావం పెరుగుతున్నదన్న వార్తలు నిజమైతే మాత్రం, అది ఆ పార్టీకి కీలకమయిన విజయం అవుతుంది. దక్షిణ దిశగా తోసిన 'తోపు' ఫలితం ఇచ్చినట్టు.



■ కె. శ్రీనివాస్

సందర్భం

ఎందువల్ల? అంటే, తెలంగాణలో అధిక ప్రభావం చూపగలిగితే కనుక, బీజేపీ వెంటనే రెండో స్థానానికి, అతి త్వరలో అధికారస్థానానికి చేరుకోగలుగుతుంది. తెలంగాణలో బలం పెంచుకోవడం అంటే, పొత్తుల సాయంతో ఆంధ్రాలో నాలుగు సీట్లు సంపాదించుకున్నట్టు కాదు. తన సొంత 'సిద్ధాంత' బలంతో సంపాదించుకున్నట్టు. తన వేళ్లను తెలంగాణ నేలలో బలంగా నాటుకున్నట్టు. తెలంగాణ సమాజం ఆ మేరకు బీజేపీయాకరణం చెందినట్టు కూడా. దాని పర్యవసానాలు, ప్రభావాలు ఎట్లా ఉంటాయో సామాజిక, రాజకీయ పరిశీలకులు పోల్చుకోవచ్చు. తమిళనాడు, కేరళ అతి దక్షిణం అయినట్టు, తెలంగాణ ఎప్పటి నుంచో పలచబడిన దక్షిణం. చారిత్రకంగా ఉత్తర, దక్షిణాల మధ్య ఉండడం వల్ల కావచ్చు, ఉత్తరాది వలసలు అధికంగా ఉండడం వల్ల కావచ్చు, ముస్లిమ్ పాలకుల కింద దీర్ఘకాలం ఉన్న చరిత్ర వల్ల కావచ్చు, తెలంగాణ బీజేపీకి పంట పండించుకోవడానికి అనువైన క్షేత్రంగా ఉండింది. అయితే, అక్కడ భూస్వామ్యానికి, రాచరికానికి వ్యతిరేకంగా పోరాడిన కమ్యూనిస్టు, విప్లవ చరిత్ర కూడా ఉన్నది కాబట్టి, మితవాద రాజకీయాలకు అనువైన పరిస్థితులు ఇంతకాలం లేకుండా పోయాయి. తెలంగాణ వేదిక మీద ప్రజా ఉద్యమ రాజకీయాలు బలహీనపడి, సామాజిక దృష్టికోణాలు పలచబడడం మొదలయింది. దురదృష్టవశాత్తు, అందుకు ప్రత్యేక రాష్ట్ర సాధన అనంతర దశాబ్ద కాలం కూడా తోడ్పడింది. ఒకనాడు ఎక్కడ ప్రజా ఉద్యమాలు బలంగా ఉన్నాయో అటువంటి చోట్లనే ఇప్పుడు మత ఉద్రిక్తతలు, తీవ్రజాతీయవాదంపై ఆకర్షణలు పెరిగిపోయాయి. చిన్న పట్టణాలలో, జిల్లా కేంద్రాలలో యువకులు, విద్యార్థులు మోదీ ఆకర్షణలో ఉన్నారని, 'కొత్త' రాజకీయాలంటే ఉర్రూతలూగుతున్నారని వింటున్నప్పుడు, తెలంగాణలో అనూహ్యమైనది జరగబోతున్నదా అనిపిస్తున్నది. నాలుగైదు స్థానాలు గెలుస్తుందని కొందరు, లేదు, తొమ్మిది స్థానాల దాకా గెలిచి కాంగ్రెస్‌ను రెండోస్థానంలోకి నెట్టివేస్తుందని మరికొందరు లెక్కలు వేస్తున్నారు. ఏది నిజమైనా, అది బీజేపీని తెలంగాణలో రెండో స్థానానికి తెస్తుంది. బీఆర్ఎస్‌లో కొందరిని, కాంగ్రెస్‌లో కూడా కొందరిని తమ వైపు తిప్పుకుని చక్రం తిప్పగల అవకాశం బీజేపీకి వస్తుంది. 'మితవాద' జాతీయ జీవన స్రవంతిలో కలిసే అవకాశం తెలంగాణకు లభిస్తుంది.

> భావపరంగానూ, భౌగోళికంగానూ కూడా ఉత్తరత్వానికి కొరుకుడుపడని కంచుకోటలు దక్షిణంలో మిగిలే ఉన్నాయి. మోదీ 'సౌత్ పుష్' దాడి వ్యూహం కాదు. ఆత్మరక్షణా వ్యూహం మాత్రమే. ఉత్తరాదిలో ఈ సారి తరిగిపోయే అవకాశమున్న సంఖ్యను దక్షణాదిలో భర్తీ చేసుకోవడం కోసం మాత్రమే ఈ ప్రత్యేక ప్రయత్నం.

కవితా సుమగంధం

తెల్లని మల్లె వికసించముందే
సువాసన మనసంతా అలుముకొంది



ఎప్పటికీ నాశనం కాని విత్తనం
కాగితమ్మీద తడిగా ఒలికి హృదయంగానో,
పిడికిలిగానో లోలోపల
భావసముద్రమై ఉరకలెత్తుతుంది



పొడిరాగాల గొంతు అయస్కాంతమై
మనసును ఊపేస్తుంది

ఎప్పటికీ ఆకాశం వీడని వానచినుకై
గుండెలోతుల్లో చిక్కుకుపోతోంది.



వేదనలో నినాదాలు లహరీ సహస్రాలై
నేలంతా ప్రవాహ ఝరులవుతాయి

నిద్రనెరుగని కన్నె బాధల సమూహంలో
కన్నీటి సిరా పయనిస్తుంది



దుఃఖార్తులను, అన్నార్తులను
ఆప్యాయంగా కౌగిలించుకొంటుంది
కాళిదాసు నుంచి నా వరకు...

– ర్యాలి ప్రసాద్

(నేడు అంతర్జాతీయ కవితా దినోత్సవం)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లేఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

కాళేశ్వరాన్ని వదిలించుకోక తప్పదు

మార్చి 1, 2024న ఆంధ్రజ్యోతి ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమైన 'కాళేశ్వరం ప్రాజెక్టుకు ఇక కాలం చెల్లినట్టేనా' అనే నా వ్యాసంపై అవాస్తవమైన ఆరోపణలు చేస్తూ మార్చి 13న 'కాళేశ్వరం నేటికీ కరువుపై జలాస్త్రమే' అనే శీర్షికతో వీరమల్ల ప్రకాష్ వ్యాసం రాశారు. ఆయనకి తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాలలో కీలక ఉద్యమకారునిగా గుర్తింపు ఉంది. ప్రకాష్ వ్యాసంలో నన్ను "తనను తాను వ్యవసాయ ఆర్థికవేత్తగా ప్రకటించుకున్నారు" అనడం వారి అవగాహన లోపానికి నిదర్శనం. వ్యవసాయ ఆర్థిక శాస్త్రంలో అత్యున్నతమైన డిగ్రీ పోస్ట్ డాక్టోరల్ ఫెలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఫిలిప్పీన్స్ లోని అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ నుంచి పొందిన తెలంగాణ రాష్ట్రంలోనే ఏకైక ఆర్థికవేత్తనని నాకు చెప్పుకోవాల్సిన పరిస్థితిని ప్రకాష్ కల్పించారు. అంతేకాకుండా ఆసియా అభివృద్ధి బ్యాంకు (ADB) చేత నీటివనరుల ఆర్థికవేత్తగా నియమించబడి వియత్నాంలో దాదాపు రెండేళ్ళు 'నీటిపారుదల ప్రాజెక్టులపై ప్రభుత్వ పెట్టుబడులు' ఏ మేరకు సమాజానికి ఉపయోగపడతాయో అనే అంశంపై పరిశోధించి వియత్నాం ప్రభుత్వానికి సలహా ఇచ్చిన అనుభవం నాకు ఉన్నట్లు ప్రకాష్‌కి తెలియకపోవచ్చు. ఇంకా నా వృత్తిపరమైన అనుభవానికి సంబంధించిన విషయాలను వికీపీడియా, గూగుల్ ద్వారా తెలుసుకోవచ్చు.

ప్రకాష్ తన వ్యాసంలో "2014లో ధాన్యం ఉత్పత్తి 45 లక్షల మెట్రిక్ టన్నుల నుండి 2023 నాటికి 3 కోట్ల మెట్రిక్ టన్నులకు పెరిగింది" అని పేర్కొన్నారు. కేసీఆర్, వారి భజన మండలి పదే పదే చెబుతున్న అబద్ధాలలో ఇది ఒక ప్రధానమైన అబద్ధం. ఈ అబద్ధ ప్రచారాన్ని ఆధారంగా చేసుకుని ప్రభుత్వ నివేదికలను చూడకుండా ఆయన ఇలాంటి అబద్ధపు గణాంకాలను తన వ్యాసంలో పేర్కొనడాన్ని బట్టి కేసీఆర్ భజన మండలిలో ఆయన కూడా సభ్యుడని తేలిపోయింది.

వాస్తవానికి వస్తే, వ్యవసాయ సంవత్సరం 2013 జూలై నుంచి జూన్ 2014 వరకు, అంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన జూన్ 2014 నాటికి, రాష్ట్రంలో మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తి 106.68లక్షల మెట్రిక్ టన్నులు. కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడిన తొలి రెండేళ్లలో అనగా 2016 నాటికి ఆహార ధాన్యాల ఉత్పత్తి దాదాపు సగానికి తగ్గి, కేవలం 51లక్షల మెట్రిక్ టన్నులకు పడిపోయింది. ఈ గణాంకాలను తెలంగాణ ప్రభుత్వ నివేదిక 'అగ్రికల్చర్ స్టాటిస్టిక్స్ ఎట్ ఎ గ్లాన్స్ – 2016', పేజీ 36లో స్పష్టంగా పేర్కొన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి 2021 జూన్ నాటికి 127.5 లక్షల టన్నులకు, 2022 జూన్ నాటికి 150 లక్షల మెట్రిక్ టన్నులకు చేరింది. ఈ వివరాలను భారత ప్రభుత్వ నివేదిక 'అగ్రికల్చర్ స్టాటిస్టిక్స్ ఎట్ ఎ గ్లాన్స్ 2022', పేజీ 27లో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ నివేదిక ప్రకారం భారతదేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తిలో మన రాష్ట్రం తొమ్మిదవ స్థానంలో మాత్రమే ఉంది. ఈ వాస్తవాన్ని దాచిపెట్టి దేశంలో తెలంగాణ ఆహార ధాన్యాల ఉత్పత్తిలో మొదటి స్థానంలో ఉందని పేర్కొనడం పూర్తిగా అవాస్తవం.

ఇక 2023 గణాంకాలకు వస్తే మూడవ ముందస్తు గణాంకాల ప్రకారం రాష్ట్రంలోని ఆహార ధాన్యాలు ఉత్పత్తి 176 లక్షల టన్నులుగా (ఒక కోటి 76లక్షలు) నిర్ధారించబడింది. ఇది ఎన్నికల సంవత్సరం కాబట్టి ఈ గణాంకాలను పెంచి చూపించాలని ఆర్థిక గణాంకాల అధికారులపై ఒత్తిడి తీసుకు వచ్చిన మాట వాస్తవం కాదా? కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ రాష్ట్రం ఇచ్చిన 2023కి సంబంధించిన ఈ గణాంకాలను పరిగణనలోకి తీసుకోలేదు. ప్రకాష్ తన వ్యాసంలో ధాన్యం ఉత్పత్తి గత తొమ్మిదేళ్లలో 45 లక్షల మెట్రిక్ టన్నుల నుండి 3 కోట్ల మెట్రిక్ టన్నులకు పెరిగినట్టు చెప్తుతున్న లెక్కలు ఏ ప్రభుత్వ నివేదికల నుంచి తీసుకొని రాశారో వారికే తెలియాలి.

మరొక అవాస్తవం ఏమిటంటే డాక్టర్ అంబేడ్కర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు ఉమ్మడి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో ఎలాంటి అనుమతులు రాలేదని చెప్పడం. ఇది పూర్తిగా అబద్ధం. ఉమ్మడి రాష్ట్రంలో నిబద్ధత గల ఓ మాజీ ముఖ్యమంత్రి ఈ ప్రాజెక్టుకు కావలసిన దాదాపు అన్ని అనుమతులను కేంద్ర ప్రభుత్వం ఇచ్చినట్లు స్వయంగా నాతో చెప్పారు. ఈ విషయాన్ని నిర్ధారించాల్సింది ప్రకాష్ కాదు నీటిపారుదల శాఖ. ఇది నిజమా కాదా అని ఆ శాఖ వివరణ ఇవ్వాలి. మరో విషయం ఏమిటంటే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2015లో కేసీఆర్ ప్రభుత్వం నియమించిన ఇంజనీర్ల నిపుణుల కమిటీ ఈ ప్రాజెక్టును నిర్మించడానికి మేడిగడ్డ అనువైన ప్రదేశం కాదని సిఫార్సు చేసిన మాట వాస్తవం కాదా? అదేవిధంగా ప్రాణహిత–చేవెళ్ల ఎత్తిపోతల ప్రాజెక్టుకు నిర్దేశించిన తుమ్మిడిహట్టి వద్దనే ప్రాజెక్టును నిర్మించడం సమంజసమే అని సిఫార్సు చేయడం వాస్తవం కాదా? ఈ విషయాలను వీరమల్ల ప్రకాష్ తన వ్యాసంలో పేర్కొనకపోవడం హాస్యాస్పదం.

కాళేశ్వరం ప్రాజెక్టు కింద 18.25 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు, 18.82 లక్షల ఎకరాల ప్రస్తుత ఆయకట్టు స్థిరీకరణను లక్ష్యంగా పెట్టుకొనగా, వాస్తవానికి 98 వేల ఎకరాలకు కొత్త ఆయకట్టుకు నీళ్లు ఇచ్చినట్టుగా పేర్కొన్నారు. ఈ లెక్క ప్రకారం అదనంగా నీళ్ళు అందించిన 98 వేల ఎకరాల విస్తీర్ణంలో ధాన్యం ఉత్పత్తి 45 లక్షల మెట్రిక్ టన్నుల నుండి 3 కోట్ల మెట్రిక్ టన్నులకు ఎలా పెరుగుతుంది? అదనంగా వచ్చిన ప్రతి ఎకరం ఆయకట్టు భూమిలో ధాన్యం దాదాపు 3500 బస్తాలు/ ఎకరాకి పండించినట్లయితే ఈ 3కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తి సాధ్యమవుతుంది. ఒకవేళ 20 లక్షల ఎకరాలు అదనంగా కొత్త ఆయకట్టు పరిధిలోకి వచ్చిందని ఊహించుకున్నా ప్రతి ఎకరం నుంచి 180 బస్తాల ఉత్పాదకత ఉంటేనే ఈ 3కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తి సాధ్యమవుతుంది. ప్రపంచంలో ఎక్కడైనా ఇంత ఉత్పాదకత ధాన్యంలో ఉన్నట్టు కనిపించట్లేదు. దీన్ని బట్టి చూస్తే ప్రకాష్ తన వ్యాసంలో ప్రస్తావించిన గణాంకాలన్నీ అవాస్తవమని అర్థమవుతున్నది.



> కాళేశ్వరం ప్రాజెక్టును ఇప్పటికైనా పూర్తిస్థాయిలో మూసివేసి ప్రత్యామ్నాయ లాభసాటి ప్రాజెక్టులను అన్వేషించి వాటిపై పెట్టుబడులు పెట్టడం అవసరం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నియమించిన ఇంజనీర్ల నిపుణుల కమిటీ సిఫార్సు మేరకు ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును తిరిగి ప్రారంభించి తుమ్మిడిహట్టి వద్ద ఈ ప్రాజెక్టు నిర్మించడం శాస్త్రీయం, లాభకరం. ఎంతో ఉద్యమస్ఫూర్తి గల వీరమల్ల ప్రకాష్ ఈ అంశాన్ని తన వ్యాసంలో ప్రస్తావించి ఉంటే తెలంగాణ సమాజం హర్షించేది.

తన వ్యాసంలో ప్రకాష్– లాభం ఉన్నా లేకున్నా ఎత్తిపోతల ప్రాజెక్టుకు భారీ మొత్తంలో ఎంతైనా ఖర్చు పెట్టాలి అన్న వాదాన్ని ముందుకు తీసుకొచ్చారు. ఇది హాస్యాస్పదం. మన పరిమిత ఆర్థిక వనరులను సమగ్ర అభివృద్ధికి ఎలా కేటాయించాలో ఆలోచించటం మానేసి, రైతు ప్రయోజనం నెపంతో ఈ కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుపై దాదాపు లక్ష కోట్లు అప్పుగా తెచ్చి ఖర్చు చేయటం, ఇంత పెట్టుబడి నుంచి ఎలాంటి ప్రయోజనం లేకపోవడం ఇవన్నీ ప్రకాష్‌కి కనిపించకపోవడం దురదృష్టకరం. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి బంగారు తెలంగాణను సాధించాలనే చిత్తశుద్ధే ఉంటే, ఈ లక్ష కోట్ల ధనాన్ని విద్యా, వైద్య రంగాలపై ఖర్చు పెట్టి ఉంటే, ఈ రోజుకు ప్రతి నియోజకవర్గ కేంద్రంలో నిమ్స్ లాంటి ఒక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఉండేది, అంతర్జాతీయ ప్రమాణాలతో ఒక 500 పాఠశాలలు స్థాపించబడి ఉండేవి.

ప్రపంచంలో ఏ నీటిపారుదల ప్రాజెక్ట్ విషయంలోనైనా పెట్టిన పెట్టుబడులపై కనీసం ప్రతి డాలర్ ఖర్చుకు రెండు నుండి మూడు డాలర్లు అదనపు విలువగల ఉత్పత్తులను సంపద రూపంలో సృష్టిస్తారు. మన దేశంలో కూడా ప్రస్తుతం ఉన్న ప్రధాన నీటి ప్రాజెక్టులన్నీ దాదాపుగా మొదటి నాలుగు పంచవర్ష ప్రణాళికలలోనే నిర్మించి దేశానికి అంకితం కాబడినవి. ఈ ప్రాజెక్టులపై పెట్టిన పెట్టుబడులు దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించి దేశ అభివృద్ధిలో ఎంతో కీలక పాత్ర పోషించిన సంగతి ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ అనుభవాలన్నీ దృష్టిలో పెట్టుకొని ఆలోచించినప్పుడు ఏ ప్రాజెక్టుకు పెట్టిన పెట్టుబడులైనా కనీసం ఆ పెట్టుబడులకు సమానంగా గాని లేదా అధికంగా గాని సంపదను సృష్టించినప్పుడే ఆ ప్రాజెక్టు వ్యయాన్ని లాభసాటి వ్యయంగా పరిగణిస్తాం. కాళేశ్వరం విషయానికొస్తే కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన కాగ్ నివేదికలో చాలా స్పష్టంగా ఈ ప్రాజెక్టుపై ఖర్చుపెట్టిన ప్రతి ఒక్క రూపాయి కేవలం 52 పైసలు విలువగల సంపదని మాత్రమే సమాజానికి సృష్టిస్తున్నదని చెప్పింది. దీన్నిబట్టి ఈ ప్రాజెక్టుపై పెట్టే ఏ పెట్టుబడులైనా సమాజానికి ఆర్థికంగా నష్టం అని తెలుస్తుంది. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు పెట్టిన లక్ష కోట్లు వృథా అయిందని భావించాలే తప్ప ఇక ఈ ప్రాజెక్టుపై ఎలాంటి అదనపు పెట్టుబడులు పెట్టడమూ ఆర్థికంగా సమంజసం కాదు.


కాళేశ్వరం ప్రాజెక్టును ఇప్పటికైనా పూర్తిస్థాయిలో మూసివేసి ప్రత్యామ్నాయ లాభసాటి ప్రాజెక్టులను అన్వేషించి వాటిపై పెట్టుబడులు పెట్టాలి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నియమించిన ఇంజనీర్ల నిపుణుల కమిటీ సిఫార్సు మేరకు ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును తిరిగి ప్రారంభించి తుమ్మిడిహట్టి వద్ద దీనిని నిర్మించడం శాస్త్రీయం, లాభకరం. ఎంతో ఉద్యమస్ఫూర్తి గల వీరమల్ల ప్రకాష్ ఈ అంశాన్ని తన వ్యాసంలో ప్రస్తావించి ఉంటే తెలంగాణ సమాజం హర్షించేది.

• ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య
వ్యవసాయ ఆర్థికవేత్త

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
గురువారం 21 మార్చి 2024

బుధవారం ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 31.0° C | కనిష్ఠం : 20.0° C

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : గురువారం సా : 6.33 గం..
సహర్ : శుక్రవారం ఉ : 4.57 గం..



'అత్యవసరమే' అవకాశంగా..

వైద్య, ఆరోగ్యశాఖలో మళ్లీ డిప్యూటేషన్ల అక్రమాలు

(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

వైద్య, ఆరోగ్యశాఖలో డిప్యూటేషన్ల అక్రమాలు జోరు గా సాగుతున్నాయి. ప్రభుత్వం అత్యవసరం పేరిట క ల్పించిన డిప్యూటేషన్ల అవకాశాన్ని కొంతమంది డీఎం హెచ్‌వోలు దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు విని పిస్తున్నాయి. గత ఫిబ్రవరి 7వ తేదీన వైద్య, ఆరోగ్యశా ఖలో అన్ని రకాల డిప్యూటేషన్లను, వర్క్ ఆర్డర్లను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో ఇతర జిల్లాలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న వైద్య ఉద్యోగులు తమ పాత జిల్లాలోని వారి సొంత డిపార్ట్‌మెంట్‌లలోకి తిరిగి వెళ్లారు. దీంతో ఉమ్మడి జిల్లాలో సమారు 200 మందికి పైగా డిప్యూటేషన్లు రద్దయ్యాయి. అయితే ప్ర భుత్వం ఇచ్చిన ఆర్డర్‌లో ఉన్న చిన్న పాయింటే అక్రమ డిప్యూటేషన్లకు వరంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అత్యవరసమైతే కలెక్టర్ల అనుమతి తో జిల్లాస్థాయిలో డిప్యూటేషన్లు ఇచ్చే అధికారం డీఎం హెచ్‌వోలకు ప్రభుత్వం కల్పించింది. దీంతో ఎడాపెడాగా జిల్లా స్థాయిలో డిప్యూటేషన్లకు అధికారులు శ్రీకారం చుట్టుతున్నారు. ఇదే అదనుగా దళారులు పోస్టుకో రేటు పెట్టి పైరవీలు మొదలు పెట్టడం వైద్యశాఖలో కలకలం రేపుతోంది.

డిప్యూటేషన్లను రద్దు చేసిన ప్రభుత్వం

పైరవీలతో తమకు అనుకూల ప్రదేశాల్లో ఏళ్ల తరబ డి పనిచేస్తున్న ఉద్యోగులను తమ సొంత ప్రాంతానికి పంపిం చాలనే లక్ష్యంతో ఫిబ్రవరి 7వ తేదీన డిప్యూటేష న్లను రద్దు చేస్తూ వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా చొంగ్తు ఉత్త ర్వులు జారీ చేశారు. దీంతో ఉమ్మడి వరం గల్ జిల్లాలో సుమారు 200మందికి పైగా ఉద్యోగులు, సి బ్బంది వివిధ ప్రాంతాల నుంచి తిరిగి సొంత శాఖలకు చేరుకున్నారు. ములుగు, భూపాలపల్లి, జనగామ, మహ బూబాబాద్ జిల్లాల నుంచి అధికసంఖ్యలో వైద్య ఉద్యో గులు వరంగల్, హనుమకొండ జిల్లాలకు డిప్యూటేషన్లపై వచ్చారు. సొంత జిల్లాలకు వెళ్లకుండా వరంగల్, హను మకొండ జిల్లాల్లో మకాం వేశారు. దీంతో వేతనాలు అక్కడ, ఉద్యోగం ఇక్కడ అనే చందంగా మారింది. అయితే ప్రభుత్వం డిప్యూటేషన్ల తోపాటు వర్క్ ఆర్డర్ విధానాన్ని కూడా రద్దు చేయటంతో అన్ని జిల్లాల్లో వైద్య కార్యాల యాలు, ఆస్పత్రులు ఉద్యోగు లతో కళకళలాడాయి.

డిప్యూటేషన్లకు అడ్డదారిలో...

ప్రభుత్వం డిప్యూటేషన్లను రద్దు చేస్తూ ఇచ్చిన ఉత్త ర్వుల్లో ఒక చిన్న పాయింట్.. అక్రమ డిప్యూటేషన్లకు అ డ్డదారిగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నా యి. కలెక్టర్ల అనుమతితో అత్యవసరమైతే జిల్లాస్థాయిలో డిప్యూ టేషన్లు ఇచ్చే అధికారాన్ని డీఎంహెచ్‌వోలకు అప్ప గించారు. దీంతో డిప్యూటేషన్ల దందా మళ్లీ మొదలైంది. ఒక్క హనుమకొండ జిల్లాలోనే 40మంది వైద్య ఉద్యో గులు, సిబ్బందిని జిల్లా స్థాయిలో అత్యవసరం పేరిట బది లీలు చేపట్టారు. పీహెచ్‌సీల్లో పనిచేసే మెడికల్ ఆఫీసర్లు, నర్సింగ్ అధికారులు, సీహెచ్‌వోలు, ఎంపీ హెచ్‌ఈవోలు, ఎంపీహెచ్‌ఎస్‌లు, ఎంపీహెచ్‌ఏలు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఎల్‌డీ కంప్యూటర్, ఆఫీస్ సబార్డినేట్, రెండో ఏఎన్‌ఎంలు, థియేటర్ అసిస్టెంట్, పంపు మెకానిక్ వరకు డిప్యూటేషన్లపై బదిలీ చేశారు. పెద్దమొత్తంలో హనుమ కొండ జిల్లాలో వైద్య సిబ్బందికి డిప్యూటేషన్ ఇవ్వటం వైద్యశాఖలో నూ తీవ్ర చర్చనీయాం శంగా మారింది.

- అన్నిటినీ రద్దు చేస్తూ గత నెల ప్రభుత్వం ఉత్తర్వులు
- తప్పనిసరైతే జిల్లాస్థాయిలో చేయొచ్చని సూచన
- ఇదే అదనుగా ఎడాపెడాగా డిప్యూటేషన్లు
- డీఎంహెచ్‌వో కార్యాలయాల్లోనే తిష్ట వేస్తున్న ఉద్యోగులు
- ఒక్కో పోస్టుకు ఒక్కో రేటుతో దళారుల పైరవీలు

అలాగే వరంగల్ జిల్లాలోనూ భారీగానే డి ప్యూటేషన్లు ఇచ్చేశారు. 28మందికి పైగా జిల్లా స్థాయిలో బదిలీలు చేపట్టారు. డీఎంహెచ్‌వో కా ర్యాలయంలోనే 8మంది వరకు డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. రాయపర్తి, నల్లబెల్లి, పర్వతగిరి మండలాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను డీఎం హెచ్‌వో కార్యాలయంలో పని చేయిస్తున్నారు. అయితే జిల్లాస్థాయిలో వేర్వేరు ప్రాంతాల్లోకి బ దిలీచేస్తే తప్పనిసరిగా జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకోవాలని ఆదేశాలు ఉన్నప్పటికీ వైద్యశాఖ అధికారులు ఇవేవీ పట్టించుకోకుండానే నామ మాత్రంగా మౌఖికంగా తెలియజేసి డిప్యూ టేష న్లు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే మహబూబాబాద్‌లో 36మంది, జనగా మలో 16మంది, భూపాలపల్లిలో 18 మంది వరకు డిప్యూటేషన్ల కోసం దరఖాస్తులు చేసు కున్నట్లు సమాచారం. ఇవి కలెక్టర్ల వద్ద పెండిం గ్‌లో ఉన్నట్లు సమాచారం. వీరికి కూడా రేపో మాపో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేందుకు పైరవీకారులు చర్చలు జరుపుతున్నారనే ప్రచారం ఉంది.

సొమ్ము చేసుకుంటున్న దళారులు

వైద్య, ఆరోగ్యశాఖలో అత్యవసరం పేరిట జిల్లా స్థాయిలో డిప్యూటేషన్ల దందాను దళారు లు సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలున్నా యి. పోస్టును బట్టి రేటు ఫిక్స్ చేసి వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మం డలాల నుంచి వరంగల్ కార్పొరేషన్ పరి ధిలోకి వచ్చేందుకు చాలామంది ఆసక్తి చూపు తున్నా రు. వారి ఆసక్తి దళారులకు కాసులుగా మారు తున్నాయనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. గెజిటె డ్ పోస్టులకు రూ.3లక్షల వరకు, నాన్ గెజిటెడ్ పోస్టులకు ఏరియాలను బట్టి రూ.1లక్ష నుంచి రూ.2లక్షల వరకు దళారు వసూళు చేస్తున్నార నే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. వీటికి తోడు పార్టీలను ఏర్పాటు చేసి పెద్ద సార్లను మెప్పిం చే పనిలో కూడా కొంత మంది దళారులు ఉన్న ట్లుగా ప్రచారం జరుగు తోంది. ప్రభుత్వం రద్దు చేసిన డిప్యూటేషన్ల దందా అత్యవసరం పేరిట మళ్లీ మొదలైందనే విమర్శలు వినబడుతున్నాయి.

ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులందరి డిప్యూటేషన్లు, వర్క్ ఆర్డర్ విధానాన్ని రద్దు చేస్తున్నట్లు ఫిబ్రవరి 7వ తేదీన ప్రకటించింది. అయితే ఉద్యోగులు, సిబ్బంది అదే రోజు డిప్యూటేషన్ జాబ్ వదిలి పాత పోస్టులో రిపోర్టు చేశారు. అయితే డీఎంహెచ్‌వోలు మాత్రం తమ సీట్లను వదలటం లేదనే విమర్శలు వి నిపిస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నలుగురు డీఎంహెచ్‌వోలు డిప్యూటేషన్‌పైనే విధులు నిర్వహిస్తున్నారు. హనుమకొండ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న సాంబశివరావు పోస్టింగ్ మహబూబ్‌నగర్. డిప్యూటేషన్‌పై హనుమకొండలో పని చేస్తున్నారు. అలాగే వరంగల్ డీఎంహెచ్‌వో వెంకటరమణ పోస్టింగ్ కరీంనగర్.. డిప్యూటేషన్‌పై వరంగల్‌లో డ్యూటీ చేస్తున్నారు. అలాగే ములుగు డీఎంహెచ్‌వో అప్పయ్య 2019 నుంచి ములుగును వదలడం లేదు. హనుమకొండ డీఎంహెచ్‌వోగా డ్యూటీ చేయాల్సిన అప్పయ్య.. డిప్యూటేషన్‌పై ములుగులో పని చేస్తున్నారు. వరంగల్ ఎంజీఎం ఆర్‌ఎంవోగా పనిచేస్తున్న హరీష్‌రాజ్ ఇటీవలే డిప్యూటేషన్‌పై జనగామ డీఎంహెచ్‌వో విధుల్లో చేరారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులే డిప్యూటేషన్‌పై పని చేస్తున్నప్పటికీ ప్రభుత్వం దృష్టి సారించటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

డీఎంహెచ్‌వోలు డిప్యూటేషన్లపైనే..

అనుమానాస్పద లావాదేవీలపై
దృష్టి పెట్టాలి

- మద్యం దుకాణాలపై పోలీసులు నిఘా పెంచాలి
- కలెక్టర్ సిక్తా పట్నాయక్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 20: అనుమానాస్పద లావాదేవీలపై దృష్టి పె ట్టాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్ అధికారులతో కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ డిస్ట్రిక్ట్ ఇంటెలిజెన్స్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నాలుగు నెలలుగా స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాల వివరాలు, బ్యాం కుల ద్వారా జరిగిన నగదు లావాదేవీలు, ఎక్కువ సంఖ్యలో కొనుగోలు చేసిన వస్తు వుల వివరాలను సంబంధిత శాఖల అధికారులను ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అడిగి తెలుసుకున్నారు. దీని ప్రకారంగా సమావేశ వివరాలను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి తెలియజేస్తామని కలెక్టర్ తెలిపారు. సాధారణంగా మద్యం దుకాణాలకు ఎంత కేటాయించబడుతుంది? ఈ ఎన్నికల సమయంలో ఎంత తీసుకుంటున్నారనే వివరాలను డిస్ట్రిక్ట్ ఇంటెలిజెన్స్ కమిటీ దృష్టికి తీసుకురా వాలన్నారు. అనుమానాస్పద లావాదేవీలపై నిఘా పెడుతూ ఏకమొత్తంగా జరిగిన ఫోన్‌పే, గూగుల్ పే ఖాతాలపై దృష్టి సారించాలన్నారు.

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ.. ఎన్నికల సం ఘం ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణను అధికారులు, సిబ్బంది సమన్వయంతో పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు అన్ని రకాలుగా వి చారణ చేసి నగదు, ఇతర వస్తువులను జప్తు చేసి సంబంధిత అధికారులకు నివేదికను సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు రాధికా గుప్తా, వెంకట్‌రెడ్డి, డీఆర్‌ఓ వైవీ గణేష్, ట్రెయినీ ఐపీఎస్ శుభం నాగరాలే, ఆర్‌డీ ఓలు వెంకటేష్, నారాయణ, డీఆర్‌డీఓ నాగ పద్మజ, జిల్లా ఖజానా శాఖ డీడీ రాజు, పోలీస్, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

లావాదేవీల నిర్వహణ నిబంధనల మేరకు ఉండాలి

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనల మేరకు నగదు లావాదేవీల ని ర్వహణ ఉండాలని బ్యాంకర్లకు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం సాయంత్రం బ్యాంకర్లతో కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లా డుతూ.. రూ.50 వేలకు మించి నగదుకు తీసుకునే ఖాతాదారులకు సూచనలు చే యాలన్నారు. బ్యాంకు శాఖల మధ్య జరిగే నగదు రవాణా ఎన్నికల నిబంధన మేరకు తప్పకుండా పాటించాలన్నారు. అనుమానాస్పద లావాదేవీలపై బ్యాంకర్లు అప్రమత్తంగా ఉండాలని, అలాంటి లావాదేవీలను జిల్లా ఎన్నికల అధికారికి నివే దించాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే బ్యాంకర్లు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బ్యాంకర్లు ఓటరు గుర్తింపుకార్డులను పొంది పోస్టల్ బ్యాలెట్ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎం.శ్రీనివాస్, ఎస్‌బీఐ, యూబీఐ, ఏపీజీవీబీ, కెనరా బ్యాంకులతో పాటు ఇతర ప్రభుత్వ ప్రైవేట్ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సమస్యను మోదీ పరిష్కరిస్తారు

- మాజీ ఎమ్మెల్యే బీజేపీ నాయకుడు అరూరి రమేశ్


బీజేపీలోకి చేరిన వారితో ధర్మారావు, అరూరి

హనుమకొండ టౌన్, మార్చి 20: 30 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్యను ప్రధానమంత్రి మోదీ పరి ష్కరిస్తాడనే పూర్తి నమ్మకం ఉందని, ఈ విషయంపై దళితు లు ఆలోచనలు చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకు డు అరూరి రమేశ్ పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొం డ దీన్‌దయాళ్‌నగర్‌లోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో వర్ధన్నపేట, ఒంటిమామిడిపల్లి, ఐనవోలుకు చెందిన బీఆర్ ఎస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీటీసీ పెండ్లి తిరుపతిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కొట్టం రాజుతో పాటు సుమారు 20 మంది వరకు అరూరి రమేశ్ ఆధ్వర్యంలో బీజేపీ పార్టీలో చేరగా పార్టీ క్రమ శిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారా వు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. ఈ 10 ఏళ్లలో ఎ లాంటి అవకతవకలు, అవినీతి లేని పాలనను మోదీ అందిం చిన విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. కాంగ్రెస్‌లా గా క్రిష్టియన్, మైనారిటీ, సి సర్టిఫికెట్ అంటూ బీజేపీ ఎ లాంటి కిరికిరి పెట్టడంలేదని, విషయం ప్రజలు గమనించాల న్నారు. తనపై నమ్మకంతో బీజేపీలో చేరిన కార్యకర్తల నమ్మ కాన్ని వమ్ము చేయనన్నారు. మార్తినేని ధర్మారావు మాట్లాడు తూ.. దేశంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న 25 కోట్ల మందిని దారిద్ర్యరేఖ ఎగువనకు చేర్చిన ఘనత ప్రధాని మోదీ సొంతమన్నారు. దేశాన్ని పరిరక్షిస్తున్న మోదీ నాయక త్వాన్ని ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్ గురుమూర్తి, రావు అమరేందర్‌రెడ్డి, గడిపల్లి రాజేశ్వర్, కేశవరెడ్డి, రంజిత్, మహేశ్వర్, రాంబాబు, వెంకట్ రావు, జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, మజ్జిగ జైపాల్, రమేశ్‌గౌడ్, ఏకాంతం, షణ్ముఖరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులను కలిసిన అరూరి

ఇటీవలే బీజేపీ పార్టీలో చేరిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ బుధవారం పరకాల, భూపాల పల్లి, వరంగల్ నుంచి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేసిన కాశీప్రసాద్, చందుపట్ల కీర్తిరెడ్డి, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, బీజేపీ సీనియర్ నాయకుడు మంద ఐల య్యను వారి వారి నివాసాల్లో మర్యా దపూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా వారంతా అరూరిని సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

నిబంధనల మేరకే భవన నిర్మాణ అనుమతులు

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- క్షేత్రస్థాయిలో పర్యటన.. భవన నిర్మాణాలు, తాగు నీటి సరఫరాపై పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, మార్చి 20: ప్రభుత్వ నిబంధనల మేరకే బల్దియా పరిధిలో భవన నిర్మాణ పనులకు అనుమ తులు ఇస్తున్నామని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమి షనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. హనుమకొండ నక్కల గుట్ట, వరంగల్ శాంతినగర్, బాలసముద్రంతో పాటు పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఇంకా భవన నిర్మాణ అనుమతులు, నీటి సరఫరా, పన్నుల వసూళ్లపై బుధవారం క్షేత్రస్థాయి పర్య టన చేశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. బాలస ముద్రంలో నిర్మిస్తున్న కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఇచ్చిన అనుమతి పత్రాలను పరిశీలించారు. నక్కలగుట్ట సమీ పంలోని చెన్నై షాపింగ్‌మాల్ సమీపంలోని నిర్మించిన కాంప్లె క్స్‌కు ఎన్‌ఓసీని పరిశీలించారు. బాలసముద్రం ప్రాంతంలో పన్నుల వసూలు విధానం, ఆన్‌లైన్ పద్ధతిని పరిశీలించారు. వరంగల్ శాంతినగర్‌లో నివసిస్తున్న ప్రజలతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసు కున్నారు. ఈ ప్రాంతంలో డ్రైనేజీ శుభ్రం చేయడం లేదని ప్రజలు చెప్పడంతో అక్కడి ఉన్న అధికారులను పిలిచి మంద లించారు. వెంటనే సిబ్బందిని పిలిపించి డ్రైనేజీ శుభ్రం చేయిం చారు. కమిషనర్ వెంట సీఎంహెచ్‌వో రాజేశ్, సిటీ ప్లానర్ వెంకన్న, డీసీ రవీందర్, ఈఈ రాజయ్య, ఈఈ సంతోష్, ఆర్‌వో సుదర్శన్, టీపీవోలు సుష్మ, బషీర్, మేనక, విజయలక్ష్మి లతో పాటు శానిటరి ఇన్‌స్పెక్టర్లు గోల్కొండ శ్రీనివాస్, పోలె పాక అనీల్‌కుమార్‌లు ఉన్నారు.


నక్కలగుట్టలో బిల్డింగ్ పర్మిషన్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు

కార్పొరేషన్ పరిధిలో వివిధ విభాగాల్లో వసూలు చేసే పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహించవద్దని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే గ్రేటర్ రెవెన్యూ అధికా రులకు సూచించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వ హించారు. గ్రేటర్ పరిధిలో పనిచేస్తున్న ఆర్‌ఐల తీరుపట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇద్దరు ఆర్‌ఐలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. 2023-2024 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.97.66 కోట్లకు 60 శాతం వసూలు చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు రూ.63.96కోట్ల పన్నుల వసూలు జరిగిందన్నారు. పన్నుల వసూలుకు ఇంకా పది రోజుల సమయం మాత్రమే ఉందని ఆర్‌ఐలు అంకితభావంతో పనిచేసి 95 శాతం పన్నులు వసూలు చేసేనా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచిం చారు. ప్రతీ బిల్ కలెక్టర్ వందమంది బకాయిదారుల నుంచి డబ్బులు వసూలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం కల్పిం చిన వడ్డీపై 90 శాతం రాయితీపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి కమర్షి యల్ వసూళ్లు 3 గంటల నుంచి బడా బకాయిదారులపై దృష్టి సారించి పన్నుల వసూలు చేయాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు ప్రతీ రోజు పన్నుల బకాయి వివరాలను తనకు తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, కృష్ణారెడ్డిలతో పాటు ఆర్‌వోలు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

'ఆసరా' రాదాయే!

- రెండేళ్లుగా అమలుకు నోచుకోని వైనం
- కార్పొరేషన్‌లో మూలనపడ్డ అప్లికేషన్లు
- 2022 నుంచి ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులు

గ్రేటర్ మునిసిపల్ పరిధిలో కొత్త పింఛన్లకు కలగని మోక్షం

నెలవారీ పింఛన్ వస్తేనే కొంద రికి పూట గడుస్తుంది. ఇంకొంద రికి మందులు, చిల్లర సామాన్లు తెచ్చుకోవడానికి ఆసరాగా ఉంటుంది. అలాంటి పేదలకు అండగా ఉండేందుకు ప్రభుత్వం ఇచ్చే ఆసరా పింఛన్లు అందని వారు ఎందరో ఉన్నారు. కొత్త పింఛన్లు రాక.. పోషించే వారు దూరమై కొందరు దుర్భర జీవనం సాగిస్తు న్నారు. వీరే కాక వితంతువులు, ఒంటరి మహిళలకు చాలారోజు లుగా కొత్త పింఛన్లు మంజూరు కాకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురవుతు న్నారు. వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలో సుమారు పదివేల మందికి పైగా రెండేళ్లుగా కొత్త పింఛన్ల కోసం ఎదురుచూ స్తున్నారు.



వరంగల్ కార్పొరేషన్, మార్చి 20: గ్రేటర్ వరంగల్ మునిసి పల్ పరిధిలో కొత్త పింఛన్ల కోసం లబ్ధిదారులు రెండేళ్లుగా ఎదు రుచూస్తున్నారు. నూతనంగా 10,643మంది అర్హులైన వారు దర ఖాస్తులు చేసుకున్నా వారికి ప్రభు త్వాలు మొండిచేయి చూపిస్తు న్నాయి. 2022 మార్చి వరకు అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయబడ్డాయి. గ్రేటర్ పరిధిలో 79,480 మంది పింఛన్‌దారులు నెలవారి పింఛన్లు తీసు కుంటున్నారు. వీరికి ప్రతీ నెల రూ.16కోట్ల వరకు డబ్బులు అందుతు న్నాయి. అయితే ఆ తర్వాత దరఖాస్తు చేసుకున్న వారికి కొత్త పింఛన్లు మంజూరు కాక పోవడం విచారకరం.

ఎదురుచూపులు

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో 66 డివిజన్లలో చాలా మంది లబ్ధిదారులు కొత్త పింఛన్ ఎప్పుడు వస్తుందా? అని వేచి చూస్తు న్నారు. ఏళ్ల తరబడి పింఛన్ రాకపోవడంతో చాలా మంది నీరుగారిపోతున్నారు. ఇంట్లో ఇద్దరిలో ఒక రికి వృద్ధాప్య పింఛన్ వస్తుండగా ఇద్దరిలో ఒక్కరు మరణిస్తే కూడా మరొకరికి కూడా పింఛన్ మంజూరు కావడం లేదు. రెండేళ్లగా ప్రభుత్వాలు పింఛన్‌దారులపై మొండి వైఖరి అవలంబిస్తోం దనే విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం నెలవా రిగా తీసుకుంటున్న పింఛన్‌దారుల్లో కొందరు అడ్డ దారిలో నకిలీపత్రాలు సమర్పించి పింఛన్ తీసు కుంటున్నారని, అసలు అర్హులైన వారికి కొత్త పింఛన్ ఎందుకు మంజూరు చేయడం లేదని మండిపడుతున్నారు.

నిలిచిన కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియ

గతంలో కార్పొరేషన్ పరిధిలో అర్హులైన దివ్యాం గులు, వితంతువులు, వృద్ధులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు, బీడి కార్మికులు, ఒంటరి మహిళలకు ప్రభుత్వం నుంచి ప్రతీ నెల రూ.2వేలు వస్తుండగా వికలాంగులకు రూ.3వేలు వస్తుండేవి. ఆరు మాసాల నుంచి వికలాంగులకు నెలకు రూ.4వేలు వస్తున్నారు. గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు కొత్త పింఛన్‌లకు ఇప్పటికీ మోక్షం లేదు. అన్ని అర్హతలు ఉండి కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న చాలామంది బాధితులు స్థానిక కార్యాలయాలు, మీసేవా కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు కింది స్థాయి లీడర్లు, ప్రజాప్రతినిధులు బ్రోకర్లుగా మారి కొత్త పింఛన్ ఇప్పిస్తామని అమాయకుల నుంచి అందిన కాడికి దండుకుంటు న్నారు. ఒక్కో వ్యక్తి నుంచి రూ.5 నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నట్టు సమాచారం. అయినా పింఛన్ రావడం లేదు. కొత్త పించ న్‌ల కోసం బడ్జెట్ మంజూరు కాలేదని, అందుకే ఆలస్యమవుతోందని చెప్పి సంబంధిత అధికారులు చేతులు దులుపుకుంటున్నారు.

మూలనపడ్డ దరఖాస్తులు

గ్రామీణ ప్రాంతాలతోపాటు నగరంలో అర్హులైన వారు కొత్త పింఛన్‌ల మంజూరు కోసం సంబంధిత మీ సేవా కేంద్రాల్లో దర ఖాస్తు చేసుకున్నారు. కొందరు మాత్రం బ్రోకర్లను ఆశ్రయించి పింఛన్ వస్తుందనే ఆశతో పెద్ద మొత్తంలో డబ్బులు ఇచ్చి దర ఖాస్తు చేసుకున్నారు. వీరు ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు, మరణ ధ్రువీకరణ పత్రం, ఓటర్ గుర్తింపు కార్డులు తీసుకుని మీ సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు 10, 643 మంది కొత్త పింఛన్‌కు అర్హత కలిగి ఉన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆమోదించి మున్సిపల్ కార్యాలయానికి పంపిస్తాడు. కానీ కొత్త పింఛన్ ఫైళ్లు అమలుకు నోచుకోకుండా కార్యాలయంలోనే మూలుగుతున్నాయి. కార్యాల యంలో కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. కొత్త పింఛన్ దారుల జాబితా హైదరాబాద్‌కు పంపిస్తున్నా వారు స్పందిం చడం లేదని నగర పాలక సంస్థ సంబంధిత విభాగం సిబ్బంది తెలిపారు. తమ వద్ద ఏమి లేదని, పింఛన్ మంజూరు చేస్తే డబ్బులు ఇస్తామని చెబుతున్నారు. సకాలంలో కొత్తపింఛన్లు ఇచ్చి తమను ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మృతదేహం లభ్యం

కాజీపేట, మార్చి 20: కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. కాజీపేట దర్గా రైల్వే ట్రాక్ సమీపంలో బుధవారం ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెంది ఉంది. యాచకురాలు అనారోగ్యంతో మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపరిచామని, ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్ ఫోన్ నంబర్ 98661 67291 నంబర్‌కు సంప్రదించాలని రైల్వే పోలీసులు తెలిపారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి కేయూ జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, మార్చి 20: ఈనెల 22 నుంచి 28 వరకు కర్ణాటక రాష్ట్రంలోని జనపదలోక రాంనగర్‌లో జరిగే జాతీయ సమైక్యతా శిబిరానికి కాకతీయ యూనివర్సిటీ జట్టును ఎంపిక చేసినట్లు కేయూ జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ సమన్వయ అధికారి ప్రొఫెసర్ ఈసం నారాయణ బుధవారం తెలిపారు. ఎంపికైన వారిలో టి.మనోజ (టీటీడబ్ల్యూఆర్‌డీసీ, మహబూబాబాద్), బి.హిందుప్రియా (ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల, ఖమ్మం), రోషిణి (కిట్స్ కళాశాల, హసన్‌పర్తి), పి.మనస్విత, (యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, సుబేదారి), జె.హర్షిత (యూనివర్సిటీ మహిళ ఇంజనీరింగ్ కళాశాల, కేయూ), సీహెచ్.శివశంకర్ (ఎల్‌బీ కళాశాల, వరంగల్), జి.రాజు (టీటీడబ్ల్యూఆర్‌డీసీ బాయ్స్, మణుగూరు.) బి. సూర్యకాంత్ (ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల, ఆదిలాబాద్), జె.మహేశ్(వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాల, హనుమకొండ), జి.దిలీప్‌కుమార్(కేయూ ఇంజనీరింగ్ కళాశాల) ఉన్నారు. వీరికి హనుమకొండ ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రేణుకుంట్ల ప్రవీణ్‌కుమార్ కాంటింజెంట్ లీడర్‌గా వ్యవహరిస్తారు. ఎంపికైన జట్టు సభ్యులను కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఇతర అధికారులు అభినందించారు.



బాధితులతో మాట్లాడుతున్న ఏసీపీ

ఐదు తులాల గొలుసు అపహరణ

వరంగల్ క్రైం, మార్చి20: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని విజయలక్ష్మీకాలనీలో మహిళ మెడలోని గొలుసును గుర్తుతెలియని యువకుడు లాక్కెళ్లాడు. కాలనీలో బండెల రమాదేవి అనే మహిళ కిరాణ షాపు నిర్వహిస్తోంది. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి బైక్ మీద వచ్చి ఆలుగడ్డలు కావాలని బేరం చేస్తూనే ఒక్కసారిగా రమాదేవి మెడలోని ఐదు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. పట్టుకునే ప్రయత్నం చేసినప్పటికీ హెల్మెట్‌తో ఉన్న యువకుడు బైక్ మీద పారిపోయాడు. సమాచారం అందుకున్న కేయూ సీఐ సంజీవ్, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు కేయూ సీఐ సంజీవ్ తెలిపారు.

కమిషనరేట్‌కు ఐపీఎస్ అధికారి

వరంగల్ క్రైం, మార్చి20: గ్రేహౌండ్స్ విభాగంలో శిక్షణ పొందుతున్న 2020 బ్యాచ్ ఐపీఎస్ అంకిత్‌కుమార్‌ను వరంగల్ కమిషనరేట్‌కు అటాచ్ చేస్తూ బుధవారం డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు అంకిత్ కుమార్ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అంకిత్‌కుమార్‌ను సీపీ అభినందించారు.



సీపీని కలిసిన అంకిత్‌కుమార్

15 ఏళ్లుగా..

ఐసెట్‌ను పకడ్బందీగా నిర్వహిస్తున్న కాకతీయ విశ్వవిద్యాలయం

ఉమ్మడి రాష్ట్రం నుంచి ప్రత్యేక రాష్ట్రం దాకా దక్కిన గౌరవం



ఐసెట్ నోటిఫికేషన్ విడుదల చేస్తున్న దృశ్యం (ఫైల్)

కేయూ క్యాంపస్, మార్చి 20: రాష్ట్ర వ్యాప్తంగా ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఐసెట్-24 నిర్వహణ 15వ సారి కాకతీయ యూనివర్సిటీకే దక్కింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదలుకుని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వరుసగా ఈ ఏడాది 15వ దఫా ఐసెట్ నిర్వహణ కేయూకే దక్కడం గర్వకారణం. రాష్ట్ర ఉన్నత విద్య మండలి యేటా ప్రవేశ పరీక్షలను ఒక్కో వర్సిటీకి కేటాయిస్తుంటుంది. అయితే ఐసెట్ నిర్వహణను మాత్రం ఉమ్మడి ఏపీ నుంచి వరుసగా కాకతీయ యూనివర్సిటీకే అప్పగిస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో కేయూ వరుసగా 6దఫాలుగా ఐసెట్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించింది. 2014 నుంచి ఇప్పటి వరకు కేయూనే వరుసగా పకడ్బందీగా నిర్వహిస్తోంది. వర్సిటీలో మొదటగా ప్రొఫెసర్ ఓంప్రకాశ్, శర్మ, ప్రొఫెసర్ చింతకింది రాజేశం, ప్రొఫెసర్ రాజిరెడ్డి, ప్రొఫెసర్ వరలక్ష్మిలు కన్వీనర్‌గా సమర్థవంతంగా పనిచేశారు. అదే క్రమంలో ప్రస్తుతం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సీనియర్ ప్రొఫసర్ శ్రీరామోజు నరసింహచారిని కన్వీనర్‌గా నియమించారు.

భారీగా పోటీ..

యేటా ఐసెట్ పరీక్షలు రాసే అభ్యర్థుల సంఖ్య పెరుగుతోంది. మేనేజ్‌మెంట్ రంగంలో దేశ, విదేశాల్లో ఉద్యోగ అవకాశాల వస్తుండటంతో బీటెక్ చేసిన అభ్యర్థులు సైతం ఎంబీఏ వైపు వస్తున్నారు. నగటున ఏడాదికి 70వేల మందికి పైనే అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారు. మార్కెటింగ్, ఫైనాన్స్ విభాగాల్లోనూ ఎంబీఏ అభ్యర్థులకు మంచి ఉద్యోగ అవకాశాలున్నాయి. స్కిల్ ఉన్న అభ్యర్థులను కార్పొరేట్ సంస్థలు భారీ ప్యాకేజీలతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయి.

ఏదైనా డిగ్రీ

గుర్తింపుపొందిన వర్సిటీ నుంచి బీఏ, బీకాం, బీఎస్సీ, ఇంజనీరింగ్‌తోపాటు ఏదైనా డిగ్రీ కోర్సు పాసైన అభ్యర్థులందరూ ఐసెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం ఫైనలీయర్ చదవుతున్న అభ్యర్థులు సైతం ఐసెట్ పరీక్షలకు హాజరుకావచ్చు. ఐసెట్ పరీక్ష 200 మార్కులకు ఉంటుంటి. 75 మార్కుల చొప్పున ఎనలైటికల్ ఎబిలిటీ, మ్యాథ్స్ ఎబిలిటీ సిలబస్‌తోపాటు మరో 50 మార్కులకు జనరల్ ఇంగ్లీష్‌లో సిలబస్ రూపొందించారు. అత్యధిక స్కోరు సాధించిన అభ్యర్థులకు ఉస్మానియా, కేయూ, పాలమూరు. శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీతోపాటు ఇతర వర్సిటీల్లోనూ సీట్లు పొందే అవకాశం ఉంది.

షెడ్యూల్ విడుదల

రాష్ట్ర వ్యాప్తంగా ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో 2023-24 ఏడాదికి ప్రవేశాల మార్చి 5న టీఎస్ఐసెట్-24 నోటిఫికేషన్ విడుదల అయింది. మార్చి 7 నుంచి ఏప్రిల్ 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తారు. మే 17 నుంచి 27 వరకు రూ. 250, రూ.500 అపరాధ రుసుంతో దరఖాస్తులను స్వీకరిస్తారు. జూన్ 4, 5వ తేదీల్లో కంప్యూటర్ బెస్ట్ పరీక్ష నిర్వహిస్తామని రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు ప్రకటించారు.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తాం..

కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, ఐసెట్ చైర్మన్



వరుసగా కేయూకు 15వ దఫా ఐసెట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉంది. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ పరీక్షలను నిర్వహిస్తాం. విద్యార్థులకు ఎల్లప్పుడూ సందేహాలను తీర్చేందుకు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం. తెలంగాణతో పాటు ఏపీలోనూ ఐసెట్ పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేస్తాం.

నేడు కేయూకు మాజీ డీజీపీ ఆదిత్య ఆర్య రాక

కేయూ క్యాంపస్, మార్చి 20: కేయూ సెనెట్‌హాల్‌లో గురువారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్ రామచంద్ర మిషన్ ఇన్స్టిట్యూట్ నేతృత్వంలో జరిగే ధ్యానం, రిలాక్సేషన్, స్వచ్ఛత, ఇతర విద్యార్థి ఉద్యోగార్థులకు ఉపయోగపడే అంశాలపై అవగాహన కల్పించేందుకు మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) డాక్టర్ ఆదిత్య ఆర్య, యూఎస్‌ఏ నుంచి డాక్టర్ అరిహంత మాధవ మోహన్ హాజరుకానున్నట్లు కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి కేయూ వీసీ తాటికొండ రమేశ్ అధ్యక్షత వహిస్తారని వెల్లడించారు. వర్సిటీలోని బోధన, బోధనేతర సిబ్బందితోపాటు పరిశోధకులు, విద్యార్థులందరూ రావాలని కోరారు.

కుష్టువ్యాధి నిర్మూలనకు పాటుపడాలి

వరంగల్ మెడికల్, మార్చి 20: కుష్టువ్యాధి నివారణలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పిస్తున్నట్లు రాష్ట్ర లెప్రసీ ఎల్‌సీడీసీ కార్యక్రమల పరిశీలకుడు డాక్టర్ మైకేల్ తెలిపారు. బుధవారం హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఇంటింటి సర్వే చేపట్టారు. కుష్టువ్యాధి నివారణకు ఆశ కార్యకర్తల నుంచి అధికారుల వరకు అందరూ పాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ నిర్మూలన అధికారి, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ మదన్ మోహన్‌రావు, పాల్గొన్నారు.

ప్రపంచ కవితా దినోత్సవం

హనుమకొండ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని కవితా ఓ కవితా అన్న శీర్షికన ఆకాశవాణి వరంగల్ కేంద్రం గురువారం కవి సమ్మేళనం ప్రసారం చేయనున్నదని ఆకాశవాణి వరంగల్ కార్యక్రమం అధికారి ఇల్లెందుల రవి కుమార్ తెలిపారు. ఆకాశవాణి వరంగల్ కేంద్ర ప్రాంగణంలో నిర్వహించే ఈ కవి సమ్మేళనంలో వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, డాక్టర్ జరీనాబేగం, చేపూరి శ్రీ రామారావు, డాక్టర్ మంతెన శంకర్, పొట్లపల్లి శ్రీనివాసరావు, రమేశ్వర్ రాజు, బిల్ల మహేందర్ వనపర్తి పద్మావతి, హాజీ నూరానీ కవితలను ముందుగానే రికార్డు చేశామని ఆయన తెలిపారు. ఈ కవిసమ్మేళనంలో గేయాలు, పద్యాలు, వచన కవితలు, మినీ కవితలు, మణిపూసలు ఇలా అన్ని ప్రక్రియలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం

వరంగల్ కార్పొరేషన్, మార్చి 20: తెలంగాణ రాష్ట్రం భవన నిర్మాణ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ఎన్‌ఏసీ ఇన్‌స్ట్రక్టర్ గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 90 రోజుల శిక్షణలో ఎలక్ట్రీషియన్, హౌస్‌వైరింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. 10వ పాస్ అయి 18 నుంచి 30 యేళ్లలోపు వారై ఉండాలని సూచించారు. శిక్షణా కాలంలో ఉచిత యూనిఫామ్, ఉచిత మధ్యాహ్నం భోజనం అందిస్తామని తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన తర్వాత న్యాక్ సర్టిఫికెట్ అందించి ప్రైవేటు కంపెనీలలో ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. వివరాలకు 7989247723, 9949684763 సెల్ నెంబర్‌లలో సంప్రదించాలని గోపాల్ సూచించారు.

కెనాల్‌లో పడిన వ్యక్తి

కాపాడిన ఇద్దరు యువకులు



యువకుడిని కాపాడుతున్న స్థానికులు

వరంగల్ క్రైం, మార్చి20: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతగట్టు క్యాంపు వద్ద కుమార్‌పల్లికి చెందిన యువకుడు బుధవారం మధ్యాహ్నం కెనాల్‌లో పడిపోయాడు. అటుగా వెళుతున్న లక్ష్మణ్, సాయి అనే ఇద్దరు యువకులు కెనాల్‌లో దూకి యువకుడిని కాపాడారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు యువకుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. యువకుడిని కాపాడిన లక్ష్మణ్, సాయిలను ఎస్ఐ రాజ్‌కుమార్ అభినందించారు.

పకడ్బందీగా పోలీసుల నిఘా, తనిఖీలు

వరంగల్ కమిషనరేట్ పరిధిలో 24 చెక్ పోస్టులు ● లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు

వరంగల్ క్రైం, మార్చి20: మే మాసంలో జరిగే లోక్‌సభ ఎన్నికలకు పోలీసు భద్రతను పటిష్ఠం చేశారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో 24 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు విస్మరించి డబ్బు, నగలు, మద్యం సరఫరాను చెక్ పోస్టులతో నియంత్రించనున్నారు. నిబంధనలను విస్మరించి ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి తరలిస్తే స్వాధీనం చేసుకోనున్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా నిరంతరం చెక్ పోస్టుల తనిఖీలను పర్యవేక్షిస్తున్నారు.

చెక్ పోస్టుల వివరాలు

- వరంగల్ జిల్లా పరిధిలో నర్సంపేట నియోజకవర్గంలో అయ్యప్ప గుడి నర్సంపేట, బోలోన్‌పల్లి (నల్లబెల్లి), అశోక్‌నగర్ (ఖానాపురం)
- తూర్పు నియోజకవర్గంలో ఎంజీఎం సర్కిల్, నాయుడు పెట్రోల్‌పంపు, జాన్‌పాక్ లేబర్‌కాలనీ.
- వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో అనంతసాగర్ (హసన్‌పర్తి), డీసీ తండా, చింత నెక్కొండ.
- వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో కాజీపేట డీజిల్ కాలనీ, ఐశ్వర్య గార్డెన్ (ములుగు రోడ్), సీఎస్ఆర్ గార్డెన్ (హంటర్‌రోడ్డు).
- పరకాల నియోజకవర్గంలో కటాక్షపూర్ క్రాస్‌రోడ్డు, కొమ్మాల, నడికూడ.
- హుస్నాబాద్ నియోజకవర్గం పెంచికలపేట (ఎల్కతుర్తి).
- జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలో జీడికల్ (లింగాలఘణపురం), నల్లబండ (జఫర్‌గఢ్), రాంపూర్ (ధర్మసాగర్).
- పాలకుర్తి నియోజకవర్గం మొర్రాయి (దేవురుప్పుల), కిష్టాపూర్ క్రాస్‌రోడ్డు (రాయపర్తి).
- జనగామ నియోజకవర్గం పెంబర్తి (జనగామ), ఇన్నానాయక్ తండా (తరిగొప్పుల), కొన్నె క్రాస్‌రోడ్ (బచ్చన్నపేట).

మతాన్ని ప్రోత్సహించే ఎన్ఈపీ విద్యా విధానాన్ని రద్దు చేయాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి



ఎస్ఎఫ్ఐ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎల్ మూర్తి

కేయూ క్యాంపస్, మార్చి 20: మతాన్ని ప్రోత్సహిస్తూ, మనుషుల్లో తారతమ్యాలను తేచ్చే నూతన జాతీయ విద్యా విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి డిమాండ్ చేశారు. బుధవారం కేయూ దూరవిద్యకేంద్రంలోని ప్రొఫెసర్ జాఫర్ నిజాం సెమినార్ హాల్‌లో ఎస్ఎఫ్ఐ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్ఎల్ మూర్తి హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన అన్‌సైంటిఫిక్ ఎన్ఈపీ-2020ని రద్దు చేయాలని అన్నారు. విద్యాసంస్థల్లో మతాన్ని ప్రవేశపెట్టే విధానాలను కేంద్రం మానుకోవాలని డిమాండ్ చేశారు. బడా పెట్టుబడిదారులకు కంపెనీ జీతగాళ్లుగా తయారు చేసే విధానాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ పోరాడుతోందని అన్నారు. వర్సిటీల స్వయంపతిపత్తిని కాపాడాలని అన్నారు.

ఎస్ఎఫ్ఐ కేయూ కమిటీ ఎన్నిక

కాకతీయ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని 17 మందితో నియమించగా అధ్యక్ష, కార్యదర్శులుగా సాయికిరణ్, స్టాలిల్‌లు ఎంపికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా పరిమిళ, అరుణ్, సహాయకార్యదర్శిగా అనూష, జస్వంత్, ట్రెజరర్‌గా అభిరామ్, కమిటీ సభ్యులుగా వరుణ్‌తేజ్, సాయి ప్రసన్న, సందీప్, తేజస్విని, సాయితేజ, పవన్‌లను ఎన్నుకున్నారు. అనంతరం మహాసభ నూతనంగా ఎన్నికైన కమిటీ పలు తీర్మానాలను ఆమోదించింది. వర్సిటీల స్వయం పతిపత్తిని కాపాడాలని, కేయూ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని, వర్సిటీల్లో ఖాళీగా బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలని తీర్మానాల్లో కోరారు. ఎస్ఎఫ్‌సీ కోర్సులను రెగ్యులర్ చేయాలని, సరైన అర్హతలున్న వారినే వీసీలుగా నియమించాలని, రాజకీయ ప్రాబల్యం వద్దని కోరారు. పెంచిన వర్సిటీల్లోని ఫీజులను తగ్గించాలని, కేయూ మహిళ ఇంజనీరింగ్ విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పించాలని కోరారు. నూతన కమిటీకి ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ, కేయూ అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ అభినందించారు. వివిధ డిపార్టుమెంట్‌ల విద్యార్థులు పాల్గొన్నారు.

నగరంలో హంగులతో కూడిన క్రికెట్ స్టేడియం

హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు



వరంగల్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గంతో జగన్‌మోహన్‌రావు

వరంగల్ స్పోర్ట్స్, మార్చి 20: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో వరంగల్ నగరంలో ఉప్పల్ స్టేడియం తరహాలో అన్ని హంగులతో కూడిన రంజీ మ్యాచ్‌లు ఆడే వసతుల కలిగిన నూతన క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానని హెచ్‌సీఏ, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.జగన్‌మోహన్‌రావు తెలిపారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఓ హోటల్‌లో వరంగల్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి జగన్‌మోహన్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ఉమ్మడి వరంగల్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు.

అనంతరం జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అంటే ఒక్క హైదరాబాద్ ప్రాంతానికే పరిమితం కాదని, రాష్ట్రంలో ఉన్న 10 జిల్లాల సొత్తు అని పేర్కొన్నారు. హెచ్‌సీఏ ఆధ్వర్యంలో ప్రతీ జిల్లాలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. క్రికెట్‌ను మారుమూల ప్రాంతాలకు విస్తరించేలా హెచ్‌సీఏ ఆధ్వర్యంలో ప్రతిభ గల క్రీడాకారులకు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. త్వరలోనే వరంగల్ నగరంలో క్రికెట్ వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తామని, ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను హెచ్‌సీఏ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శిక్షణ ఇస్తామన్నారు. వరంగల్‌లో క్రికెట్ క్లబ్ ఏర్పాటుకు జిల్లాలోని వివిధ క్రీడాసంఘాల బాధ్యులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. హనుమకొండ జేఎన్ఎస్‌లో ఉన్న హ్యాండ్‌బాల్ అకాడమీని ఎట్టి పరిస్థితుల్లో తరలించకూడదని కోరారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ప్రకటించారు. ఈసమావేశంలో ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అజీజ్‌ఖాన్, బైరబోయిన కైలాస్ యాదవ్, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్, అంతర్జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు పోగుల అశోక్, అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు సారంగపాణి, ఫైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్‌యాదవ్, కబడ్డీ అసోసియేషన్ బాధ్యులు సారంగపాణితో పాటు వివిధ క్రీడా సంఘాల బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఉమ్మడి వరంగల్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ చైర్మన్‌గా బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, అధ్యక్షుడిగా డాక్టర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా బొద్దు విష్ణు, కోశాధికారిగా బి. నరేందర్‌బాబు, ఉపాధ్యక్షులుగా పోగుల అశోక్, ఎస్. రాజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి బి. అశోక్, ఈసీ సభ్యులుగా సంతోష్, శ్రీధర్, వీరస్వామి, శ్రీను, కిరణ్, నాగరాజులను ఏకగ్రీవంగా నియమితులయ్యారు.



విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న జైసింగ్ రాథోడ్, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

పోరాటవీరుడు ఠానునాయక్

న్యూశాయంపేట, మార్చి 20: నిజాం సర్కారుకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప నాయకుడు ఠానునాయక్ అని విగ్రహ ప్రతిష్ఠాపకుడు జైసింగ్ రాథోడ్ అన్నారు. ఠానునాయక్ 74వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలపార్కు వద్ద ఉన్న ఠానునాయక్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సీపీఐ, సీపీఎం నాయకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు సమ్మయ్య రాథోడ్, గోపాల్‌నాయక్ తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.



జంగా రాఘవరెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

జంగాకు కాంగ్రెస్ నాయకుల శుభాకాంక్షలు

మడికొండ, మార్చి 20: రాష్ట్ర కో ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన జంగా రాఘవరెడ్డిని గ్రేటర్ వరంగల్ టేకుల గూడెంలోని ఆయన నివాసంలో బుధవారం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. జంగాను కలిసిన వారిలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ గంగుల శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులు వస్కుల శంకర్, బిల్ల రవిందర్, కుర్ల మోహన్, గుర్రం అమర్‌నాథ్, భైరి లింగమూర్తి, రాజారపు స్వామి, సదానందం, వస్కుల నాగరాజు, ఉబ్బని రసజ్ఞ, బస్కె ప్రణయ్, నక్కల రాజు, గున్నాల గౌతమ్, పెనుకుల వినయ్, జిట్ట చంటి, అప్పి, కళ్ళెపు నరేష్, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

పిచ్చుకలను సంరక్షించుకుందాం..

• మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్
• వైల్డ్ లైఫ్ సొసైటీ పోస్టర్ ఆవిష్కరణ

రాంనగర్, మార్చి20: వాతావరణ మార్పులతో అంతరిస్తున్న పిచ్చుకలను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని, జీవవైవిధ్యంలో వాటి పాత్ర కీలకమని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్ తెలిపారు. ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాన్ని బుధవారం హనుమకొండలోని వినయభాస్కర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినయభాస్కర్ మాట్లాడుతూ.. రేడియేషన్ వల్ల పిచ్చుకలు అంతరించి పోతున్నాయన్నారు. పిచ్చుకలను సంరక్షించేందుకు పక్షి ప్రేమికులు నడుంబిగించాలన్నారు. ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకుని వాటి సంరక్షణకు గిఫ్ట్ ఏ నెస్ట్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సోదా కిరణ్, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ బాధ్యులు శ్యామ్‌సుందర్ శర్మ, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వన్య ప్రాణులను సంరక్షించాలి

వడ్డెపల్లి: వన్య ప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత సమాజంపై ఎంతైనా ఉందని హనుమకొండ డీఆర్‌వో వైవీ గణేష్ అన్నారు. ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని టౌన్ హాల్ వద్ద బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఊర పిచ్చుకలపై ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. పిచ్చుకల తాగునీటికోసం మట్టితో తయారు చేసిన చిప్పలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విశ్రాంత అటవీ అధికారి కె. పురుషోత్తం, సైబర్ క్రైం ఏసీపీ కె. విజయ్ కుమార్, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్ శర్మ, పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మండల పరుశురాములు, పి. రాజ్‌కుమార్, అనితరెడ్డి, ఎండి సిరాజొద్దీన్, కె. దామోదర్, ప్రొఫెసర్ ద్రోణంరాజు కేశవరావు, శ్రావణ్‌కుమార్,బి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

• కాళోజీ జంక్షన్: ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా బుధవారం అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ అనితారెడ్డి హనుమకొండలోని వివిధ గార్డెన్లలో వాకింగ్ చేస్తున్న వ్యక్తులను కలిసి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. వేసవిలో పిచ్చుకలు, ఇతర పక్షుల దాహార్తిని తీర్చడానికి మానవత్వంతో ఇంటిలో పెరడు, పిట్ట గోడలు, డాబాలపై నీటి ముంతలను, గూళ్లను ఏర్పాటు చేయాలని కోరారు. అందు కోసం అనితారెడ్డి నీటి ముంతలను, పిచ్చుక గూళ్లను ఆసక్తిగల వాకర్స్‌కు ఉచితంగా అందజేశారు. మనుషుల లాగే పశు పక్షాదులకు జీవించే హక్కు ఉంటుందని వాటిని స్వేచ్ఛగా బతకనివ్వాలని ఆమె వాకర్స్‌కు పిలుపు నిచ్చారు. అనితారెడ్డి ఇంటి ఆవరణలో వందలాది మొక్కలు నాటి నీటి తొట్లను, ఆహారపు చిప్పలను ఏర్పాటు చేశారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వినయభాస్కర్

• ధర్మసాగర్: మూగజీవులైన పక్షులను, జంతువులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.నాగేశ్వరి అన్నారు. ధర్మసాగర్ మండలం మల్లక్‌పల్లిలోని హైస్కూల్‌లో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామచంద్రం, కె.సోమశేఖర్, రాజమహ్మద్, వినయ్ కుమార్, నవీన్ కుమార్, ప్రేమ్‌రెడ్డి, కృప సాగర్, భిక్షపతి, స్వరూపరాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అరూరి రమేష్

బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యం

మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత అరూరి రమేష్

వడ్డెపల్లి, మార్చి20: బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నేత అరూరి రమేష్ అన్నారు. బుధవారం వడ్డెపల్లి ప్రశాంత్‌నగర్‌లోని అరూరి రమేష్ నివాసంలో గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ బీజేపీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ.. బీజేపీ పటిష్ఠతకు పార్టీ శ్రేణులు అంకితభావంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 56వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మందోటి మహేందర్ పటేల్, కిసాన్ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి అమృతరావు, బీజేపీ జిల్లా నాయకులు లేగల శివరామ్, బండి హరీష్ ముదిరాజ్, తక్కళ్లపల్లి నిఖిల్‌రావు, కటకం రాజేష్, రాంచందర్‌గౌడ్, భూక్య రాజేందర్ నాయక్, పేరాల కుమారస్వామి, సురేందర్‌రెడ్డి, ఇమ్మడి సందీప్, ముస్కుల సుమన్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హనుమకొండ టౌన్, మార్చి20 : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డిఈ జి.సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశ్‌రెడ్డిపేట, గణేశ్‌నగర్, నాగేంద్రనగర్, విల్లాస్, జూలైవాడ, ఎఫ్‌సిఐ కాలనీ, పోలీస్‌కాలనీ ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఉద్యోగ సంఘాల నేతలు

హనుమకొండ కలెక్టరేట్, మార్చి20: ఉద్యోగ సంఘాల నేతలు బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు నాయకులు కలెక్టర్ చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం ఉద్యోగ సంఘాల నాయకులు కలెక్టర్ సిక్తా పట్నాయక్, అడిషనల్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాను శాలువాలు కప్పి సన్మానించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, జిల్లా కోశాధికారి పనికెల రాజేష్, కేంద్ర సంఘం నాయకులు శ్యాంసుందర్, లక్ష్మీప్రసాద్, జిల్లా నేతలు సలీం, రామ్‌ప్రసాద్, రాజేష్ ఖన్నా, భరత్, శ్యామ్, పైడి రాజు, ప్రదీప్, శ్రీనివాస్ తదితర నాయకులు ఉన్నారు.



కలెక్టర్‌కు చిత్రపటాన్ని అందజేస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

మునిసిపల్ కమిషనర్‌ను కలిసిన యూనియన్ల నాయకులు

వరంగల్ కార్పొరేషన్, మార్చి 20: ఇటీవల గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అశ్విని తానాజీ వాకడేను బుధవారం వివిధ సంఘాల నాయకులు కలిసి పూల మొక్కలు అందించారు. సీఐటీయూ, టీఎమ్మార్‌పీఎస్, టీఎంఈడబ్ల్యూఏ, జాక్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో బొట్ల భిక్షపతి, ధర్మరాజు, ఉప్పలయ్య, రఘు, మహేశ్‌బాబు ఉన్నారు.

ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలి

రైల్వే బోర్డు సభ్యుడు మేకల హరిశం

హసన్‌పర్తి, మార్చి 20: మండలంలోని హసన్‌పర్తి రోడ్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ రైల్వే బోర్డు సభ్యుడు మేకల హరిశంకర్ సూపరింటెండెంట్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరిశంకర్ మాట్లాడుతూ.. హసన్‌పర్తి వద్ద మూడవ లైన్ అభివృద్ధి, నూతన రైల్వే స్టేషన్ నిర్మాణం దృష్ట్యా ప్రయాణికులకు సౌకర్యాలు లేవన్నారు. స్టేషన్‌లో తాగునీటి సౌకర్యంను కల్పించాలని, మరుగుదొడ్లను నిర్మించాలని, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, వాహనాల పార్కింగ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎల్లాపూర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రేణుకుంట్ల దుర్గాప్రసాద్, 65వ డివిజన్ ప్రధాన కార్యదర్శి వెలిసోజు బుచ్చిరాములు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయి

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రావు

హసన్‌పర్తి, మార్చి 20: క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు అర్శినపల్లి జగన్‌మోహన్‌రావు అన్నారు. హసన్‌పర్తి మండలం అనంతసాగర్ వద్ద గల ఎస్సార్ యూనివర్సిటీలో బుధవారం వార్షిక క్రీడా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు, అధ్యాపకులకు క్రీడలు నిర్వహించారు. అనంతరం జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. క్రీడలు నిర్వహించడం వలన విద్యార్థుల్లో మానసిక స్థైర్యం, అధ్యాపకుల్లో ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొంటుందన్నారు. ఈ సందర్భంగా క్రికెట్ ,వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, కోకో, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, చదరంగం, పరుగు పందెం పోటీలను నిర్వహించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ దీపక్‌గార్గ్, రిజిస్ట్రార్ ఆర్.అర్చనారెడ్డి, డీన్ ఏవీవీ సుధాకర్, పీడీ డాక్టర్ పి.శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడిపై చర్యలు తీసుకోవాలి

అదనపు కలెక్టర్‌కు డీవైఎఫ్ఐ నేతల వినతి

వరంగల్ మెడికల్/హనుమకొండ కలెక్టరేట్, మార్చి 20: యువకుడి మృతికి కారణమైన కేఎంసీ ఆవరణలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి యూరాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రణధీర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షుడు మంద సుచందర్ అదనపు కలెక్టర్ వెంకటిరెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హనుమకొండ మండలం పలివేల్పుల గ్రామానికి చెందిన పసునూరి దేవేందర్ గత జూన్‌లో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలోని యూరాలజీ డాక్టర్ సంప్రదిస్తే మందులు, మంచి ఆహారం తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. అయినా వ్యాధి తగ్గకపోవడంతో గత సెప్టెంబరులో యూరాలజీ డాక్టర్ నిర్వహిస్తున్న ప్రైవేట్ క్లినిక్‌కు వెళ్లి చికిత్స చేసుకున్నా వ్యాధి నయం కాలేదన్నారు. దీంతో యూరాలజీ డాక్టర్ వల్లే వ్యాధి నయం కావడం లేదని మార్చి 18న లేఖ రాసి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తూ ప్రయివేట్ క్లినిక్ నిర్వహిస్తున్న వైద్యులపై చర్యలు తీసుకొని మెడికల్ సర్టిఫికెట్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మృతుడి కుటుంబానికి తగిన న్యాయం చేయాలని డీవైఎస్ఐ నేతలు వినతిపత్రంలో కోరారు.

విత్తనాల ఉత్పత్తి బాధ్యత శాస్త్రవేత్తలపై ఉంది



లెక్చర్ వర్క్‌షాప్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ రమేష్, తదితరులు

నయింనగర్, మార్చి 20: ఎక్కువ పోషకాలు కలిగిన విత్తనాలను ఉత్పత్తి చేసే బాధ్యత శాస్త్రవేత్తలపై ఉందని కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ అన్నారు. హనుమకొండ కిషన్‌పురలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో '21వ శతాబ్దంలో వృక్షవిజ్ఞానశాస్త్రంలో ఆధునిక పోకడలు' అనే అంశంపై సైన్స్ అకాడమీస్ లెక్చర్ వర్క్‌షాప్‌ను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ హాజరై మాట్లాడారు. నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న కాలుష్యం, పర్యావరణ సమస్యలు, భూమి వేడెక్కడం, వాతావరణ మార్పులు వంటి సమస్యలను అధిగమించాలంటే సైన్స్‌లో విశిష్టమైన పరిశోధనలు జరగాల్సిన అవసరముందన్నారు. అనంతరం సైన్స్ అకాడమీస్ లెక్చర్ వర్క్‌షాప్‌పై రూపొందించిన పుస్తకాన్ని వీసీ రమేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వాగ్దేవి కళాశాలల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్‌వాహినీదేవి, ప్రిన్సిపాల్ డాక్టర్ శేషాచలం, సుందరావన్, లక్ష్మారెడ్డి, పి.హరీందర్‌రెడ్డి, వర్క్‌షాప్ కన్వీనర్ ప్రొఫెసర్ సి.మనోహరచారి, వివిధ విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్‌గా రాజమణి

కేయూ క్యాంపస్, మార్చి 20: కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ నూతన డైరెక్టర్‌గా కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.రాజమణి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పెండ్లి అశోక్‌బాబు నుంచి ఉత్తర్వులను అందుకున్నారు. ఇప్పటి వరకు డైరెక్టర్‌గా కొనసాగిన డాక్టర్ కె.సదాశివ నుంచి రాజమణి బాధ్యతలు చేపడుతారు. కాగా, డాక్టర్ రాజమణి 2013లో కేయూ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగంలో చేరారు. సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కెమిస్ట్రీ విభాగాధిపతిగా పనిచేశారు. 12కు పైగా అంతర్జాతీయ, జాతీయ సదస్సుల్లో విలువలైన కీలక పరిశోధన పత్రాలను ప్రచురించారు. 2 పుస్తకాలకు సంపాదకులుగా వ్యవరించారు. తెలంగాణ మహిళ సభ వ్యవస్థాపక వైస్‌ప్రెసిడెంట్‌గా, ఇండియన్ గైనకాలజీ సొసైటీ, ఇండియన్ సైన్స్‌కాంగ్రెస్ జీవితకాల సభ్యురాలిగా పనిచేస్తున్నారు. కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్‌తోపాటు కేయూ ఎస్సీ, ఎస్టీ రిమిడియల్ కోచింగ్ సెంటర్ సమన్వయాధికారుగానే వ్యవరిస్తారని రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజమణిని పలువురు అభినందించారు.

లయన్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ అందజేత

కాళోజీ జంక్షన్, మార్చి 20: ఆదర్శ వివాహం చేసుకున్న దంపతులకు హనుమకొండ నక్కలగుట్టలోని ఆనంద్ టవర్స్ ప్రాంగణంలో హనుమకొండ లయన్స్ క్లబ్ ట్రై సిటీస్ అధ్యక్షుడు పుల్లా సంజీవరావు కుట్టు మిషన్ అందజేశారు. గుండ్ల సింగారం ప్రాంతానికి చెందిన అనిశెట్టి అరవింద్ చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోగా వరంగల్ ఆటో నగర్‌లోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ఆశ్రయం పొందాడు. వసతిగృహం నుంచి బయటకు వచ్చాక ఆటో నగర్ ప్రాంతానికి చెందిన కర్పూరపు జోష్నను ఆదర్శ వివాహం చేసుకున్నాడు. టైలరింగ్ శిక్షణ పూర్తి చేసిన జోష్నకు ఉపాధి కోసం సామాజిక వేత్త మండల పరుశురాములును సంప్రదించాడు. విషయాన్ని హనుమకొండ లయన్స్ క్లబ్ ట్రైసిటీస్ అధ్యక్షుడు సంజీవరావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి కుట్టు మిషన్‌ను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రొబేషన్ ఆఫీసర్ బి. రాధా, ప్రొటక్షన్ ఆఫీసర్ ఎస్. ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కుట్టు మిషన్ పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సంజీవరావు

మడికొండలో గంజాయి పట్టివేత



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మడికొండ, మార్చి 20: మడికొండ పోలీసులు బుధవారం 2 కిలోల 900 గ్రాముల గంజాయి పట్టుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ వివరాలను వెల్లడించారు. కాజీపేట రహమత్‌నగర్‌కు చెందిన వేల్పుల ఆనంద్, కాజీపేట బోడగుట్టకు చెందిన కొం గరి పవన్‌కళ్యాణ్, కాజీపేట వైఎస్సార్ నగర్‌కు చెందిన గాలి తరుణ్ అనే యువకులు కొంతకాలంగా గంజాయి తాగడానికి అలవాటు పడ్డారు. ఈ క్రమంలోనే వీరి ముగ్గురు స్నేహితులయ్యారు. వీరిలో వేల్పుల ఆనంద్ కొంతకాలంగా విశాఖపట్నంలో గంజాయి తెచ్చి స్థానికంగా తన స్నేహితులు పవన్‌కళ్యాణ్, తరుణ్‌తో కలిసి చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి ఎక్కువ ధరకు అమ్మించి లాభాలు గడిస్తున్నారు. విశాఖపట్నం వెళ్లి గంజాయి కొనుగోలు చేసి బుధవారం కాజీపేటలో రైలు దిగి బైక్‌పై వెళ్తున్నారు. అయోధ్యపురం రైల్వే గేటు వద్దకు రాగానే అనుమానాస్పదంగా ఉన్న వారిని పెట్రోలింగ్ డ్యూటీలో ఉన్న ఎస్సై, పోలీస్‌సిబ్బంది ఆపి తనిఖీ చేయగా వారి వద్ద ఎండు గంజాయి లభించింది. వెంటనే వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రతిప్ తెలిపారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం..

వరంగల్ కార్పొరేషన్, మార్చి 20: మేడారంలో విధులు నిర్వంచి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ బొట్ల దేవానంద్ (40) చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మంగళవారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మృతదేహం బుధవారం ఎంజీఎం పోస్టుమార్టంకు చేరుకోగా నగర పాలక సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్ మల్లం రాజేశ్ మున్సిపల్ సిబ్బందితో కలిసి సందర్శించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మృతుడు దేవానంద్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తక్షణ సహాయంగా దహన సంస్కారాలకు రూ.20వేలు ఇస్తున్నట్లు తెలిపారు. అందేకాకుండా వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ నుంచి రూ.1.50లక్షలు, ములుగు కలెక్టర్ సహాయ నిధి నుంచి రూ.1.50లక్షలు త్వరలో అందే విధంగా చూస్తామని చెప్పారు. మృతుడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. సీఎంహెచ్‌వో వెంట వివిధ సంఘాల నాయకులు ఉన్నారు.

వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



శ్రీ వెంకటేశ్వరస్వామికి కుంభ కిరీటం, గోదా అమ్మవారికి కొప్పు కిరీటాలను బహుకరిస్తున్న దృశ్యం

కాజీపేట టౌన్, మార్చి 20: కాజీపేట 61వ డివిజన్‌లోని చైతన్యపురిలో వేంకటేశ్వరస్వామి 22వ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం రుత్వికులు బాలభోగం, హోమం, బలిహరణం గరుడసేవ, గ్రామోత్సవం, ఆరగింపు వంటి పలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేయడంతో చైతన్యపురిలో పండుగ వాతావరణం నెలకొంది. వేంకటేశ్వరస్వామిని కీర్తిస్తూ భక్తులు పారాయణాలు చేశారు. ఈ ఉత్సవాల సందర్భంగా వేణు స్వామి కుటుంబసభ్యులు వేంకటేశ్వరస్వామికి కుంభ కిరీటం, గోదా అమ్మవారి మూలమూర్తికి శోభ కుటుంబసభ్యులు కొప్పు కిరీటాన్ని బహూకరించారు. కుంబ కిరీటం, కొప్పు కిరీటాలను బహూకరించిన వారిని ఆలయ కమిటీ తరుపున ఘనంగా సత్కరించారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ అధ్యక్షులు పంజాల అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మేజర్ వడ్డెపల్లి నరేందర్, ఇతర కమిటీ సభ్యులు, చైతన్యపురికి చెందిన పలువురు మహిళా భక్తులు పాల్గొన్నారు.

తాళ్ల పద్మావతి ఒలింపియాడ్‌లో స్కూల్ డే వేడుకలు

కాజీపేట, మార్చి 20: కాజీపేట సోమిడి తాళ్లపద్మావతి ఒలంపియాడ్ స్కూల్‌లో బుధవారం స్కూల్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవానికి '90 మిడిల్‌క్లాస్ బయోపిక్ ఫేం చైల్డ్ ఆర్టిస్ రోహన్ రాయ్ హాజరై స్టూడెంట్స్‌ను, పేరెంట్స్‌ను, సిబ్బందిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా రోహన్ రాయ్‌వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. తనకు సినిమాలంటే చాలా ఇష్టం అన్నారు. నాలుగో ఏటనుంచే సినిమాలు, సీరియల్స్‌లో నటిస్తున్నానన్నారు. ఇప్పటి వరకు 12చిత్రాలలో నటించానని, తమ తల్లిదండ్రులు సైతం మంచి ప్రోత్సాహాన్ని ఇస్తున్నారన్నారు. అనంతరం పలు చిత్రాల డైలాగ్‌లతో పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. తాళ్ల పద్మావతి విద్యా సంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, డైరెక్టర్ తాళ్ల వంశీ రోహన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా ర్థుల్లో స్ఫూర్తి నింపే వ్యక్తులను ప్రతీ ఏటా పిలుస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్దఎత్తున హాజరైయ్యారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రోహన్‌రాయ్

టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా సాంబయ్య

కాజీపేట, మార్చి 20: టీపీసీసీ రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్‌గా కాజీపేటకు చెందిన అరూరి సాంబయ్యను నియమిస్తూ బుధవారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ..నియామకానికి సహకరించిన ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ ఎన్. ప్రీతమ్‌కు, డిప్యూటీ సీఎం బట్టికి, జిల్లా మంత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 21 మార్చి 2024

కౌన్సెలింగ్

నాటు మందుతో కాలేయం గుల్ల

Q A

డాక్టర్! కామెర్లు సోకినప్పుడు పత్యం చేస్తూ, పసరు మందు తీసుకుంటే సరిపోతుంది అంటారు. ఈ మందుతో ఎంతవరకూ ప్రయోజనం ఉంటుంది?

ఓ సోదరి, హైదరాబాద్.



కాలేయం జబ్బు పడిందనడానికి కామెర్లు ఒక సంకేతం అనే విషయం అందరికీ తెలుసు. అయితే కామెర్లకు కారణమైన కాలేయ జబ్బుకు అసలు కారణాన్ని వైద్య సహాయంతో కనిపెట్టి, అందుకు తగిన చికిత్స తీసుకోవడం ఎంతో కీలకం అనే విషయం ఎవరికీ తెలియదు. మూలికా వైద్యాలు, ఇతరత్రా నాటు మందుల వల్ల కాలేయానికి మేలు కంటే హాని ఎక్కువ కలుగుతుంది. కొన్ని సందర్భాల్లో తీవ్రమైన లివర్ ఫెయిల్యూర్‌కూ దారి తీయవచ్చు. ఇలాంటి సందర్భాల్లో కాలేయ మార్పిడి అవసరం అవుతుంది. కాబట్టి కామెర్లు కనిపించినప్పుడు కాలేయ వ్యాధి మరింత ముదిరిపోకుండా ఉండడం కోసం వైద్యుల సలహాలను తీసుకోవాలి. ఆకలి మందగించడం, పొట్ట నిండుగా ఉన్నట్టు అనిపించడం, మత్తుగా ఉండడం, బరువు కోల్పోవడం, కాళ్ల వాపు లాంటి లక్షణాలు కనిపిస్తే, ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. ఆలస్యం చేయడం వల్ల కాలేయ సిర్రోసిస్ లేదా కాలేయ కేన్సర్‌లకు గురి కాక తప్పదు. ఆరోగ్యకరమైన ఆహారం, జీవనశైలిని అనుసరిస్తూ, మద్యపానం మానుకుని, మధుమేహాన్ని అదుపులో ఉంచుకుంటూ హెపటైటిస్ పరీక్షలు క్రమం తప్పక చేయించుకుంటూ అవసరాన్ని బట్టి వైద్య సహాయం తీసుకోగలిగితే కాలేయ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు.

డాక్టర్ నవీన్ పోలవరపు
చీఫ్ లివర్ స్పెషలిస్ట్,
అపోలో హాస్పిటల్స్, హైదరాబాద్.

స్ఫూర్తి

'ఎలాగైనా సివిల్స్ కొట్టాలి'. యువత ఆశించే లక్ష్యమిది. కానీ ఎక్కువ మంది రెండు, మూడు అపజయాలు ఎదురవగానే, కెరీర్ బ్రేక్ భయంతో, తోచిన ఉద్యోగంతో రాజీ పడిపోతూ ఉంటారు. కానీ పొన్నూరుకు చెందిన **భవ్య వట్టికూటి** ఇందుకు పూర్తి భిన్నం. ఎంచుకున్న లక్ష్యాన్ని అందుకోవడం కోసం ఏకంగా ఆరేళ్ల పాటు కృషి చేసి, అంతిమంగా ఏడాది వ్యవధిలోనే మూడు ప్రభుత్వోగాలకు ఎంపికై అరుదైన విజయాన్ని సొంతం చేసుకోగలిగింది. ప్రస్తుతం పూణెలో రెండేళ్ల ఐఆర్ఎమ్ఎస్ ట్రైనింగ్‌లో కొనసాగుతున్న భవ్య, 'నవ్య'తో తన అనుభవాన్ని ఇలా పంచుకుంది.



మూడు ప్రభుత్వోద్యోగాలు

చిన్నప్పటి నుంచే సివిల్స్ మీద ఆసక్తి ఏర్పడింది. మరీ ముఖ్యంగా స్మితా సబర్వాల్, రాజ కుమారి లాంటి మహిళా ఐఎఎస్ అధికారుల గురించి తెలిసిన తర్వాత కచ్చితంగా నేను కూడా అలాంటి ఉన్నతాధికారిగా ఎదిగి తీరాలనే కోరిక బలపడింది. కానీ అందు కోసం ఏ దారిని ఎంచుకోవాలో తెలియలేదు. ఇంటర్ తర్వాత ఇంజనీరింగ్ తీసుకుందామనుకున్నాను. కానీ డిగ్రీ చదివితే, మూడేళ్లకే పూర్తి చేసి, త్వరగా సివిల్స్‌కు ప్రిపేర్ అయిపోవచ్చు అనిపించింది. ఒకవేళ సివిల్స్‌లో నెగ్గలేకపోతే, ప్లాన్ బిలో భాగంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకోవచ్చనే ఆలోచనతో బిటెక్‌ను ఎంచుకోక తప్పలేదు. అలా 2016లో బిటెక్ పూర్తి చేసిన వెంటనే సివిల్స్ కోచింగ్ కోసం ఢిల్లీ వెళ్లిపోయాను. ఆ తర్వాత మొదటిసారి రాసిన సివిల్స్ పరీక్షలో నెగ్గలేకపోయినా, రెండోసారి ఇంటర్వ్యూ వరకూ వెళ్లగలిగాను. కానీ ఆ ఇంటర్వ్యూలో ఆరు మార్కుల తేడాతో నేను ఎంపిక కాలేకపోయాను. ఆ తర్వాత మూడోసారి, నాలుగోసారి, ఐదోసారి కూడా సివిల్స్ రాశాను. కానీ అన్నిసార్లూ విఫలమయ్యాను. చివరి ప్రయత్నంగా ఆరోసారి రాసిన సివిల్స్‌లో నాకు అదృష్టం వరించింది. అంతిమంగా అనుకున్న లక్ష్యాన్ని అందుకోగలిగాను.

కుంగుబాట్లను అధిగమించి...

సాధారణంగా ఎవరైనా ఒకట్రెండు సార్లు ఫెయిలైతే ప్రయత్నించడం మానేస్తారు. కానీ నేను ఎక్కడ పొరపాటు జరిగిందో కనిపెట్టి, దాన్ని అధిగమించి, సివిల్స్‌లో నెగ్గాలనే పట్టుదలను పెంచుకున్నాను. రెండోసారి ఇంటర్వ్యూ వరకూ వెళ్లగలిగినా, 3, 4, 5.. ఈ మూడు ప్రయత్నాల్లో మెయిన్స్‌లో విఫలమవుతూ వచ్చాను. దాంతో ఒత్తిడికీ, కుంగుబాటుకూ లోనయ్యాను. అయినా పట్టుదలను మాత్రం వదల్లేదు. మొదటిసారి రాస్తున్నప్పుడు మినహా తర్వాత ఎప్పుడూ నేను ఎలాంటి కోచింగ్ తీసుకోలేదు. సొంతగానే ప్రిపేర్ అయ్యాను. అలాగని రోజంతా చదివేదాన్ని కాదు. రోజులో ఏడు గంటలు చదువు కోసం కేటాయించేదాన్ని. పరీక్షలు దగ్గర పడుతున్నప్పుడు అంతకంటే ఎక్కువ సమయాన్ని వెచ్చించేదాన్ని. ఏం చదవాలో, ఎంత పోర్షన్ పూర్తి చేయాలో లక్ష్యంగా పెట్టుకుని, అందుకు తగ్గట్టు ప్రిపేర్ అయ్యేదాన్ని.

అందరూ చేసే పొరపాటు అదే...

కెరీర్ బ్రేక్ వస్తుందనే భయంతో సివిల్స్ నుంచి పక్కకు తప్పుకునే వాళ్లను నేను చూశాను. ఏ ప్రభుత్వ పరీక్షను ఎంచుకున్నా, దీర్ఘకాలం కష్టపడితే తప్ప విజయం సాధించలేని పరిస్థితి. అలాంటప్పుడు అంత సమయం వెచ్చింగలం అనుకున్నప్పుడే ఆ పరీక్షలకు సిద్ధపడాలి. అందు కోసం మన ఆర్థిక పరిస్థితులను కూడా బేరీజు వేసుకోవాలి. సంపాదన లేకుండా అన్నేళ్ల పాటు పరీక్షలకు సిద్ధపడగలగాలి. అంతిమంగా విజయం సాధించేవరకూ లక్ష్యం నుంచి తప్పుకోకూడదు. అలా కాకుండా కొంతమంది ఒకట్రెండేళ్లు ప్రయత్నించి వదిలేసి, ప్రయత్నాన్ని కొనసాగించాలా లేక చేతికందిన ఉద్యోగంతో సరిపెట్టుకుందామా అనే సందిగ్ధంలో పడిపోతూ ఉంటారు. ఒకవేళ సివిల్స్ ప్రయత్నాలు మానుకుని వేరే వృత్తిని ఎంచుకున్నా, దాన్లో మనసును నిమగ్నం చేయలేకపోతే రెండు విధాలా నష్టపోయిన వాళ్లం అవుతాం. కాబట్టి సివిల్స్‌కు పక్కా ప్లానింగ్ అవసరం. నిజానికి సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న సమయంలో మంచి ప్యాకేజీలతో నాకు కూడా మంచి ఉద్యోగావకాశాలు వచ్చాయి. అయినా రాజీ పడకుండా, లక్ష్యానికే కట్టుబడి ఉండిపోయాను. ఆరుసార్లు ప్రయత్నించే వీలున్నప్పుడు, అన్నిసార్లూ ప్రయత్నించి విఫలమైతే, అప్పుడు మనసు మార్చుకోవచ్చనేది నా ఉద్దేశం. సివిల్ సర్వీసెస్‌లో ఐఎఎస్‌గా ఎంపికవ్వాలి అనేది నా లక్ష్యం. కానీ ర్యాంక్‌ను బట్టి నేను ఐఆర్ఎమ్ఎస్ (ఇండియన్ రైల్వే మ్యానేజ్‌మెంట్ సర్వీసెస్)కు ఎంపికయ్యాను. ఇంతకు ముందు రైల్వే ట్రాఫిక్, రైల్వే పోలీస్.. ఈ రెండు మాత్రమే సివిల్ సర్వీసెస్‌లో ఉండేవి. ట్రాఫిక్‌తో పాటు ఏకంగా ఏడు రైల్వే సర్వీసులన్నిటినీ కలిపి యుపిఎసిలో ఐఆర్ఎమ్ఎస్ అనే ఒక ప్రధాన సర్వీసుకు 2020లో రూపకల్పన జరిగింది. ఈ సర్వీసుకు సంబంధించిన తొలి బ్యాచ్‌కు నేను ఎంపికయ్యాను. రెండేళ్ల పాటు కొనసాగే ఈ ట్రైనింగ్‌లో భాగంగా నేను రైల్వేస్‌కు సంబంధించిన ఏడు విభాగాల్లో శిక్షణ పొందబోతున్నాను.

> మాది గుంటూరు జిల్లా పొన్నూరు. ఇంటర్ పొన్నూరులో, బిటెక్ గుంటూరులోని విజ్ఞాన్ యూనివర్శిటీలో పూర్తి చేశాను. బిటెక్‌లో గోల్డ్ మెడల్ కూడా సాధించాను. నా విజయం వెనక కుటుంబ తోడ్పాటు, మరీ ముఖ్యంగా అమ్మ పద్మజ కృషి ఎంతో ఉంది. నేను అపజయం పొందిన ప్రతిసారీ నా కుటుంబం నన్ను భుజం తట్టి పోత్రహించిందే తప్ప, కెరీర్‌లో రాజీ పడిపోయేలా నన్ను ఒత్తిడి చేయలేదు. ఒకవేళ అదే జరిగి ఉంటే, నేను ఏదో ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగంతో సరిపెట్టుకునేదాన్నేనేమో! నాన్న లీలా ప్రసాద్ లాయర్. చెల్లి లీగల్ ఆఫీసర్.

ఒక్క దెబ్బకు మూడు పిట్టలు

2020లో రాసిన సివిల్ సర్వీసెస్ ఫలితం 2023 నవంబర్‌లో వచ్చింది. ఆరో ప్రయత్నంలో భాగంగా రాసిన ఈ చివరి పరీక్షలో నేను ఐఆర్ఎమ్ఎ్‌స్‌కు ఎంపికయ్యాను. కానీ ఈ ఫలితం వచ్చే లోగానే నన్ను ప్రభుత్వోద్యోగాలు వరించాయి. మొదట 2022లో ఎమ్‌పిడిఒ అవకాశం వచ్చింది. అదే ఏడాది నవంబరులో ఎమ్‌పిడిఒ శిక్షణ తీసుకోవడం మొదలుపెట్టాను. ఆ సమయంలోనే, 2023 ఆగష్టులో స్పోర్ట్స్ అథారిటీలో అసిస్టెంట్ డైరెక్టర్ ఉద్యోగాన్ని సాధించేశాను. దాంతో ఎమ్‌పిడిఒ శిక్షణ ముగిసిన వెంటనే, అక్టోబర్‌లో అసిస్టెంట్ డైరెక్టర్ ఉద్యోగంలో చేరిపోయి, 2024 జనవరి వరకూ విధుల్లో కొనసాగాను. గత ఏడాది నవంబరు సివిల్స్ ఫలితాల్లో ఐఆర్ఎమ్ఎస్‌కు ఎంపికవడంతో, ఆ ట్రైనింగ్ కోసం పిలుపు వచ్చే వరకూ స్పోర్ట్స్ అథారిటీలో కొనసాగి, చివరకు రాజీనామా చేశాను. ఇలా ఏడాది వ్యవధిలోనే మూడు ప్రభుత్వోద్యోగాలకు ఎంపిక కాగలిగాను.

స్వీయ నియంత్రణ అవసరం

మన లక్ష్యానికి దూరం చేసే అంశాలు మన చుట్టూరా లెక్కలేనన్ని ఉంటాయి. మరీ ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ లాంటి వాటితో చాలా సమయం వృథా అయిపోతూ ఉంటుంది. వీటి విషయంలో స్వీయ నియంత్రణను మించిన ఉత్తమమైన సాధనం ఇంకొకటి ఉండదని నా అభిప్రాయం. నా వరకు నేను పరీక్షలు దగ్గర పడే సమయంలో వీటిని అన్ ఇన్‌స్టాల్ చేసేసేదాన్ని. అలాగని సోషల్ మీడియా నిరుపయోగమైనది అని కూడా అనడానికి లేదు. దీన్లో కూడా జ్ఞానాన్ని పెంచుకునే అవకాశాలుంటాయి. అయితే దాన్ని మనం మన లక్ష్యానికి తగ్గట్టు ఎంత వరకూ ఎంత సమయం మేరకు సద్వినియోగం చేసుకుంటున్నాం అనేది ఎవరికి వారు ఆలోచించుకోవాలి. సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యే సమయంలో రిలాక్సేషన్ కోసం కూడా నేను సమయాన్ని కేటాయించుకునేదాన్ని. ఆ సమయంలో సోషల్ మీడియాలో జ్ఞానాన్ని పెంచే అంశాలకే ప్రాధాన్యం ఇచ్చేదాన్ని. అలాగే నేను తెలుగు నవలలు ఎక్కువగా చదువుతూ ఉంటాను. రూబిక్ క్యూబ్స్ పరిష్కరించడం ఇష్టం. అలాగే సినిమాలు కూడా చూస్తూ ఉంటాను. ఒత్తిడి మరీ ఎక్కువగా ఉంటే ధ్యానం చేస్తాను. సివిల్స్‌కు సిద్ధపడాలంటే మానసిక ప్రశాంతత, ఆరోగ్యకరమైన ఆహారం... ఈ రెండూ అవసరం అని నా అభిప్రాయం.

నా ముద్ర కచ్చితంగా ఉంటుంది

ఉద్యోగం ఎంత చిన్నదైనా, పెద్దదైనా మనదైన ముద్ర వేయగలిగే అవకాశం కచ్చితంగా ఉంటుంది. గతంలో నేను ఎమ్‌పిడిఒగా ఉన్నప్పుడు, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత మెరుగ్గా అందించగలిగే చిన్న చిన్న కార్యక్రమాలకు నేను పూనుకోగలిగాను. ఆరేళ్ల పాటు సివిల్స్‌కు కష్టపడ్డాను కాబట్టి ఈ క్రమంలో నేను పెంపొందించుకున్న జ్ఞానాన్నీ నేను అందుకోబోయే వృత్తిలో ఉపయోగించి, నాదైన ముద్రతో మార్పు తీసుకురావాలని నేను ఆశిస్తున్నాను.

• గోగుమళ్ల కవిత

నా జీవితం సేవకే అంకితం

ఇతరులకు సేవ చేయాలంటే మనసుండాలి. ముఖ్యంగా సమాజం పట్ల ప్రేమ ఉండాలి. పనిమీద అంకితభావం ఉండాలి. మూడు పదుల వయసులోనే సమాజం పట్ల పెద్ద మనసు చేసుకున్న అరుదైన వ్యక్తి ఈ రామ తులసి. 'వివేకానంద సేవాశ్రమం'లో అభాగ్యులకు అండగా నిలుస్తోందీమె. అంతేనా వివేకానంద ఫౌండేషన్ తరపున సామాజిక సేవకోసం నేను సైతం... అంటూ పాటుపడుతున్న రామ తులసిని 'నవ్య' పలకరించింది.

"వివేకానంద సేవాశ్రమం స్థాపించి నాలుగేళ్లయ్యింది. ఈ ఆశ్రమం కడప జిల్లాలోని కాశినాయన మండలంలోని ఓబుళాపురం గ్రామంలో ఉంది. అది కూడా సగిలేరు ఒడ్డున ఉంది. ప్రకృతి మధ్య ఉండే అందమైన ప్రదేశమిది. దిక్కు మొక్కులేని వారిని ఆదరించి.. అన్నంపెట్టి.. వారికి జీవితం పట్ల ప్రేమ కలిగించటమే మా ఉద్దేశ్యం. ఇక్కడ ఉండేవాళ్లు వృద్ధులూ కాదు.. అనాథలూ కాదు.. కేవలం సాటి మనుషులుగా చూస్తాం. వేళకు తిండి పెడతాం.. ప్రేమగా చూసుకుంటాం. ఆశ్రమంలో ఉండే పదిహేడు మందిలో ఒక్కదాన్నై కలసిపోతా. ఎందుకో తెలీదు.. వారి పట్ల దయ కంటే.. ప్రేమ ఉంటుంది నాకు!

అలా నా వంతు..

2010 సంవత్సరం నుంచి మా ఆయన పాపిజెన్ని రామకృష్ణారెడ్డి 'వివేకానంద ఫౌండేషన్' నడిపిస్తున్నారు. తన భావాలంటే ఇష్టం. అందుకే ఆ సమయంలోనే వలంటీర్‌గా చేరా. తన గురించి తెలిసే పెళ్లికి అంగీకరించా. 2014లో మా పెళ్లి జరిగింది. ఫౌండేషన్‌ను మరింత దగ్గరగా చూశాక.. ఇంత కష్టపడాలా? మనవల్ల అవుతుందా? అనుకున్నా. పుట్టింటోళ్లు 'మా పిల్ల ఈ పనులు చేయలేదమ్మా' అన్నట్లు మాట్లాడారు. అంత త్వరగా సేవ చేయటానికి మనసు రాలేదు. మా వారి ఆశయాలు, ఆయన చేసే సేవతో పాటు మీడియాలో మానవీయ కథనాలను చూసినపుడు చలించిపోయేదాన్ని. నా వంతూ సమాజానికి ఏదోటి చేయాలని అనిపించిందలా. మెల్లమెల్లగా వివేకానంద ఫౌండేషన్‌కు పూర్తిస్థాయిలో పని చేయటం ప్రారంభించా. దిక్కులేని వారికి ఓ షెల్టర్ కడితే బావుంటుందని మా ఆయనకు చెప్పా. 'కట్టిద్దాం' అన్నారు. ఆయనది రైల్వే ఉద్యోగం. చాలీచాలని జీతం. దీంతో డబ్బుల్లేవని ఊరుకున్నారు. ఆ సమయంలో దాతలెవరూ ముందుకు రాలేదు. ఏ మాత్రం ఆలోచించకుండా.. పది తులాల బంగారు ఆభరణాలను బ్యాంకులో పెట్టమని మా ఆయనకిచ్చా. రెండున్నర లక్షల రూపాయలొచ్చాయి. అలా ఆశ్రమానికి నా వంతు పునాదిరాయి వేశా. ఆ తర్వాత దాతలు ముందుకు వచ్చారు.



అంత్యక్రియలు చేయవద్దన్నారు..

నాకిద్దరు కొడుకులు. మేమంతా ఆశ్రమంలోనే ఉంటాం. అనారోగ్యంతో బాధపడేవారికి సేవలు చేస్తాం. మేం ఎవరి పెళ్లిళ్లకూ పోము. ఎందుకంటే ఆశ్రమం చూసుకోవటం కష్టం కదా! అందరిలా బంగారు ఆభరణాలు ధరించాలనే ఆశ నాకేమీ లేదు. ఉన్నంతలో పదిమందికి సేవ చేయాలనే ఆలోచన తప్ప. మా ఆయన జీతాన్నంతా ఆశ్రమం కోసమే కేటాయిస్తారు. దీంతో నాకు నిస్వార్థ గుణం వచ్చింది. నా ఇద్దరు పిల్లలూ అంతే. ఒక రోజు నా కంటి ఆరోగ్యం బాలేదు. మా ఆయనకు కాలు బెణికింది. మేం ఇద్దరం ఆస్పత్రికి వెళ్లాం. ఆ రోజు మా ఇద్దరు పిల్లలే ఆశ్రమాన్ని చూసుకున్నారు. వారిలో సేవాగుణం ఉన్నందుకు సంతోషపడ్డాం. చిన్నప్పటి నుంచీ నాకో భయం ఉండేది. ఎవరైనా చనిపోతే కనీసం చూడటానికి కాదు కదా..! వాళ్ల ఇంటి వైపు వెళ్లాలన్నా భయమే. అలాంటి నేను ఆశ్రమంలోని వాళ్లు అనారోగ్యంతో చనిపోతే శవాలనూ మోశాను. కరోనా సమయం నుంచి ఇప్పటికి నలభై మూడు మంది చనిపోతే వారి అంత్యక్రియలు దగ్గరుండి చేశాం. 'ఆడపిల్లవై ఉండి.. ఇలాంటివి నీకెందుకూ? అవసరమా?' అన్నారు కొందరు. అంతవరకూ ఆశ్రమంలో అవ్వ, తాతలతో కలిసిమెలిసి ఉండే నేను.. వారి కడచూపు దాకా ఉండకుంటే ఎలా? అందుకే అంత్యక్రియలకూ ముందుంటాను.

ఆ ఆనందం వెలకట్టలేనిది..

వృద్ధాశ్రమం, అనాథాశ్రమం పేర్లతో మా ఆశ్రమాన్ని పిలవకూడదంటాం. ఎందుకంటే ఇదో సేవాశ్రమం. ఎవరైనా పిల్లలు పట్టించుకోకపోతే కొందరు మా దగ్గరకు వస్తారు. వెంటనే వాళ్ల పిల్లల దగ్గరకు వెళ్లి మాట్లాడి కౌన్సెలింగ్ ఇస్తాం. పేరెంట్స్‌ను చూసుకోవటం బాధ్యత అని చెబుతాం. కొందరు పిల్లలను దత్తత తీసుకుని చదివించాం. వాళ్లు ఇపుడు మంచి ఉద్యోగాలు చేస్తున్నారు. అనారోగ్యంతో బాధపడేవారినీ, మతిస్థిమితం లేని వాళ్లు ఎక్కడున్నా ఆశ్రమానికి తీసుకొచ్చి సేవలందిస్తాం. ఓ మాజీ ఎమ్మెల్యే కూతురు ఆశ్రమానికి వచ్చింది. ఆమె తండ్రి చనిపోయారు. ఆమె కొడుకూ చనిపోవటంతో.. మా ఆశ్రమం గురించి తెలుసుకుని వచ్చింది. ఫాతిమా అనే ఒకామె రోడ్డుమీద మాకు కనపడింది. కళ్లు కనపడవు. ఆశ్రమానికి తీసుకొచ్చి... కంటి శుక్లాల ఆపరేషన్ చేయించాం. కళ్లు తెరుస్తూనే నన్ను, మా కుటుంబాన్ని చూసింది. 'నిండు నూరేళ్లు బతకాలమ్మా' అంటూ దీవించింది. ఆమె కళ్లలోనే ఆనందాన్ని చూశాక.. ఈ జీవితానికి ఇదే కదా కావాల్సింది అనిపించింది. ఆ ఆనందం వెలకట్టలేనిది. మాటల్లో చెప్పలేను. ఇలాంటి ఆత్మానందాలు ఎన్నో పొందాను!



ఒకే కుటుంబంలా ఉంటాం..

ఆశ్రమంలో దాదాపు అన్ని సదుపాయాలూ ఉన్నాయి. శరీరం సహకరించని వారికి కూడా ఇక్కడ వసతులు ఉన్నాయి. ఎవరికైనా ఉచితంగా సేవ చేస్తాం. ఒక్క రూపాయి కూడా తీసుకోం. ముఖ్యంగా ఇక్కడ ఉండేవారిలో సంతోషం చూడాలన్నదే మా కోరిక. ఆశ్రమంలోని వారంతా ఒకే కుటుంబంలా ఉంటాం. కష్టాలైనా, నష్టాలైనా వీళ్లతోనే. ఒంటరిగా ఉన్నామనే ఫీలింగ్ ఎప్పుడూ కలగదు. నాకెలాంటి ఆశల్లేవు. నా భర్త అనుభవాలు గొప్పవి. చిన్నవయసులోనే సామాజిక సేవలోకి వచ్చారాయన. ఆయనే నా బలం. మా వారి అడుగుజాడల్లో నడుస్తున్నానంతే. మనిషిగా పుట్టి.. సాటి మనిషికి సాయపడకుంటే.. ఈ జీవితానికే అర్థం లేదంటాన్నేను. బడిలో మా సేవలు పొందిన కొందరు పిల్లలు ఫౌండేషన్‌లో వలంటీర్లుగా పని చేస్తున్నారు. ఎంతో మంది ఫౌండేషన్‌కు సహకారం అందిస్తున్నారు. విదేశాలనుంచీ ఆర్థిక సాయం అందుతోంది. నా జీవితం సామాజిక సేవకే అంకితం!"


• రాళ్లపల్లి రాజావలి



కడప జిల్లాలోని కలసపాడు మండంలోని తెల్లపాడు మా గ్రామం. ఇంటర్ చదివేప్పుడు మా ఊరిలో సారా కాసేవాళ్లు. ఆ సారా తాగిన వాళ్లు చనిపోయేవాళ్లు. స్నేహితులతో కలసి ఆ సారా బట్టీలను పగలగొట్టా. ఆ తర్వాత తాగేవాళ్లు, సారా కాచేవాళ్లు మా మీద దాడిచేశారు. అయినా సారాపై ఉద్యమం ఆపలేదు. మా ఊరిలోనే ఆపలేకపోతే.. మనం ఉండి ఉపయోగమేలేదని అనుకున్నాం. ఎంతో కష్టపడి సంపూర్ణ మద్యపాన నిషేదం చేశాం మా ఊళ్లో. కాలేజీ రోజుల్లోనే స్వామి వివేకానంద గురించి తెలుసుకున్నాక.. సమాజానికి సేవ చేయాలన్న ఆలోచన పుట్టింది. వివేకానంద ఫౌండేషన్‌లో ఇప్పటి వరకూ 3500 మంది విద్యార్థులకు బడి కిట్లు అందించాం. సుమారు 7000 మందికి కెరీర్ గైడెన్స్‌తో పాటు మోటివేషన్ క్లాసులు నిర్వహించాం. పిల్లలకు పెద్దబాలశిక్షలా బేసిక్స్ నేర్పించేందుకు 'విజ్ఞానదీపిక' పుస్తకాన్ని అచ్చువేశాం. కలామ్ జీవితం, సందేశాలను చెబుతూ 'కలామ్ సలామ్'.. వీటితో పాటు 'సేవాంజలి', 'కెరీర్ గైడెన్స్' పుస్తకాలు ప్రచురించాం. చలికాలంలో దుప్పట్లు, అన్నదానం, రక్తదానం.. ఇలా అనేక సహాయ కార్యక్రమాలు ప్రతి ఏడాది చేస్తాం. సేవను గుర్తించి డెబ్బయ్ అవార్డులు వచ్చాయి. అవార్డులకంటే సాటి మనిషికి సాయపడినప్పుడు.. వారిలో కలిగే ఆనందమే.. మాకు అసలైన అవార్డ్!

- పాపిజెన్ని రామకృష్ణా రెడ్డి
వివేకానంద సేవాశ్రమం, కడప జిలా

రాణీ ముఖర్జీ.. క్లాస్ యాక్టింగ్‌కు పెట్టింది పేరు. 'కుచ్ కుచ్ హోతా హై' నుంచి ఆమె నటనకు ప్రశంసలెన్నో.. అత్యధిక పారితోషికం తీసుకునే నటి.. అంతేనా బాలీవుడ్‌లో ఇప్పటికీ ఆమె ఇమేజ్ తగ్గలేదు. ఇటీవలే 'బిజినెస్ వరల్డ్' మ్యాగజైన్ 'మోస్ట్ ఇన్‌ఫ్లూయన్స్ ఉమెన్' పేరుతో ఓ సంచిక తెచ్చింది. ఇందులో రాణీ ముఖర్జీ కూడా ఉంది. ఈ సందర్భంగా బాలీవుడ్ రాణి గురించి కొన్ని విశేషాలు..




పవర్‌ఫుల్ రాణి

రాణీముఖర్జీ పేరు వినగానే 'కుచ్ కుచ్ హోతా హై', 'సాథియా', 'చల్తే చల్తే', 'హమ్ తుమ్' లాంటి చిత్రాలతో పాటు 'బ్లాక్', 'మర్దానీ', 'హిచ్కీ', 'మిసెస్ చటర్జీ వర్సెస్ నార్వే' లాంటి పవర్‌ఫుల్ పాత్రలూ గుర్తొస్తాయి. ఏకంగా ఎనిమిది ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్న నటి. ఇక మహిళా దర్శకుల విషయానికొస్తే.. మీరా నాయర్, జోయా అక్తర్.. లాంటి వారిని అభిమానిస్తుంది. ఎందుకంటే 'ఆ డైరక్టర్లలో మహిళను చూపించే విధానం నచ్చుతుంది' అంటుంది రాణీ ముఖర్జీ.

తను నన్ను అర్థం చేసుకుంటుంది...

రాణీ ముఖర్జీ వ్యక్తిగత జీవితాన్ని పబ్లిక్‌గా మాట్లాడదు. సోషల్ మీడియాలో ఉండదు. 'నా కూతురు ఫొటో, వ్యక్తిగత విషయాలు షేర్ చేయటానికి ఇష్టమే ఉండదు' అంటుంది. దీంతో ఆమె విషయాలు తెల్సుకోవటానికి ఆసక్తి చూపిస్తుంటారు అభిమానులు. కొందరు వీరాభిమానులు ఫేక్ అకౌంట్స్‌తో ఆమె విశేషాలు సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటారు. ఇకపోతే.. దర్శకుడు, నిర్మాత.. ఆదిత్య చోప్రాతో పెళ్లి.. ఆ తర్వాత కూతురు పుట్టడం వల్ల.. తక్కువగా సినిమాల్లో నటిస్తోంది. రాశి కంటే వాసికే ప్రాధాన్యత ఇస్తోంది.. 'నా కూతురు పరిణతితో ఆలోచిస్తుంది. నటిగా బిజీగా ఉన్నప్పుడు అర్థం చేసుకుంటుంది. ఆలస్యంగా వచ్చినా ఇబ్బంది పెట్టదు. తను క్యూట్ గాళ్' అంటుంది రాణీ. 'నా పేరెంట్స్‌తో పాటు బంధువులూ సినిమా నేపథ్యముంది. అయితే ఏనాడూ ఎవరిమీదా ఆధారపడలేదు. నా బ్లడ్‌లోనే భయం లేదు. కెరీర్, పెళ్లి.. ఇలా అనుకున్నట్లే జరిగాయి' అంటుందామె.



అందుకే మహిళా ప్రాధాన్యత...

'కథలు వింటుంటే.. ఆ పాత్ర పూర్తి చిత్రాన్నే నడిపిస్తుంది అనుకున్నప్పుడు ఇక ఏమాత్రమూ ఆలోచించను. ఒక్కమాటలో కథలే మనల్ని ఎంచుకుంటాయి అనిపిస్తుంది. కథే మాట్లాడాలి.. మనం కాదు. ఏదేమైనా సినిమా ప్రభావం సమాజం మీద ఉంటుంది. అందుకే పవర్‌ఫుల్ పాత్రల్లో నటించటానికి ఇష్టపడతా. కొందరు స్ఫూర్తిగా తీసుకుంటారు. ప్రేక్షకుల మైండ్ సెట్ మారుతుంది. ఈ కారణం వల్లనే మహిళా ప్రాధాన్యత చిత్రాల్లో నటిస్తా'నంటోందీమె. 'కథకూ.. పాత్రకూ సంబంధం ఉండాలి. లేకుంటే కష్టం. నేను నటించిన ఉమెన్ సెంట్రిక్ పాత్రలను ఆడియన్స్ యాక్సెప్ట్ చేశారు. నేను నటించిన చిత్రాల్లో 'మర్దానీ'లో పోలీస్ పాత్ర అంటే చాలా ఇష్టం. బేసిక్‌గా పురుషభావజాలం ఉండే సమాజమిది. నిజజీవితంలోని ఓ పోలీస్ ఆఫీసర్ కథ ఇది. మహిళగా ఆమె బలం, కెరీర్‌తో పాటు జీవితాన్ని బ్యాలెన్స్ చేసే విధానం, పట్టుదల.. విన్నాక ఆ పాత్ర చేయాలనిపించింది. కథ విన్నప్పుడే నటించేప్పుడు పాత్రను ఎంజాయ్ చేస్తూ నటించాను' అంటుంది రాణీ ముఖర్జీ. రాణీ ముఖర్జీ తనకు తాను సెల్ఫ్ మోటివేట్ పర్సన్ అని చెబుతుంది. 'ప్రశంసలు బావుంటాయి. అయితే పాజిటివ్ థింకింగ్, దేన్నీ పట్టించుకోని తత్వం, ధైర్యమే నన్ను నడిపిస్తున్నాయి' అంటుందామె. అందుకే రాణీ పవర్‌ఫుల్ మాత్రమే కాదు.. స్ఫూర్తిమంత్ర కూడా!

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
గురువారం • 21 మార్చి 2024
cinema@andhrajyothy.com



ఉత్తరాంధ్ర నేపథ్యంలో రామ్‌చరణ్, జాన్వీ కపూర్ భారీ చిత్రం

మెగాస్టార్ చిరంజీవి, శ్రీదేవి జంటగా దాదాపు 35 ఏళ్ల క్రితం వచ్చిన 'జగదేకవీరుడు- అతిలోకసుందరి' చిత్రానికి సీక్వెల్ తీయాలని, అందులో వారిద్దరి నటవారసులు రామ్‌చరణ్, జాన్వీ కపూర్ నటించాలన్నది ఎందరో అభిమానుల కల. అయితే ఆ సినిమాకు సీక్వెల్‌గా కాదుకానీ మరో రూపంలో వారి కోరిక నెరవేరుతోంది. రామ్‌చరణ్, జాన్వీ కపూర్ తొలిసారిగా కలసి నటించే చిత్రం షూటింగ్ బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. 'ఉప్పెన' చిత్రంతో విజయాన్ని అందుకున్న బుచ్చిబాబు సానా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థల సమర్పణలో వెంకట సతీశ్ కిలారు ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రామ్‌చరణ్, జాన్వీపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు బోనీ కపూర్ కెమెరా స్విచ్ఆన్ చేయగా, మెగాస్టార్ చిరంజీవి క్లాప్ ఇచ్చారు. దర్శకుడు శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. అల్లు అరవింద్ చేతుల మీదుగా చిత్ర యూనిట్ స్క్రిప్ట్ అందుకొంది. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ 'సుకుమార్‌గారి దగ్గర 'రంగస్థలం' చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాను. ఆ చిత్రహీరో రామ్‌చరణ్‌గారు నా మీద నమ్మకంతో ఈ అవకాశం ఇచ్చారు. నా రెండో సినిమాకే రెహమాన్‌గారు సంగీతం అందించడం ఆనందంగా ఉంది. ఉత్తరాంధ్ర నేపథ్యంలో జరిగే రూరల్, రా, రస్టిక్ ఎమోషనల్ జర్నీ ఈ సినిమా' అని చెప్పారు. రామ్‌చరణ్ మాట్లాడుతూ 'బుచ్చిబాబుకి సినిమా అంటే పిచ్చి. 'రంగస్థలం' నేరేషన్‌ను సుకుమార్‌గారు నాకు నలభై నిముషాలే ఇచ్చారు. అయితే అక్కడి నుంచి ప్రతి రోజూ రెండేసి గంటలు నేరేషన్ ఇచ్చింది మాత్రం బుచ్చిబాబే. సుకుమార్‌గారి దగ్గర ఉన్న టీమ్‌లో ఆయన బెస్ట్. నా కెరీర్‌లో ఇంత త్వరగా రెహమాన్‌గారితో కలసి పని చేస్తానని అనుకోలేదు. కచ్చితంగా అద్భుతమైన చిత్రాన్ని అందిస్తామనే నమ్మకం ఉంది' అన్నారు. తను అభిమానించే, ప్రేమించే ప్రముఖులందరూ ఇక్కడ ఉన్నందుకు జాన్వీ కపూర్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సినిమా చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఈ చిత్రానికి పాటలు: చంద్రబోస్, అనంత శ్రీరామ్, బాలాజీ, సంగీతం: ఎ.ఆర్.రెహమాన్, ఫొటోగ్రఫీ: రత్నవేలు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వి.వై. ప్రవీణ్‌కుమార్.

ఆ నమ్మకం నిజమైంది



'చాలా కొత్త అంశంతో, ఇంతవరకూ ఎవరూ టచ్ చేయని పాయింట్‌తో 'ఓం భీమ్ బుష్' చిత్రం రూపొందించా. చాలా సార్లు కొత్త పాయింట్ దొరికినప్పుడు ఒకటే జానర్‌కి ఫిక్స్ అవుతాం. అలా కాకుండా డిఫరెంట్‌గా ప్రజెంట్ చేస్తూ కంప్లీట్ ఎంటర్‌టైనింగ్‌గా చిత్రం ఉంటుంది. సినిమా చూస్తున్నంతసేపూ ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేస్తారు' అన్నారు హీరో శ్రీవిష్ణు. ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణతో కలసి ఆయన నటించిన 'ఓం భీమ్ బుష్' చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా శ్రీవిష్ణు మీడియాతో చిత్ర విశేషాలు పంచుకున్నారు.

- ఈ సినిమాకు రెండు, మూడు టైటిల్స్ అనుకున్నాం. అయితే నేను మొదటి నుంచి 'ఓం భీమ్ బుష్' చిత్రానికి ఓటు వేశాను. చాలా క్యాచీ టైటిల్ ఇది. నిర్మాత వంశీగారు ఫస్ట్ కట్ చూసి ఈ టైటిల్‌కే ఫిక్స్ అవుదాం.. అన్నారు. ఆ టైటిల్‌కు మంచి రెస్పాన్స్ రావడం ఆనందంగా ఉంది. సినిమాలో మిస్టరీ, థ్రిల్, ఎంటర్‌టైన్‌మెంట్ అన్నీ ఉన్నాయి. నేను, ప్రియదర్శి, రాహుల్ మంచి స్నేహితులం. రెగ్యులర్‌గా కలుస్తుంటాం. అందుకే ఆడుతూ పాడుతూ సినిమా పూర్తి చేశాం.
- ప్రేక్షకులు కూడా ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు మరో అంశం కూడా బాగుందని అంటారు. అదేమిటో సినిమా చూశాక తెలుస్తుంది.
- నిర్మాత పెట్టిన పెట్టుబడి తిరిగి రావాలన్నదే ఎప్పుడూ నా ఆలోచన. ఈ సినిమా మీద పెట్టిన పెట్టుబడికి మూడు, నాలుగు రెట్లు లాభం రావడం చాలా తృప్తినిచ్చింది. 'సామజవరగమన' చిత్ర విజయం, ఈ సినిమా టీజర్, ట్రైలర్, యూవీ బేనర్ ఈ సినిమాకు బాగా హెల్ప్ అయ్యాయి. మంచి బేనర్‌లో సినిమాలు చేయడం వల్ల అన్ని విషయాల్లో వారే కేర్ తీసుకుంటారు కనుక నా ఒత్తిడి తగ్గింది.
- దర్శకుడు శ్రీహర్ష చెప్పిన కథకు కొంచెం కలర్‌ఫుల్‌గా వెళితే బావుంటుందనిపించింది. డీవోపీ రాజ్ తోటతో ఆరు సినిమాలు చేశాను. వాళ్లిద్దరికీ మంచి సింక్ ఉంది. అలాగే సన్నీ సంగీతం అంటే నాకు ఇష్టం. ఒక అద్భుతమైన ప్రొడక్షన్ హౌస్‌కి మంచి టీమ్ కుదిరితే సినిమా టెక్నికల్‌గా బాగుంటుదనే నమ్మకం ఈ సినిమా విషయంలో మరోసారి నిజమైంది.

చిత్రసీమలో ఇప్పుడు బయోపిక్‌ల ట్రెండ్ నడుస్తోంది. అసామాన్య విజయాలు సాధించిన సామాన్యుల గాథల నుంచి క్రీడా, రాజకీయ దురంధరుల బయోపిక్‌లు తెరకెక్కించడం ఇప్పుడు ట్రెండ్‌గా మారింది. ఇవన్నీ ఒకెత్తయితే సినీ రంగానికే చెందిన పలువురు ప్రముఖుల జీవితాలను వెండితెరపైకి తేవడం కొంతకాలంగా జరుగుతోంది. తెలుగులో నటి సావిత్రి జీవితం ఆధారంగా వచ్చిన 'మహానటి' ఏ స్థాయి విజయాన్ని అందుకొందో చూశాం. ఆ కోవలోనే ఇప్పుడు పలువురు సినీ తారల జీవితాలు ప్రేక్షకుల ముందుకొస్తున్నాయి.

తారల కథలు తెరపైకి







ట్రాజెడీ క్వీన్ బయోపిక్

తనదైన అందం, అభినయంతో కథానాయికగా ఒక తరం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు మీనాకుమారి. కథానాయికగానే కాదు, తన సుమధుర గానంతోనూ మెప్పించారు. కవయిత్రిగానూ రాణించారు. ఆమెను బాలీవుడ్ ట్రాజెడీ క్వీన్‌గా విశ్లేషకులు వర్ణిస్తారు. బాలనటిగా పరిశ్రమలోకి అడుగుపెట్టి దాదాపు 90కు పైగా సినిమాల్లో ఆమె నటించారు. 'పాకీజా, సాహిబ్ బీబీ ఔర్ గులాం, మేరే అప్నే' లాంటి ఎన్నో చిత్రాలు క్లాసిక్స్‌గా విగిలాయి. 1972లో ఆమె చనిపోయారు. ఇప్పుడు బాలీవుడ్‌లో ఆమె బయోపిక్ తెరకెక్కుతోంది. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. స్క్రిప్ట్ దశలో ఆయన చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మీనాకుమారి కుటుంబ సభ్యులను కలసి ఆమె జీవిత విశేషాలను సేకరించారు. అయితే ఈ చిత్రంలో నటించే కథానాయిక ఎవరనేది ఇంకా ఖరారు కాలేదు. కృతీసనన్ టైటిల్ రోల్ పోషిస్తున్నట్లు కొన్నాళ్లుగా బాలీవుడ్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. కృతీ కూడా మీనాకుమారి పాత్రను పోషించేందుకు ఆసక్తిగా ఉన్నారనీ, ఇప్పటికే తను ఆ పాత్ర కోసం సన్నద్ధమవుతున్నారని తెలుస్తోంది. అయితే అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.







మధుబాలగా మెప్పించేదెవరు?

ఆ కాలంలో భారతీయ సినీ చరిత్రలోనే అత్యధిక పారితోషికం అందుకొన్న కథానాయికగా ఖ్యాతి గడించారు మధుబాల. రెండు దశాబ్దాల కెరీర్‌లో 1969లో తను కన్నుమూసేనాటికి 60కు పైగా చిత్రాల్లో నటించారు. 'నీల్‌కమల్, అమర్, మహల్, బర్సాత్ కీ రాత్' ఆమె నటించిన చిత్రాల్లో కొన్ని. చారిత్రక నేపథ్యంలో తెరకెక్కిన 'మొఘల్ ఈ ఆజమ్' చిత్రంలో అనార్కలి పాత్ర ఆమె నటనలో కలికితురాయిగా నిలిచిపోయింది. త్వరలోనే ఆమె జీవితకథ వెండితెరపైకి వస్తోంది. 'డార్లింగ్స్' చిత్రానికి దర్శకత్వం వహించిన జస్మీత్ కే రీన్ మెగాఫోన్ చేపట్టనున్నట్లు స్వయంగా ప్రకటించారు. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్మిస్తోంది. మీనాకుమారి పాత్ర ఎవర్ని వరించనుంది అనేది ప్రస్తుతానికి సస్పెన్స్. అలియాభట్, మాధురీ దీక్షిత్, కంగనా రనౌత్‌లో ఒకరికి దక్కే అవకాశముందని బాలీవుడ్ వర్గాల సమాచారం.

ఇద్దరు నాయికలతో

ప్రముఖ బాలీవుడ్ నృత్య దర్శకులు దివంగత సరోజ్‌ఖాన్ బయోపిక్‌కు గతేడాది చివరలో సన్నాహాలు మొదలయ్యాయి. పలు బాలీవుడ్ హిట్ చిత్రాలకు ఆమె కొరియోగ్రాఫర్‌గా పనిచేశారు. ఎంతోమంది నృత్యదర్శకులను బాలీవుడ్‌కు అందించారు. టీ సిరీస్ భూషణ్‌కుమార్ నిర్మిస్తున్న ఈ బయోపిక్‌కు హన్సల్ మెహతా దర్శకత్వం వహిస్తున్నారు. ప్రసుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. ఇద్దరు నాయికలు నటిస్తారు' అని హన్సల్ మెహతా చెప్పారు. మాధురీ దీక్షిత్ సరోజ్‌ఖాన్ పాత్రను పోషించనున్నట్లు తెలిసింది. మాధురీ నటించిన పలు హిట్ గీతాలకు సరోజ్‌ఖాన్ నృత్యరీతులు సమకూర్చారు.



మరోసారి తెరపైకి

టాలీవుడ్‌లోనూ కొందరు సినీ ప్రముఖల జీవితం ఆధారంగా సినిమాలు తెరకెక్కుతున్నాయి. సిల్క్ స్మిత జీవితం ఆధారంగా 2011లో బాలీవుడ్‌లో వచ్చిన 'డర్టీ పిక్చర్' ఘన విజయం అందుకొంది. విద్యాబాలన్ టైటిల్ రోల్ పోషించిన ఈ చిత్రం దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకొంది. ఇప్పుడు మరోసారి ఆమె జీవిత కథ వెండితెరపైకి వస్తోంది. 80, 90 దశకాల్లో ప్రత్యేక గీతాల్లో ప్రేక్షకులను అలరించారు స్మిత. ప్రతి సినిమాలోనూ ఆమె ప్రత్యేకగీతం ఉండి తీరాలనే పరిస్థితి అప్పట్లో ఉండేది. తెలుగుతో పాటు పలు భాషల్లో 400 వరకూ చిత్రాల్లో నటించారు. 1996లో ఆమె ఆత్మహత్య చేసుకొన్నారు. సిల్క్ మరణం ఇప్పటికీ మిస్టరీనే. 'సిల్క్ స్మిత - ది అన్‌టోల్డ్ స్టోరీ' పేరుతో రూపొందనున్న ఈ చిత్రానికి జయరాం శంకరన్ దర్శకత్వం వహిస్తున్నారు. సిల్క్ స్మిత గురించి ఎవరూ చెప్పని విషయాలను ఈ సినిమా ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని తెలిపారు. ధనంజయన్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో చంద్రిక రవి టైటిల్ రోల్ పోషిస్తున్నారు.

కథానాయికగా తెలుగుదనం ఉట్టిపడే పాత్రలతో సౌందర్య ఇంటిల్లిపాదికి గుర్తుండిపోయారు. ప్రతిభావంతురాలైన నటిగా పేరు తెచ్చుకున్నారు. ఎక్స్‌పోజింగ్‌కు దూరంగా ఉండేవారు. 'అమ్మోరు, రాజా, జయం మనదేరా, అంతఃపురం' లాంటి సినిమాల్లో ఆమె నటనకు మంచి పేరొచ్చింది. 2004లో బెంగళూరులో జరిగిన విమాన ప్రమాదంలో సౌందర్య మరణించారు. ఆమె బయెపిక్‌ను తెరకెక్కిస్తున్నట్లు మూడేళ్ల క్రితం పరిశ్రమలో వార్తలు వచ్చాయి. అయితే అవేవీ నిజం కాలేదు. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో కథానాయిక రష్మిక మందన్న మాట్లాడుతూ "నువ్వు సౌందర్య గారిలా ఉన్నావు' అని చాలా మంది అన్నారు. ఆమె నటన, వ్యక్తిత్వం నాకు చాలా ఇష్టం. ఎవరైనా ఆమె బయోపిక్‌ను తెరకెక్కిస్తే సౌందర్య పాత్రను పోషించాల్సి ఉంది' అని మనసులో మాట బయటపెట్టారు. స్టార్ హీరోయిన్ కోరిక కాబట్టి రష్మిక డేట్స్ ఇస్తే సౌందర్య బయోపిక్‌ను నిర్మించడానికి ఏ నిర్మాతైనా ముందుకు రాకపోతాడా వేచి చూడాలి.





యాగంటిలో శ్రీవల్లి

నటి రష్మికా మందన్నా ప్రస్తుతం పుష్ప-2లో నటిస్తోంది. సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాగంటిలో జరుగుతోంది. బుధవారం ఈ చిత్రం షూటింగ్ గురించి రష్మికా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో తెలిపారు. "ఈ గుడి ఎంతో పురాతనమైనది. ఈ రోజు షూటింగ్ అద్భుతంగా సాగింది. ఈ ప్రదేశం..ఇక్కడి ప్రజలు..వారి ఆదరాభిమానాలు మరిచిపోలేని విధంగా ఉన్నాయి. ఈ గుడిలో సమయం గడపటం ఎంతో ప్రశాంతతను, సంతోషాన్ని ఇచ్చింది" అని పోస్ట్ చేశారు. మరోవైపు ఈ చిత్రం షూటింగ్ నుంచి లీకైన రష్మికా ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

రెమ్యూనరేషన్ రెట్టింపు?

'డాన్ 3' చిత్రంలో రణ్‌వీర్‌సింగ్ సరసన కియారా అద్వాణీ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు బాలీవుడ్‌లో బాగా డిమాండ్ ఉన్న కథానాయికల్లో ఆమె ఒకరు. ఈ సినిమా కోసం కియారా ఏకంగా రూ. 13 కోట్లు పారితోషికంగా తీసుకుంటున్నట్లు బీ టౌన్ టాక్. ఇప్పటివరకూ కియారా అందుకున్న అత్యధిక పారితోషికం కూడా ఇదే నట. అంతేకాదు హృతిక్ రోషన్, ఎన్టీఆర్ నటిస్తున్న మల్టీ స్టారర్ చిత్రంలోనూ ఆమె కథానాయికగా నటిస్తున్నారు. అయితే ఆ సినిమాకు మాత్రం ఆమె రూ. 6 కోట్లు తీసుకుంటున్నారట. ఆ చొప్పున 'డాన్ 3' కు ఆమె రెట్టింపు పారితోషికం అందుకుంటున్నట్లే లెక్క. ఈ చిత్రంలో ఇప్పటి వరకూ కనిపించని కొత్త తరహా పాత్రలో కనిపించబోతున్నట్లు కియారా గతంలో చెప్పారు.



కన్నప్ప కామిక్ బుక్



విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' రెండో షెడ్యూల్ ఇటీవల పూర్తయింది. త్వరలో మరో షెడ్యూల్ ప్రారంభించనున్నారు. ఈ చిత్ర నిర్మాత, విలక్షణ నటుడు డాక్టర్ మోహన్‌బాబు పుట్టిన రోజు సందర్భంగా ఇటీవల 'కన్నప్ప కామిక్ బుక్‌ను విడుదల చేశారు. భక్త కన్నప్ప పురాణ కథను కామిక్ రూపంలో వివరించే పుస్తకమిది. 'నేను చదివిన అత్యంత ఉత్తేజకరమైన కథను ప్రపంచానికి తెలియజేయాలన్నది నా కల. యువత ఈ కథను, చరిత్రను తెలుసుకోవాలి. అందుకే .ఈ పుస్తకం' అన్నారు. మంగళవారం జరిగిన మోహన్‌బాబు పుట్టినరోజు వేడుకలకు మలయాళ నటుడు మోహన్‌లాల్, ముఖేశ్ రిషి హాజరయ్యారు.

ఇళయరాజా భక్తుడిని



'ఇసైజ్ఞాని' ఇళయరాజాకు తను పరమభక్తుడనని తమిళ హీరో ధనుష్ అన్నారు. ఇళయరాజా జీవిత చరిత్ర ఆధారంగా రూపుదిద్దుకుంటున్న చిత్రంలో ఆయన హీరో. అరుణ్ మాధేశ్వరన్ దర్శకుడు. ఈ చిత్రం షూటింగ్ బుధవారం చెన్నైలో మొదలైంది. తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో రూపుదిద్దుకోనుంది. ఈ కార్యక్రమంలో విశ్వనటుడు కమల్‌హాసన్ పాల్గొని మూవీ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ చిత్రం కేవలం ఐదు భాషల్లోనే కాకుండా, భారతదేశంలోని భాషలన్నింటిలో విడుదలకావాలి. ఇది ఇళయరాజా స్టోరీ కాదు.. 'భారతరత్న' జీవిత కథ'. ఈ పాత్రకు ధనుష్ న్యాయం చేస్తారని భావిస్తున్నా' అని పేర్కొన్నారు. చిత్ర కథానాయకుడు ధనుష్ మాట్లాడుతూ 'చిత్రపరిశ్రమలో సూపర్‌స్టార్ రజినీకాంత్, ఇళయరాజా అంటే నాకు అమితమైన అభిమానం. వాళ్లిద్దరి బయోపిక్స్‌లో నటించాలన్నది నా లక్ష్యం. వాటిల్లో ఒకటి నెరవేరింది. ఇళయరాజాకు నేనొక భక్తుడిని. నటనలో ఆయన సంగీతమే నాకు గురువు.' అన్నారు. ఈ సినిమాను కనెక్ట్ మీడియా, పీకే ప్రైమ్ ప్రొడక్షన్, మెర్క్యూరి మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. - చెన్నై (ఆంధ్రజ్యోతి)


కొత్తగా...

మంచి సబ్జెక్ట్‌తో...



అరుణ్ ఆదిత్య, అప్సర రాణి హీరోహీరోయిన్లుగా ఓ నూతన చిత్రం తెరకెక్కుతోంది. కృష్ణబాబు దర్శకత్వం వహిస్తున్నారు. సీనియర్ నటి లక్ష్మీ , బేబీ వినూత, ఉదయ్ భాను కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వినూత్న సెల్యూలాయిడ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై నల్లా శ్రీదేవి నిర్మిస్తున్నారు. బుధవారం ఈ చిత్రాన్ని ప్రారంభించారు. డైరెక్టర్ వి. సముద్ర తొలిషాట్‌కు గౌరవ దర్శకత్వం వహించగా, ప్రముఖ రైటర్ పరుచూరి గోపాలకృష్ణ హీరోయిన్‌పై క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కృష్ణబాబు మాట్లాడుతూ "మంచి సబ్జెక్ట్‌తో తెరకెకుతున్న ఈ చిత్రం షూటింగ్‌ను త్వరలోనే పూర్తి చేసి మీ ముందుకు తెస్తాం. ఈ చిత్రం మీ అందరినీ తప్పక అలరిస్తుంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర బృందం, తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ చిత్రానికి డీఓపీ: ఆర్ భాస్కర్, సంగీతం: యం.యం శ్రీలేఖ, సహ నిర్మాత: చైతన్య కిరణ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: వెంకటేష్, ఖుషి

క్రిస్పీ సస్పెన్స్ థ్రిల్లర్‌గా...



యస్వంత్, సాయితేజ, అరుషి, నిఖిల హీరోహీరోయిన్లుగా ఓ నూతన చిత్రంలో నటిస్తున్నారు. ఊర శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్నారు. కారుణ్య శ్రేయాన్స్ ఫిల్మ్స్ బ్యానర్‌పై పోతురాజు నర్సింహారావు, కందిమల్ల సాయితేజ నిర్మిస్తున్నారు. బుధవారం ఈ చిత్రాన్ని ప్రారంభించారు. కంది రామచంద్రారెడ్డి గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ క్లాప్ కొట్టారు, రచయిత బిక్కి కృష్ణ స్విచ్ ఆన్ చేశారు. నిర్మాత పోతురాజు నర్సింహారావు మాట్లాడుతూ "కొత్త తరం నటులను ప్రోత్సహించండి" అని కోరారు. డైరెక్టర్ ఊర శ్రీనివాస్ మాట్లాడుతూ "క్రిస్పీ సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం" అని అన్నారు. హీరోహీరోయిన్లు మాట్లాడుతూ "ఇది యువతరాన్ని విశేషంగా ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.

'నీ దారే నీ కథ'

ఇన్‌ప్రోగ్రెస్



వంశీ జొన్నలగడ్డ స్వీయ దర్శకత్వంలో నూతన నటీనటులతో నిర్మిస్తున్న చిత్రం 'నీ దారే నీ కథ'. మ్యూజికల్ బ్యాక్ డ్రాప్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో ప్రియతమ్ మంతిని, విజయ విక్రాంత్, అనంత పద్మసోల, వేద్, అంజన బాలాజీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సురేశ్, అజయ్, కల్యాణీ నటరాజన్ ముఖ్య పాత్రలు పోషించారు. వంశీ జొన్నలగడ్డ, తేజేష్ వీర, శైలజ జొన్నలగడ్డ నిర్మించారు. బుధవారం ఈ చిత్రం టీజర్‌ను సీనియర్ జర్నలిస్టులు ప్రభు, లక్ష్మీనారాయణ, సురేశ్‌లాంచ్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు వంశీ జొన్నలగడ్డ మాట్లాడుతూ "ఎంతోమంది సింక్ సౌండ్ రిస్క్ అంటున్నా.. సింక్ సౌండ్ పద్ధతితోనే హాలీవుడ్ స్టాండర్డ్స్‌కి ఏ మాత్రం తగ్గకుండా చిత్రీకరించాం. ఇందులో కథతో పాటూ సాగే మ్యూజిక్ ఒక మంచి సినిమాటిక్ ఫీల్‌ను అందిస్తుంది. అనుకున్నది సాధించడం కోసం నలుగురు యువకులు చేసే ప్రయత్నాల్ని అందర్నీ ఆకట్టుకునేలా, ఎంతో ఆసక్తికరంగా మలిచాం" అని చెప్పారు. నిర్మాత తేజేష్ మాట్లాడుతూ "ఇది మా మొదటి సినిమా అయినా ఎక్కడా కాంప్రమైజ్ అవ్వకుండా చాలా కొత్తగా మీ ముందుకు తీసుకొస్తున్నాం" అని అన్నారు. నిర్మాత శైలజ జొన్నలగడ్డ మాట్లాడుతూ "సినిమా మీద ఉన్న ప్యాషన్‌తో ఈ చిత్రాన్ని నిర్మించాం. మంచి టెక్నికల్ వాల్యూస్‌తో మ్యూజిక్ బ్యాక్ డ్రాప్‌తో యువతను ఆకట్టుకునే విధంగా ఈ సినిమా ఉంటుంది. బుడాపెస్ట్ లో చేసిన మ్యూజిక్ ఆర్కెస్ట్రా థీమ్ సినిమాకి హైలైట్‌గా నిలుస్తుంది" అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: విపిన్ సామ్యూల్, సంగీతం: ఆల్బర్టో గురియోలి.

రూ.5,000 కోట్లతో గుజరాత్‌లో రెండో యూనిట్

వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 3 లక్షల యూనిట్లకు పెంపు.. జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా

ముంబై: రూ.5,000 కోట్ల పెట్టుబడితో వాహన ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోనున్నట్లు జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా బుధవారం ప్రకటించింది. అలాగే, ఈ సెప్టెంబరు నుంచి ప్రతి 3-6 నెలలకు ఒక కొత్త మోడల్ కారును మార్కెట్లోకి ప్రవేశపెట్టనున్నట్లు తెలిపింది. చైనాకు చెందిన అతి పెద్ద వాహన తయారీ సంస్థ ఎస్‌ఏఐసీ, భారత వ్యాపార దిగ్గజాల్లో ఒకటైన జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఉమ్మడి భాగస్వామ్యంలో (జేవీ) కొత్తగా ఏర్పాటైన కంపెనీయే జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా. సంప్రదాయ ఇంధన కార్ల విభాగంలో మారుతి తరహాలోనే ఈవీల విభాగంలో ఈ జేవీని అగ్రగామిగా తీర్చిదిద్దాలని అనుకుంటున్నట్లు జేవీ ప్రారంభంతోపాటు కొత్త లోగో ఆవిష్కరణ సభలో మాట్లాడుతూ జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ తెలిపారు.

గత ఏడాది నవంబరులో ఎస్‌ఏఐసీ, జేఎస్‌డబ్ల్యూ మధ్య కుదిరిన ఒప్పందం మేరకు కొత్తగా ఏర్పాటైన జేవీలో జేఎస్‌డబ్ల్యూ 35 శాతం, ఇండియన్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ (ఐఎఫ్ఐ) 8 శాతం వాటాలు కలిగి ఉంటే, ఎంజీ మోటార్ డీలర్లు 3 శాతం, ఉద్యోగులు 5 శాతం వాటా కలిగి ఉంటారు. మిగతా 49 శాతం వాటా ఎస్‌ఏఐసీ చేతుల్లో ఉండనుంది. తద్వారా కంపెనీలో మెజారిటీ వాటా భారత సంస్థలు, వ్యక్తుల చేతుల్లోనే ఉంటుంది. బ్రిటిష్ కార్ల బ్రాండ్ ఎంజీ మోటార్‌ను ఎస్‌ఏఐసీ గతంలో కొనుగోలు చేసింది. 2019లో భారత్‌లోకి ప్రవేశించిన ఎంజీ మోటార్ ఇండియా.. దేశంలో కార్ల తయారీ ప్లాంట్ ఏర్పాటు కోసం రూ.7,000 కోట్ల పెట్టుబడులు పెట్టింది. ఇప్పటివరకు దాదాపు 2 లక్షల కార్లను విక్రయించింది.

2030 నాటికి 10 లక్షల ఈవీల విక్రయ లక్ష్యం

2030 నాటికి ప్యాసింజర్ ఎలక్ట్రిక్ వాహనాల వార్షిక విక్రయాలను 10 లక్షల యూనిట్లకు పెంచుకోవాలని ఈ జేవీ లక్ష్యంగా పెట్టుకుంది. అప్పటికల్లా దేశంలో ఈవీల వార్షిక విక్రయాలు కోటి యూనిట్లకు చేరుకోవచ్చని అంచనా. ఉత్పత్తి విస్తరణ కోసం గుజరాత్‌లోని హలోల్ వద్దనున్న ప్రస్తుత ప్లాంట్‌కు సమీపంలోనే రెండో ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఎంజీ మోటార్ ఇండియా గౌరవ్ చైర్మన్ రాజీవ్ చాబా తెలిపారు. తద్వారా కంపెనీ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం లక్షకు పైగా యూనిట్ల నుంచి 3 లక్షలకు పైకి చేరుకోనుందన్నారు. ఉత్పత్తి పెంపుతోపాటు కొత్త మోడళ్లను అందుబాటులోకి తెచ్చేందుకు వాటాదారులందరూ కలిసి రూ.5,000 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టనున్నట్లు ఆయన చెప్పారు. కొత్త మోడల్ కార్లను అభివృద్ధి చెందిన దేశాలకూ ఎగుమతి చేయనున్నట్లు సజ్జన్ జిందాల్ తెలిపారు.

ఒడిశాలో జేఎస్‌డబ్ల్యూ వాణిజ్య ఈవీ, బ్యాటరీల తయారీ ప్లాంట్

రూ.40,000 కోట్ల పెట్టుబడులతో ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రిక్ వెహికిల్ అండ్ ఈవీ బ్యాటరీ మాన్యుఫాక్చరింగ్ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేసేందుకు గతనెల జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఒడిశా ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. అయితే, ఒడిశాలో ఏర్పాటు చేయబోయే ప్రాజెక్ట్‌కు ఈ జేవీతో సంబంధం లేదని జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ స్పష్టం చేసింది. ఒడిశాలో వాణిజ్య ఈవీల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ఒకవేళ అవసరమైతే, భవిష్యత్‌లో ఈ జేవీ ఉత్పత్తి అవసరాలను కూడా తీర్చనుందన్నారు. అయినప్పటికీ, ఈ జేవీకి అవసరమైన బ్యాటరీ ప్యాక్‌లను మాత్రం ఈ ప్లాంట్ నుంచే సరఫరా చేయనున్నట్లు జిందాల్ తెలిపారు.

లిథియం మైనింగ్‌లోకి జేఎస్‌డబ్ల్యూ

క్లిష్టమైన ఖనిజాలు, ముఖ్యంగా ఈవీ బ్యాటరీల తయారీకి అత్యంత కీలకమైన లిథియం మైనింగ్‌లోకి ప్రవేశించాలని జేఎస్‌డబ్ల్యూ చూస్తోంది. లిథియం గనుల వేలంలో తామూ పాల్గొంటామని సజ్జన్ జిందాల్ తెలిపారు.



ఎంజీ సైబర్‌స్టర్ ఆవిష్కరణ

పూర్తి ఎలక్ట్రిక్ కన్వర్టబుల్ రోడ్‌స్టర్ మోడల్ కారు ఎంజీ సైబర్‌స్టర్‌ను కంపెనీ ఆవిష్కరించింది. ఈ కారు కేవలం 3.2 సెకండ్లలో సున్నా నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలదని, సింగిల్ చార్జింగ్‌లో 580 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదని జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ వెల్లడించింది. ఈ ఏడాది ద్వితీయార్ధానికల్లా అంతర్జాతీయ మార్కెట్లో విడుదల చేసే అవకాశం ఉంది. ధర రూ.53 లక్షల స్థాయిలో ఉండవచ్చని అంచనా. అలాగే, ఎంజీ 4 ఈవీ హ్యాచ్‌బ్యాక్, ఎంజీ 5 మోడళ్లను సైతం కంపెనీ ప్రదర్శించింది.

ఈ ఏడాది 3 సార్లు వడ్డీ కోత

» అమెరికన్ ఫెడరల్ సంకేతం

వాషింగ్టన్: ఊహించిన విధంగానే అమెరికన్ ఫెడరల్ వడ్డీరేట్లు యథాతథంగా కొనసాగించింది. దీంతో వడ్డీరేటు 5.25-5.5 శాతం వద్ద స్థిరంగా ఉంటుంది. ఫెడ్ చీఫ్ జెరోం పోవెల్ అధ్యక్షతన రెండు రోజుల పాటు జరిగిన సమావేశం ఈ మేరకు తీర్మానించింది. అయితే ఈ సంవత్సరం డిసెంబరులోపు మూడు సార్లు పావు శాతం చొప్పున వడ్డీ రేట్లు తగ్గించే అవకాశం ఉందని సూచనప్రాయంగా తెలిపింది. అదే జరిగితే 2020 మార్చి తర్వాత వడ్డీరేట్లు తగ్గించడం ఇదే మొదటిసారి అవుతుంది. గత ఏడాది జూలై నుంచి ఫెడ్ రిజర్వు వడ్డీరేట్లు యథాతథంగా కొనసాగిస్తోంది. డిసెంబరు లోపు మూడు సార్లు ముప్పావు శాతం వడ్డీరేట్లు తగ్గిస్తామన్న ఫెడ్ రిజర్వు పరోక్ష సూచన ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లకు పెద్ద సానుకూల అంశం అవుతుందని భావిస్తున్నారు.

'బయోలాజికల్-ఇ'కి ఓసీవీ-ఎస్ టెక్నాలజీ బదిలీ

హైదరాబాద్: బయోలాజికల్-ఇ కంపెనీకి సింప్లిఫైడ్ ఓరల్ కలరా వ్యాక్సిన్ (ఓసీవీ-ఎస్) టెక్నాలజీ బదిలీని ప్రారంభించినట్టు ఇంటర్నేషనల్ వ్యాక్సిన్ ఇన్‌స్టిట్యూట్ (ఐవీఐ) ప్రకటించింది. టెక్నాలజీ బదిలీకి సంబంధించి ఎంఓయూపై ఉభయ సంస్థల మధ్య గత నవంబరులో సంతకాలు జరిగాయి. ఇందులో భాగంగా బీఈ ప్లాంట్లలో ఓసీవీ-ఎస్ తయారీ పరిజ్ఞానాన్ని ఐవీఐ అందిస్తుంది. అలాగే క్లినికల్ డెవలప్‌మెంట్, రెగ్యులేటరీ అనుమతులకు కూడా సహాయపడుతుంది. ఓసీవీ-ఎస్ వ్యాక్సిన్‌ను దేశీయ, అంతర్జాతీయ మార్కెట్ల కోసం బీఈ ఉత్పత్తి చేస్తుంది. 2025 నాటికి టెక్నాలజీ బదిలీ పూర్తవుతుంది.

అంతర్జాతీయ సవాళ్లకు దేశీయ పరిష్కారాలు

» స్టార్టప్‌లకు ప్రధాని మోదీ పిలుపు



న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) టెక్నాలజీలో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలుస్తుందని ప్రధాని మోదీ అన్నారు. ఈ అవకాశాన్ని జార విడుచుకోవద్దని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లను కోరారు. ఏఐ టెక్నాలజీకి సంబంధించిన నాయకత్వం భారతీయుల చేతుల్లోనే ఉండాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలు ఎదుర్కొంటున్న సవాళ్లకు ఏఐ సాయంతో మనవైన దేశీయ పరిష్కారాలు వెతకాలని ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లను ప్రధాని కోరారు. ఢిల్లీలో జరుగుతున్న 'స్టార్టప్స్ మహాకుంభ్' సదస్సులో ఆయన ఈ విజ్ఞప్తి చేశారు. తమ ప్రభుత్వం ప్రారంభించిన ఇండియా ఏఐ మిషన్, సెమీకండక్టర్ విషన్, క్వాంటమ్ మిషన్లు యువకులకు ఉద్యోగ అవకాశాలతో పాటు, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు పెట్టుబడి అవకాశాలు కల్పిస్తాయని అన్నారు.

సెన్సెక్స్ 90 పాయింట్లు అప్

ముంబై: మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు ఐటీసీ, ఎస్‌బీఐ వంటి ప్రముఖ షేర్లలో కొనుగోళ్లతో బుధవారం సూచీలు స్వల్ప లాభాల్లో ముగిశాయి. ఇంట్రాడేలో 390 పాయింట్ల మేర ఎగబాకిన సెన్సెక్స్.. చివరికి 89.64 పాయింట్ల లాభంతో 72,101.69 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 21.65 పాయింట్ల పెరుగుదలతో 21,839.10 వద్ద క్లోజైంది. గ్లోబల్ మార్కెట్ల సానుకూల సంకేతాలతోపాటు ప్రత్యక్ష పన్నుల ఆదాయ గణాంకాలు ఆశాజనకంగా ఉండటం మార్కెట్ రికవరీకి దోహదపడగా.. రూపాయి క్షీణత, చిన్న షేర్లలో అమ్మకాల ఒత్తిడి లాభాలను పరిమితం చేశాయి.

2 నెలల కనిష్ఠానికి రూపాయి

భారత కరెన్సీ విలువ రెండు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 16 పైసలు తగ్గి రూ.83.19 వద్ద ముగిసింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	66,340 ▲	60,810 ▲	80,000 ▼
ముంబై	65,690 ▲	60,170 ▲	73,890 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

20వ తేదీ	
హైదరాబాద్	415
21వ తేదీ	
చిత్తూరు	478
గోదావరి	425
విజయవాడ	425
విశాఖపట్నం	435
వరంగల్	417

డజను గుడ్లు రూ.72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	106
వరంగల్	106
కరీంనగర్	106
మహబూబ్‌నగర్	106
కర్నూలు	106
విశాఖపట్నం	100
గోదావరి	106
విజయవాడ	106
గుంటూరు	107
ఒంగోలు	107
చిత్తూరు	92

ఆర్థిక మంత్రితో ఆర్‌బీఐ, సెబీ చీఫ్‌ల భేటీ



న్యూఢిల్లీ: ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్, సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ బుధవారం విడివిడిగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. శక్తికాంత దాస్ అధ్యక్షతన ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) వచ్చే నెల 3-5 తేదీల్లో సమావేశమవుతోంది. కనీసం ఈ భేటీలో అయినా రెపో రేటు ప్రస్తుత 6.5 శాతం నుంచి అర శాతమైనా తగ్గించాలని పారిశ్రామిక వర్గాలు కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ గవర్నర్ కేంద్ర ఆర్థిక మంత్రితో సమావేశం కావడం విశేషం. మార్చి 7న ఆల్ టైమ్ హైకి చేరిన సెన్సెక్స్, నిఫ్టీ గత కొద్ది రోజులుగా తీవ్ర ఆటుపోట్లకు లోనవుతున్నాయి. సెబీ హెచ్చరికతో స్మాల్ అండ్ మిడ్ క్యాప్ షేర్లూ తీవ్ర ఆటుపోట్లకు లోనవుతున్నాయి. ఈ నేపథ్యంలో సెబీ చీఫ్ నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు.

ఐఎల్ అండ్ ఎఫ్ఎస్‌పై చర్యలు వద్దు: ఎన్‌సీఎల్ఏటీ

న్యూఢిల్లీ: పీకల్లోతు అప్పుల్లో ఉన్న ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కంపెనీ, దాని అనుబంధ సంస్థలకు ఎన్‌సీఎల్ఏటీలో పెద్ద ఊరట లభించింది. తదుపరి విచారణ జరిగే మే 14 వరకు ఈ సంస్థలపైనా, వాటి డైరెక్టర్లపైనా ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని ఎన్‌సీఎల్ఏటీ ప్రభుత్వ రంగంలోని 11 బ్యాంకులు, ఆర్థిక సంస్థలను ఆదేశించింది. ఎన్‌సీఎల్ఏటీ చైర్‌పర్సన్ జస్టిస్ అశోక్ భూషణ్ నేతృత్వంలోని ఇద్దరు సభ్యుల బెంచ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ లోపు ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ బకాయిలపై సమాధానం ఇవ్వాలని ఆర్‌బీఐ, ఆర్థిక సంస్థలు, బ్యాంకులను ఆదేశించింది. కొత్తగా ఏర్పడిన ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ బోర్డు దాఖలు చేసిన అత్యవసర పిటిషన్‌ను విచారించిన ఎన్‌సీఎల్ఏటీ బెంచ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

మిడ్ ప్రీమియం సెగ్మెంట్‌లో శామ్‌సంగ్ వాటా 18 శాతం



హైదరాబాద్: కొరియాకు చెందిన ఎలక్ట్రానిక్ దిగ్గజం శామ్‌సంగ్ బుధవారం మిడ్ ప్రీమియం సెగ్మెంట్‌లో 5 జీ స్మార్ట్ ఫోన్లు గెలాక్సీ ఎ55, గెలాక్సీ ఎ35లను హైదరాబాద్ మార్కెట్లో విడుదల చేసింది. ఈ సందర్భంగా శామ్‌సంగ్ ఇండియా సీనియర్ డైరెక్టర్ గుఫ్రాన్ ఆలం మాట్లాడుతూ రూ.30,000 నుంచి రూ.50,000 సెగ్మెంట్లో తాము 18 శాతం మార్కెట్ వాటా కలిగి ఉన్నామని తెలిపారు. ఈ కొత్త స్మార్ట్‌ఫోన్లతో ఆ విభాగంలో తమ స్థానం మరింత పటిష్ఠం అవుతుందన్నారు. 2023 సంవత్సరంలో స్మార్ట్‌ఫోన్ విభాగంలో ప్రధాన బ్రాండ్‌గా శామ్‌సంగ్ నిలిచిందని ఆయన చెప్పారు. అనేక కొత్త ఫీచర్లతో మార్కెట్లోకి వచ్చిన గెలాక్సీ ఎ55 ప్రారంభ ధర రూ.36,999 కాగా గెలాక్సీ ఎ 35 ప్రారంభ ధర రూ.27,999 అని ఆయన తెలిపారు. వీటి కొనుగోలుకు శామ్‌సంగ్ ఫైనాన్స్, ఇతర ఎన్‌బీఎఫ్‌సీ భాగస్వాముల ద్వారా రూ.1723 ఈఎంఐకే రుణ సదుపాయం కూడా కల్పిస్తున్నామని వెల్లడించారు.



సిటీ యూనియన్ బ్యాంక్ 800వ శాఖ

హైదరాబాద్: ప్రైవేటు రంగంలోని సిటీ యూనియన్ బ్యాంక్ 800 శాఖల మైలురాయిని చేరింది. అయోధ్యలో బుధవారం 800వ శాఖను ప్రారంభించింది. బ్యాంక్ ప్రారంభమై 120 సంవత్సరాల వేడుకలు నిర్వహించుకుంటున్న సమయంలోనే ఈ మైలురాయిని చేరడం విశేషమని బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. బ్యాంక్ చైర్మన్ ఎం.నారాయణన్ ఈ శాఖను ప్రారంభించగా పారిశ్రామికవేత్త వినయ్ మనూచా ఏటీఎంను ప్రారంభించారు.



హార్దిక్ పాండ్యా

ముంబై కొత్త కొత్తగా!

ఐపీఎల్ రేపటి నుంచే

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

అంతకుముందు వరుసగా రెండు ఐపీఎల్ సీజన్లలో ప్లేఆఫ్స్‌కు చేరలేకపోయిన ముంబై ఇండియన్స్ నిరుడు ఆరంభంలోనూ అదే ప్రదర్శనను కొనసాగించింది. కానీ సరైన సమయంలో పుంజుకుని టాప్-4లో నిలిచింది. అయితే ఆరోసారి ట్రోఫీ దక్కించుకొని చరిత్ర సృష్టించాలని భావిస్తున్న ముంబై ఈమారు సంచలన నిర్ణయం తీసుకుంది. తన పదేళ్ల సారథ్యంలో జట్టుకు ఐదు టైటిళ్లు అందించిన రోహిత్ శర్మను ఏకంగా నాయకత్వ బాధ్యతల నుంచి తప్పించింది. హిట్‌మ్యాన్ ఫ్యాన్స్ నుంచి ఎన్ని విమర్శలు ఎదురైనా ఖాతరు చేయకుండా గుజరాత్ నుంచి భారీ మొత్తంతో 'కొని' తెచ్చుకున్న జట్టు పాత కాపు హార్దిక్ పాండ్యాకు కెప్టెన్సీ అప్పగించింది. కొత్త సారథిని నియమించడంతోపాటు వేలంలో కొయిట్జీ, మధుశంక, మహ్మద్ నబీ వంటి నాణ్యమైన ఆటగాళ్లపై పెద్ద మొత్తం వెచ్చించింది. చెన్నై సూపర్‌కింగ్స్ జట్టు మాదిరే ఆరో ఐపీఎల్ ట్రోఫీతో చరిత్ర సృష్టించాలని పట్టుదలగా ఉంది. మరి.. ఈ 'కొత్త మార్పు'తో ముంబై మరోసారి విజేతగా నిలుస్తుందేమో చూడాలి. ఇకనుంచి జట్టులో ఆటగాడిగానే పరిమితమవనున్న రోహిత్.. కొత్తపాత్రలో ఎలా ఇమిడిపోతాడోనన్నది కూడా ఈసారి లీగ్‌లో ఆసక్తికరం కానుంది.



రోహిత్

బలాలు

ముంబై ఇండియన్స్ బలం నిస్సందేహంగా వారి బ్యాటింగ్ విభాగమే. రోహిత్, ఇషాన్, సూర్యకుమార్, తిలక్‌వర్మ, టిమ్ డేవిడ్, నేహల్ వధేరా..అందరూ మెరుపు బ్యాటింగ్‌తో మ్యాచ్ గమనాన్ని మార్చివేయగలరు. గత ఏడాది ఆ జట్టు నాలుగుసార్లు 200లకుపైగా రన్స్‌ను విజయవంతంగా చేజింగ్ చేయడం విశేషం. హార్దిక్ రాకతో బ్యాటింగ్ మరింత దుర్భేద్యంగా మారింది. ఇక బుమ్రా యార్కర్లకు, కొయిట్జీ 'పేస్' తోడైతే ముంబైకు తిరుగుండబోదు.

బలహీనతలు

నాణ్యమైన స్పిన్నర్లు లేకపోవడం ముంబైకి పెద్ద సమస్య. ఏళ్లుగా జట్టును ఈ సమస్య వేధిస్తోంది. నిరుడు ముంబై తరపున అత్యధిక వికెట్లు తీసిన వెటరన్ స్పిన్నర్ పియూష్ చావ్లాకు అండగా నిలిచేందుకు లెగ్గీ శ్రేయాస్ గోపాల్‌ను వేలంలో దక్కించుకుంది. వీరిద్దరికితోడు యువ స్పిన్నర్లు కుమార్ కార్తికేయ, షామ్స్ ములాని సత్తా చాటితే ముంబై ఇండియన్స్ మరోసారి ట్రోఫీ సాధించడం సులువే.

జట్టు

హార్దిక్ (కెప్టెన్), రోహిత్, సూర్యకుమార్, ఇషాన్ కిషన్, తిలక్‌వర్మ, బ్రేవిస్, డేవిడ్, విష్ణు వినోద్, బుమ్రా, మధుశంక, పియూష్ చావ్లా, మహ్మద్ నబీ, కార్తికేయ, ములానీ, నేహల్ వదేర, అర్జున్ టెండూల్కర్, బెహ్రెన్‌డార్ఫ్, ఆకాశ్ మధ్వల్, షెప్పర్డ్, కొయిట్జీ, శ్రేయాస్ గోపాల్, నువాన్ తుషారా, నమన్ ధీర్, అన్షుల్ కాంబోజ్, శివాలిక్ శర్మ.



కమిన్స్

ఆ'రేంజ్'లో ఆడేనా?

గతకొన్ని సీజన్లుగా సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్రదర్శన దిగజారుతూ వస్తోంది. 2023 సీజన్‌లో తానాడిన 14 మ్యాచ్‌ల్లో ఏకంగా 10 ఓడిన సన్‌రైజర్స్.. పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచింది. 2016లో కప్పును ముద్దాడిన ఈ జట్టు.. ఈసారి మెరుగైన ప్రదర్శనే లక్ష్యంగా జట్టులో మార్పులు చేసింది. ఆస్ట్రేలియా వరల్డ్‌కప్ విన్నింగ్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌ను వేలంలో పోటీపడి మరీ భారీ ధరకు కొనుగోలు చేసింది. మార్‌క్రమ్ స్థానంలో అతడికి జట్టు పగ్గాలు అప్పగించింది. పవర్ హిట్టర్ ట్రావిస్ హెడ్‌ను కూడా దక్కించుకొంది. కోచ్, సహాయ సిబ్బందిని కూడా ప్రక్షాళన చేసింది. మరి, ఇన్ని మార్పులతో కళకళలాడుతున్న ఆరెంజ్ ఆర్మీ.. ఆరేంజ్‌లో ఆడి రెండోసారి కప్పు కొడుతుందా?

బలాలు: సన్‌రైజర్స్ బ్యాటింగ్ లైనప్ అనుభవజ్ఞులు, కొత్త రక్తంతో సమతుల్యంగా కనిపిస్తోంది. మార్‌క్రమ్, మయాంక్ అగర్వాల్, గ్లెన్ ఫిలిప్స్, హెడ్‌లతో టాపార్డర్ బలంగా ఉంటే.. మిడిలార్డర్‌లో హెన్రిచ్ క్లాసెన్, అభిషేక్ శర్మ, అబ్దుల్ సమద్ లాంటి హిట్టర్లున్నారు. ఇక, పేస్ బౌలింగ్, బ్యాటింగ్‌తో ఆకట్టుకునే కమిన్స్‌లాంటి కెప్టెన్ ఉండడం జట్టుకు మరింత లాభించే అంశం. బౌలింగ్‌లో భువనేశ్వర్‌కు తోడు ఉమ్రాన్, నటరాజన్, ఉనాద్కట్ సత్తా చాటితే జట్టుకు తిరుగుండదు.

బలహీనతలు: గత సీజన్‌లో హైదరాబాద్ జట్టులో నిలకడలేమి కనిపించింది. జట్టుగా ఆడడంలో పూర్తిగా విఫలం కావడం.. విజయాలపై ప్రభావం చూపింది. క్లాసెన్ ఒంటరి పోరాటం చేస్తే.. బౌలింగ్‌లో భువనేశ్వర్ మాత్రమే ఆశించిన స్థాయిలో రాణించాడు. అయితే, ఈ సీజన్‌లో మాత్రం ఎవరి పాత్రను వారు పోషిస్తూనే.. కలసికట్టుగా ఉత్తమ ప్రదర్శన చేయాల్సిన అవసరముంది.

జట్టు

కమిన్స్ (కెప్టెన్), మార్‌క్రమ్, త్రిపాఠి, సమద్, ఫిలిప్స్, హెడ్, మయాంక్ అగర్వాల్, క్లాసెన్, అన్‌మోల్‌ప్రీత్, ఉపేంద్ర, నితీశ్ రెడ్డి, అభిషేక్, మార్కో జాన్సెన్, వాషింగ్టన్, హసరంగ, భువనేశ్వర్, నటరాజన్, ఉమ్రాన్ మాలిక్, మార్కండే, ఉనాద్కట్, షాబాజ్, ఆకాశ్, సుబ్రమణ్యన్, ఫరూఖీ.

అక్షయ్ ఆట.. రెహ్మాన్ పాట

అదరనున్న ఐపీఎల్ ప్రారంభోత్సవం

న్యూఢిల్లీ: ఈ ఐపీఎల్ ప్రారంభోత్సవం ఉర్రూతలూగించేలా బీసీసీఐ ఏర్పాట్లు చేస్తోంది. బాలీవుడ్ హీరోలు, గాయకులు తమ ఆట పాటలతో అలరించేలా కార్యక్రమాలు నిర్వహించనుంది. యాక్షన్ స్టార్లు అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్, గాయకుడు సోను నిగమ్, దిగ్గజ సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్ శుక్రవారం సాయంత్రం జరిగే వేడుకల్లో సందడి చేయనున్నారు. ఇక..డిఫెండింగ్ చాంప్ చెన్నై, బెంగళూరు జట్ల మధ్య జరిగే మ్యాచ్‌తో ఐపీఎల్‌కు తెరలేవనుంది.

టీమిండియా కోచింగ్‌పై లాంగర్ ఇలా..



న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ జస్టిన్ లాంగర్ ఐపీఎల్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. బుధవారం విలేకరులతో మాట్లాడిన సందర్భంగా అతడికి అనూహ్యమైన ప్రశ్న ఎదురైంది. భవిష్యత్‌లో భారత జట్టు కోచింగ్ చేపట్టే అవకాశం ఉందా అన్న ఆ ప్రశ్నకు బదులిస్తూ.. 'పాంటింగ్‌తో మాట్లాడుతూనే ఉన్నా. భారత యువ క్రికెటర్లలో ఇంత ప్రతిభ ఉందని అనుకోలేదు. అంతమంది ప్రతిభావంతులతో పని చేస్తున్నందుకు ద్రవిడ్‌కు ఎంతో గర్వంగా ఉండి ఉంటుంది' అని లాంగర్ తెలివిగా సమాధానమిచ్చాడు.

నన్ను అలా పిలవొద్దు

ఫ్యాన్స్‌కు కోహ్లీ అభ్యర్థన

బెంగళూరు: తనను 'కింగ్' అని సంబోధించడాన్ని ఆపాలంటూ విరాట్ కోహ్లీ.. అభిమానులతో పాటు జట్టు సహచరులను అభ్యర్థించాడు. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు నూతన జెర్సీ ఆవిష్కరణ సందర్భంగా వ్యాఖ్యాత అడిగిన ఓ ప్రశ్నకు.. కోహ్లీ ఇలా స్పందించాడు. 'మళ్లీ ఇక్కడకు రావడం ఎంతో సంతోషంగా ఉంది. మీరందరూ నన్ను 'కింగ్' అని పిలవడాన్ని ఆపేయాలి. అలా అంటే ఎంతో అసౌకర్యంగా ఉంటుంది. కెప్టెన్ డుప్లెసికి కూడా అదే చెప్పా. నన్ను విరాట్ అని మాత్రమే పిలవండి' అని కోహ్లీ కోరాడు.



శ్రేయాంక ఆనందం రెట్టింపు

బెంగళూరు: ఆరాధ్య ఆటగాడు విరాట్ కోహ్లీని కలుసుకోవడం తన జీవితంలో ఎంతో అమూల్యమైన సందర్భమని మహిళా ప్లేయర్ శ్రేయాంక్ పాటిల్ పట్టరాని సంతోషాన్ని వ్యక్తం చేసింది. కోహ్లీతో ఉన్న ఫొటోను ఎక్స్‌లో షేర్ చేసింది. 'అతడి కోసమే క్రికెట్‌ను చూడడం ఆరంభించా. అతడిలా ఎదగాలని కలలు కన్నా. ఎట్టకేలకు ఆ అపురూప సమయం వచ్చింది. హాయ్ శ్రేయాంక.. అద్భుతంగా బౌలింగ్ చేశావని నన్ను పేరుతో పిలిచాడ'ని శ్రేయాంక పోస్ట్ చేసింది. గతవారం డబ్ల్యూపీఎల్‌లో బెంగళూరు టైటిల్ విజేతగా నిలవడంలో శ్రేయాంక కీలకపాత్ర పోషించిన సంగతి తెలిసిందే.

రాజకీయాలతో ముడిపెట్టొద్దు

» సీఏకు అఫ్ఘాన్ క్రికెట్ బోర్డు లేఖ

కాబూల్: అఫ్ఘానిస్థాన్‌తో టీ20 ద్వైపాక్షిక సిరీస్‌ను ఆస్ట్రేలియా వాయిదా వేయడంపై అఫ్ఘాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) అసహనం వ్యక్తం చేసింది. ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గొద్దని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ)ను కోరింది. అఫ్ఘాన్‌లో మహిళలు, ఆడపిల్లపై జరుగుతున్న అణచివేత ధోరణులను కారణంగా చెబుతూ.. ఆగస్టులో స్వదేశంలో జరగాల్సిన టీ20 సిరీస్‌ను ఆసీస్ వాయిదా వేసింది. అయితే, క్రీడలను రాజకీయాలకు దూరంగా ఉంచాలని సీఏకు రాసిన లేఖలో ఏసీబీ కోరింది.

లాంగ్‌జంప్‌లో షైలీకి నయన షాక్

బెంగళూరు: ఇండియన్ ఓపెన్ జంప్స్ పోటీల్లో ఫేవరెట్ షైలీసింగ్‌కు చుక్కెదురైంది. బుధవారం జరిగిన లాంగ్‌జంప్‌లో షైలీ (యూపీ)కి షాకిస్తూ కేరళకు చెందిన నయన జేమ్స్ స్వర్ణం గెలిచింది. నయన 6.67మీటర్లు లంఘించి విజేతగా నిలవగా, షైలీ 6.40 మీటర్లతో రజతానికి పరిమితమైంది.

శ్రీకాంత్, సింధు శుభారంభం



లక్ష్యసేన్


బాసిల్: స్విస్ బ్యాడ్మింటన్ ఓపెన్ సూపర్ 300 సిరీస్‌లో స్టార్ షట్లర్లు కిడాంబి శ్రీకాంత్, పీవీ సింధు, లక్ష్యసేన్ శుభారంభం చేశారు. బుధవారం జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో శ్రీకాంత్ 21-17, 21-18తో వాంగ్ ఝెజు వీ (చైనీస్ తైపీ)పై, లక్ష్యసేన్ 21-19, 15-21, 21-11తో లియాంగ్ జున్ హావ్ (మలేసియా)పై గెలిచారు. సింధు 21-12, 21-13తో పోర్న్‌పిచా చోయికివాంగ్ (థాయ్‌లాండ్)పై సునాయాసంగా నెగ్గింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జంట 21-18, 12-21, 21-19తో మెయిలీసా-రాచెల్ (ఇండోనేసియా) ద్వయంపై, గాయత్రి-త్రిసా జోడీ 21-15, 21-12తో అన్నె జు-కెర్రీ జు (అమెరికా)పై నెగ్గాయి.

మహీకి ఆటే సర్వస్వం కాదు

జహీర్ ఖాన్

చెన్నై: క్రికెట్ తన జీవితంలో అంతర్భాగమేకానీ..అదే సర్వస్వం కాదని ధోనీ ఎప్పుడో అర్థం చేసుకున్నాడని టీమిండియా మాజీ ఆటగాడు జహీర్‌ఖాన్ వెల్లడించాడు. కెప్టెన్‌గా చెన్నై సూపర్ కింగ్స్‌కు ఐదు ఐపీఎల్ టైటిళ్లు అందించిన 42 ఏళ్ల మహీ తన సారథ్యంలో మరోసారి జట్టును నడిపించేందుకు సిద్ధమవుతున్నాడు. 'క్రికెట్ అంటే ధోనీకి చచ్చేంత ఇష్టం. అది తన జీవితంలో ఓ భాగమనీ మహీకి తెలుసు. కానీ అదే తన సర్వస్వం కాదని కూడా ధోనీ చాలాకాలం కిందటే తెలుసుకున్నాడు' అని ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ జహీర్ పేర్కొన్నాడు.

ఒలింపిక్స్ ఆరంభ వేడుకల్లో రష్యా, బెలారస్ అథ్లెట్లకు నో చాన్స్



స్పష్టం చేసిన ఐవోసీ

జెనీవా: పారిస్ ఒలింపిక్స్ ఆరంభోత్సవంలో పాల్గొనకుండా రష్యా, బెలారస్ అథ్లెట్లపై అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐవోసీ) నిషేధం విధించింది. జూలై 26న జరిగే ఈ ప్రారంభ వేడుకల్లో అథ్లెట్ల పరేడ్‌ను గతానికి భిన్నంగా స్టేడియంలో కాకుండా సీన్ నదిలో నిర్వహించనున్నారు. వేలాది మంది అథ్లెట్లు ఐఫిల్ టవర్ దిశగా పడవలపై వెళ్తూ పరేడ్ చేయనున్నారు. అయితే, విశ్వక్రీడల్లో తటస్థ అథ్లెట్లుగా పాల్గొంటున్న రష్యా, బెలారస్ ప్లేయర్లను వీక్షకులుగా మాత్రమే అనుమతిస్తామని ఐవోసీ స్పష్టం చేసింది. వేడుకల్లో ఆ రెండు దేశాల క్రీడాకారులను భాగస్వాములం చేయబోమని వెల్లడించింది. ఉక్రెయిన్‌పై యుద్ధం కారణంగా ఈ రెండు దేశాలపై ఐవోసీ నిషేధం విధించిన సంగతి తెలిసిందే. ఇక.. సస్పెండ్ చేసిన అంతర్జాతీయ బాక్సింగ్ సంఘం (ఐబీఏ)తో ఆయా దేశాల జాతీయ సమాఖ్యలు సంబంధాలు తెంచుకోవాలని ఐవోసీ సూచించింది. కొత్త వరల్డ్ బాడీని ఏర్పాటు చేసుకోవాలని.. లేకపోతే 2028 లాస్ ఏంజిల్స్ క్రీడల నుంచి బాక్సింగ్‌ను తప్పిస్తామని కూడా హెచ్చరించింది.

బీఆర్ఎస్‌కు మాజీ ఎమ్మెల్సీ సతీశ్‌కుమార్ రాజీనామా

» నేడు సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లోకి..



సీఎం రేవంత్‌తో పురాణం సతీశ్

మంచిర్యాల/మహబూబ్‌నగర్/హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సీనియర్ నేత, ఉమ్మడి ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కుమార్ బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నానని పేర్కొన్న లేఖను బుధవారం బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌కు పంపారు. ఉమ్మడి జిల్లాలోనే తనదైన ముద్ర వేసుకున్న సతీశ్.. 2020 వరకు 14 ఏళ్ల పాటు బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా సేవలందించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల టికెట్ ఆశించినా దక్కకపోవడంతో అసంతృప్తితో ఉన్నారు. ఈనేపథ్యంలోనే బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన సతీశ్.. బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయి చర్చించారు. ఈ క్రమంలోనే గురువారం రేవంత్ సమక్షంలో ఆయన కాంగ్రెస్‌లో చేరబోతున్నారు. ఇటు మాజీ ఎమ్మెల్యే, మహబూబ్‌నగర్ జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడి సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. 2004లో అమరచింత నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఆమె ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆ తర్వాత కొన్నాళ్లకు బీఆర్ఎస్‌లో చేరి 2019లో భూత్పూర్ జెడ్పీటీసీ సభ్యురాలిగా గెలిచి జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు.

ఆర్టీసీ ఉద్యోగులపై వివక్ష సరికాదు: ఈయూ

హైదరాబాద్, మార్చి20(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల పట్ల సంస్థ యాజమాన్యం, ప్రభుత్వం వివక్ష ప్రదర్శిస్తున్నాయని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాబు, ఇ. వెంకన్న అన్నారు. బీఆర్ఎస్ సర్కారు 2018లో ప్రభుత్వ ఉద్యోగులకు వేతన సవరణలో 30 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చిందని, కానీ 2017లో ఆర్టీసీ ఉద్యోగులకు ఇవ్వవలసిన పీఆర్‌సీని విస్మరించిందని పేర్కొన్నారు. తద్వారా.. మార్చి 2024లో 21 శాతం ఫిట్‌మెంట్‌ను ప్రకటించినప్పటికీ, ప్రభుత్వ ఉద్యోగుల కంటే 9 శాతం ఫిట్‌మెంట్ నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్ఆర్ఏను తగ్గించకుండా పాతపద్ధతినే కొనసాగించాలని, 30శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ చేయాలని, లేనిపక్షంలో ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తుందని వారు హెచ్చరించారు.

వంద రోజుల అప్పు 16,400 కోట్లు:బీఆర్ఎస్

హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వంద రోజుల పాలనలో కాంగ్రెస్ సర్కారు ప్రజల సంక్షేమం కోసం చేసిందేమీ లేదని, రూ.16,400 కోట్ల అప్పు మాత్రం చేశారని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు గత ప్రభుత్వం అప్పులు చేసిందంటూ మొన్నటిదాకా దుష్ప్రచారం చేశారని, ఆ అప్పులు మాజీ సీఎం కేసీఆర్ తన ఇంటికోసమే చేసినట్లు నీచంగా మాట్లాడారన్నారు. ఇప్పుడు వంద రోజుల్లోనే రూ.16,400కోట్ల అప్పు ఎలా చేశారని ప్రశ్నించారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడు రాష్ట్ర అవసరాలకు అప్పులు చేయాల్సి ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. ప్రకృతి విపత్తులతో నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు రూ.10 వేలు నష్టపరిహారంగా ఇవ్వాలని బీఆర్ఎస్ తరఫున డిమాండ్ చేశారు.

తిరుమలగిరి మునిసిపాలిటీలో నెగ్గిన అవిశ్వాసం

» పదవులు కోల్పోయిన చైర్మన్, వైస్ చైర్మన్

తిరుమలగిరి, మార్చి 20:సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మునిసిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌లపై కౌన్సిలర్లు ప్రకటించిన అవిశ్వాసం నెగ్గింది. తిరుమలగిరి మునిసిపల్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు చైర్మన్, మధ్యాహ్నం రెండు గంటలకు వైస్ చైర్మన్‌పై అవిశ్వాస సమావేశాలు నిర్వహించారు. మొదట చైర్‌పర్సన్ రజనిపై అవిశ్వాస సమావేశం నిర్వహించగా మొత్తం 16 మందికి(వార్డు సభ్యులు 15, ఎమ్మెల్యే సామేలు ఎక్స్‌అఫీషియో సభ్యుడు) 13మంది హాజరయ్యారు. అవిశ్వాసానికి మద్దతుగా 13మంది సంతకాలు చేసి, చేతులెత్తి మద్దతు తెలిపారు. దీంతో అవిశ్వాసం నెగ్గినట్లు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, ఆర్డీవో వేణుమాధవరావు ప్రకటించారు. అలాగే, వైస్ చైర్మన్ సంకెపల్లి రఘునందన్‌రెడ్డిపై పెట్టిన అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా 13మంది చేతులు ఎత్తారు. దీంతో అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీవో ప్రకటించారు. ఈ అవిశ్వాస నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని, నూతన చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక తేదీని త్వరలోనే కలెక్టర్ ప్రకటిస్తారని ఆర్డీవో తెలిపారు.



సీఎం రేవంత్‌ను సన్మానిస్తున్న కమ్మ సంఘాల నాయకులు

కమ్మలకు ఒక లోక్‌సభ సీటివ్వండి

» సీఎంను కలిసి కోరిన కమ్మ సంఘాల ప్రతినిధులు

హైదరాబాద్/ఖమ్మం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కమ్మ వారికి ఒక ఎంపీ సీటును కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కమ్మ సేవా సంఘాల సమాఖ్య ప్రతినిధులు కోరారు. అలాగే కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు.. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపి ఆయనను సన్మానించారు. త్వరలోనే హైదరాబాద్‌లో కృతజ్ఞత బహిరంగ సభను ఏర్పాటు చేస్తామని, దానికి రావాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. కృతజ్ఞతా సభకు ముఖ్య అతిథిగా వచ్చేందుకు సీఎం అంగీకరించినట్లు సమాఖ్య ప్రతినిధులు వెల్లడించారు. సీఎంను కలిసినవారిలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎంపీ రేణుకాచౌదరి, సమాఖ్య ప్రతినిధులు జి. రామకృష్ణ ప్రసాద్, కె. రత్నాకర్‌రావు, బి. రవిశంకర్, ఎర్నేని రామారావు, వేమూరి సురేశ్ కుమార్ తదితరులు ఉన్నారు.

భువనగిరిలో సీపీఎం పోటీ.. అభ్యర్థి జహంగీర్

హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి సీపీఎం పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య తెలిపారు. సీపీఎం అభ్యర్థిగా ఎండీ జహంగీర్ బరిలో ఉంటారని చెప్పారు. జహంగీర్ భువనగిరిలో అనేక పోరాటాలు చేశారని, మూసీ సమస్యను పరిష్కరించాలంటూ పాదయాత్ర చేశారని గుర్తుచేశారు. మిగిలిన 16 పార్లమెంట్ స్థానాల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలనే దానిపై ఇంకా కొంత సమయం వేచి చూస్తామని చెప్పారు. కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ కలిసి పనిచేస్తే బీజేపీ ఓడిపోతుందన్నారు. కలసి పనిచేద్దామని బీఆర్ఎస్ నుంచి ప్రతిపాదన వస్తే పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

దేశవ్యాప్తంగా 30 స్థానాల్లో పోటీ: సీపీఐ

హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా సీపీఐ 25 నుంచి 30 స్థానాల్లో పోటీ చేస్తుందని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని మగ్దూం భవన్‌లో సీపీఐ రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ పోటీ చేసే స్థానాలపై ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్‌తో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. తెలంగాణలో పెద్దపల్లి, నల్లగొండ, భువనగిరి, ఖమ్మం, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఏదో ఒక స్థానం కోసం ప్రతిపాదించినట్లు వివరించారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని, పౌర హక్కులను రద్దు చేస్తుందన్నారు.

ఎరువుల టెండర్లకు 26వ తేదీ తుది గడువు

మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో నిల్వచేసే ఎరువుల నిర్వహణకు సంబంధించి ఆన్‌లైన్ టెండర్ల గడువు ఈ నెల 26తో ముగుస్తుందని తెలంగాణ మార్క్‌ఫెడ్ ఎండీ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు టెండర్ బిడ్లు స్వీకరిస్తామని చెప్పారు. ప్రీ బిడ్డింగ్ సమావేశం ఇందువరకే నిర్వహించామని, నియమ నిబంధనలు ఆన్‌లైన్‌లో ఉంచామని ఎండీ వివరించారు. అర్హులైన బిడ్డర్లు ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలని కోరారు.





ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సిత్రం!

ఉదయాన్నే కాంగ్రెస్‌లో చేరి.. సాయంత్రం మళ్లీ బీఆర్ఎస్‌లోకి

షాద్‌నగర్ అర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో కొందరు ప్రజాప్రతినిధుల తీరు.. ఇది కదా సిత్రం అనిపించేలా చేస్తోంది. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీలోని 13వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ కానుగు అంతయ్య బుధవారం ఉదయం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పాల్గొని బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎదుర్కొన్న సమస్యలను, ఇబ్బందులను వివరించి ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లోకి రావడం తనకు ఆనందంగా ఉందన్న అంతయ్య.. సాయంత్రానికి పార్టీ మారిపోయారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సమక్షంలో తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరారు. ఇలా వెళ్లి అలా వచ్చిన అంతయ్యను చూసి.. మిగతా ప్రజాప్రతినిధులు ఆశ్చర్యపోయారు.

ఢిల్లీ ప్రదక్షిణలు తప్ప రైతుల కన్నీళ్లు కనిపించవా?

» ప్రజాపాలన అంటే ఫక్తు రాజకీయమేనా?

» పార్టీ ఫిరాయింపులపై ఉన్న దృష్టి పంట నష్టంపై లేదెందుకు?

సీఎం రేవంత్‌పై కేటీఆర్ ఫైర్



హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): "అకాల వర్షాలతో పంటలు నష్టపోయి తెలంగాణ రైతాంగం అవస్థ పడుతున్నా.. కాంగ్రెస్ సర్కారుకు పట్టడంలేదు. ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు తప్ప.. సీఎం రేవంత్‌రెడ్డికి రైతుల కన్నీళ్లు కనిపించవా..?" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. రైతాంగం పరిస్థితులపై ప్రభుత్వం స్పందించి.. తక్షణం ఆదుకోవాలని 'ఎక్స్' వేదికగా ఆయన కోరారు. పంటలు ఎండుతున్నా పట్టించుకోవడం లేదని, రైతులంటే ప్రభుత్వానికి ఎందుకింత చిన్నచూపు.. వడగళ్లు ముంచెత్తినా కన్నెత్తి చూడటం లేదని విమర్శించారు. హైకమాండ్ చుట్టూ చక్కర్లు కొడుతున్న సీఎంకు రైతు సమస్యలు వినే ఓపిక లేదా.. అని రేవంత్‌ను నిలదీశారు. ఎన్నికల గోల తప్ప కష్టాలు పడుతున్న శ్రావికులపై కనికరం చూపడం లేదని, సీట్లు, ఓట్ల పంచాయతీ తప్ప.. ఆత్మహత్యలకు పాల్పడుతున్న అన్నదాతలను ఆదుకునే ధ్యాస కాంగ్రెస్ సర్కారుకులేదని ఆరోపించారు. ప్రజాపాలనఅంటే 24/7 ఫక్తు రాజకీయమేనా? పార్టీ ఫిరాయింపులపై ఉన్న దృష్టి.. పంటనష్టంపై లేదెందుకు? దెబ్బతిన్న పంటలను పరిశీలించే తీరిక ఈ ప్రభుత్వానికి లేదా?అని అడిగారు. నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలన్న మనసు కూడా రావడం లేదన్నారు.

మలి జాబితాపై ఉత్కంఠ!

(మొదటిపేజీ తరువాయి)

ఉంటుందన్న చర్చ కూడా జరిగినట్లు తెలిసింది. కాగా, మెదక్‌లో నీలం మధు పేరు ప్రధానంగా పరిశీలనలో ఉన్నా.. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన మరో నేత పేరు చర్చలో ఉన్నట్లు చెబుతున్నారు.

భువనగిరికి పరిశీలనలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే!

భువనగిరి సీటుకు టీపీసీసీ ఉపాధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డికి సన్నిహితుడైన చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేరు పరిశీలనలో ఉంది. అయితే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన భార్య లక్ష్మికి ఆ టికెట్ ఇప్పించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. వీరే కాకుండా.. బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే ఒకరి పేరు కూడా ఇక్కడినుంచి పరిశీలనలో ఉన్నట్లు చెబుతున్నారు. ఇక హైదరాబాద్ సీటుకు సుప్రీంకోర్టు న్యాయవాది అయిన షెహనాజ్ అనే మహిళ పేరును పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, ఖమ్మం స్థానానికి డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క భార్య, మంత్రి పొంగులేటి సోదరుడు, మరో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తనయుడితోపాటు టీపీసీసీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కుసుమ్‌కుమార్ తీవ్రంగా పోటీ పడుతుండడంతో ఆ సీటును కూడా పెండింగ్‌లో పెట్టారు. అయితే పెండింగ్‌లో ఉన్న అన్ని సీట్లపైనా చర్చ పూర్తి చేసి ఒకేసారి అభ్యర్థులను ప్రకటించాలని భావిస్తే.. తెలంగాణకు సంబంధించి మలి జాబితా హోలీ పండుగ తర్వాతనే ఉంటుందని పార్టీ నేతలు చెబుతున్నారు. గురువారం పలు రాష్ట్రాల్లో అభ్యర్థుల ఎంపికపై సీఈసీ మరోసారి భేటీ అవుతోంది. కానీ, ఈ భేటీలో తెలంగాణ అభ్యర్థులపై చర్చ జరగడంలేదు. ఈ భేటీ అనంతరం వివిధ రాష్ట్రాల అభ్యర్థుల జాబితా ప్రకటిస్తే.. తెలంగాణలో స్పష్టత వచ్చిన స్థానాలకు అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉందని అంటున్నారు. వాస్తవానికి అభ్యర్థుల విషయంలో స్పష్టత వచ్చిన సీట్లను కూడా సామాజిక సమతుల్యత, ఇతర కారణాలతో అధిష్ఠానం పెండింగ్‌లో పెట్టింది.

2 సీట్ల కోసం మాదిగ వర్గం నేతల ఒత్తిడి..

రాష్ట్రంలో మాదిగ, మాల జనాభా నిష్పత్తి దృష్ట్యా.. మూడు ఎస్సీ రిజర్వుడు సీట్లలో రెండు మాదిగ సామాజిక వర్గానికి, ఒకటి మాల సామాజిక వర్గానికి కేటాయించాలని మాదిగ వర్గం నేతలు అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. అయితే మాల వర్గానికే రెండు సీట్లు (నాగర్‌కర్నూల్, పెద్దపల్లి) కేటాయిస్తున్న నేపథ్యంలో మాదిగ వర్గం నేతలు బుధవారం అధిష్ఠానం పెద్దలపై ఒత్తిడి తెచ్చారు. అలాగే సికింద్రాబాద్ సీటును బొంతు రామ్మోహన్‌కు లేదా ఆయన భార్యకు ఇస్తామంటూ గతంలో హామీ ఇవ్వగా.. తాజాగా ఈ సీటుకు దానం నాగేందర్ పేరు ఖరారైంది. కానీ, ప్రస్తుతం బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న దానం నాగేందర్.. కాంగ్రెస్ బీ ఫారంపై పోటీ చేయాలంటే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుందన్న చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో అభ్యర్థుల మలి జాబితా ప్రకటన పట్ల కాంగ్రెస్ వర్గాల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. అయితే ఈ జాబితాలో ఇప్పటికే ఖరారైనట్లు చెబుతున్న సీట్లలో.. కారు దిగిన నేతలకే ప్రాధాన్యం ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. రంజిత్‌రెడ్డి, పసునూరి దయాకర్ బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీలు కాగా.. దానం నాగేందర్ ఆ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే. సునీతామహేందర్‌రెడ్డి ఇటీవలే బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇక గడ్డం వంశీ.. బీజేపీ నుంచి అసెంబ్లీ ఎన్నికల ముంగిట కాంగ్రెస్ పార్టీలో చేరారు. మెదక్‌లో ప్రధానంగా పరిశీలనలో ఉన్న నీలం మధు కూడా ఇటీవల బీఆర్ఎస్ నుంచే వచ్చి చేరారు. కాగా, ఆదిలాబాద్ సీటుకు ఖరారైన డాక్టర్ సుమలత, హైదరాబాద్, నిజామాబాద్ సీట్లకు చర్చలో ఉన్న షెహనాజ్, కవితారెడ్డి కాంగ్రెస్‌కు పార్టీకి కొత్త ముఖాలు.

నాగర్‌కర్నూల్ టికెట్ నాకే ఇవ్వండి

సోనియాగాంధీకి మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ లేఖ

తనపై ఖమ్మం కోటరీ కుట్ర పన్నుతోందని ఆరోపణ

హైదరాబాద్, మార్చి 20: లోక్‌సభ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ టికెట్ తనకే కేటాయించాలని కోరుతూ ఆలంపూర్ మాజీ ఎమ్మెల్యే ఎస్.ఎ.సంపత్‌కుమార్ సోనియాగాంధీకి లేఖ రాశారు. నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గంలో మాదిగ సామాజిక వర్గం ఓట్లు ఎక్కువగా.. మాల సామాజికవర్గం ఓట్లు తక్కువగా ఉంటాయని.. మాదిగ సామాజికవర్గానికి చెందిన, అన్ని అర్హతలూ ఉన్న, గెలిచే అభ్యర్థిని తానేనని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. ఖమ్మం నేతలు, ఏఐసీసీ పెద్దలు కొందరు కలిసి ఈ వాస్తవాలను తొక్కిపట్టి.. ఇదే నియోజకవర్గం నుంచి పోటీ చేసి నాలుగుసార్లు ఓడిపోయిన, మాల సామాజిక వర్గానికి చెందిన మల్లు రవి పేరును ఖరారు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మల్లు రవికి ఇప్పటికే.. 'ఢిల్లీలో ప్రత్యేక ప్రతినిధి'గా క్యాబినెట్ ర్యాంకు ఇచ్చారని, అయినా కూడా ఖమ్మంలో ఒక మంత్రి సోదరుడికి టికెట్ ఇచ్చి సంతృప్తి పరచడానికి, నాగర్‌కర్నూల్‌లో ఖమ్మానికే చెందిన ఉప ముఖ్యమంత్రి సోదరుడికి చోటు కల్పించడానికి ఖమ్మం కోటరీ పనిచేస్తోందని.. వారంతా కలిసి పార్టీ కోసం 3 దశాబ్దాలుగా కష్టపడుతున్న తనకు అన్యాయం చేశారని వాపోయారు.

మంత్రి పొన్నం ఫోన్ సంభాషణ లీక్!

» కల్యాణలక్ష్మి చెక్కులను మీరే పంచండి

» ఆర్డీవో, తహసీల్దార్‌కు మంత్రి ఆదేశం



కమలాపూర్ (ఎల్కతుర్తి)/హైదరాబాద్, మార్చి 20: (ఆంధ్రజ్యోతి): రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఇద్దరు అధికారుల మధ్య జరిగిన ఫోన్ సంభాషణ లీక్ కావడం, అది సోషల్ మీడియాలో వైరల్ కావడం కలకలం రేపుతోంది. గతంలో హనుమకొండ ఆర్డీవో రమేశ్‌కు మంత్రి పొన్నం ఫోన్ చేశారు. ఆ తర్వాత కమలాపూర్ తహసీల్దార్ మాధవిని కాన్ఫరెన్స్‌లోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఇద్దరు అధికారులతో మంత్రి ఫోన్‌లో మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ గురించి వారికి సూచనలు చేశారు. 'మొన్నటి దాకా హుజూరాబాద్ ఎమ్మెల్యేగా ఈటల రాజేందర్ ఉండగా.. గవర్నమెంట్ తమదే కదా అని ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. ఇప్పుడున్న ఎమ్మెల్యే (పాడి కౌశిక్‌రెడ్డి) మా పార్టీ అతను కాదు. ఆయన చేతికి ఒక్క చెక్కు కూడా పోవద్దు. మీకే స్వేచ్ఛ నిస్తున్నాం. మీరే (అధికారులు) చెక్కులు పంచండి. అవసరమైతే స్థానిక సర్పంచులను తీసుకెళ్లి చెక్కులను ఇవ్వండి' అని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. మంత్రి ఆదేశాలకు తహసీల్దార్ మాధవి.. సరే సార్ అంటూ సమాధానమిచ్చారు. ఈ సంభాషణ అంతా సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇక హన్మకొండ ఆర్డీవోపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి మంత్రి పొన్నం ప్రభాకర్ ఫిర్యాదు చేశారు. తన వాయిస్‌ను రికార్డు చేసిన ఆర్డీవో.. దాన్ని ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు పంపారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ ఈ మేరకు వివరాలను వెల్లడించారు.

ఎన్డీఏ కూటమికే మా మద్దతు కూటమితోనే ఏపీకి భవిష్యత్తు

» లోక్‌సత్తా జయప్రకాశ్ నారాయణ



విజయవాడ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి తమ మద్దతు ఉంటుందని లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ ప్రకటించారు. జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి రాష్ట్రానికి మేలు చేస్తుందని విశ్వసిస్తున్నామన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి, ఉపాధి, పరిశ్రమలకు అవకాశం కల్పిస్తారన్న నమ్మకం తమకు ఉందన్నారు. ప్రజలు, మేధావులు, రైతులు ఆలోచించి రాష్ట్రానికి, పిల్లలకు మంచి భవిష్యత్తును చూపించే ఎన్డీఏ కూటమిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అప్పులు తెచ్చి సగం జీతభత్యాలకు, మరికొంత కైంకర్యం చేసి, కొంత దుబారా చేసి, మిగిలిన నిధులను సంక్షేమానికి ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. సమాజంలో సంక్షేమం అవసరమేనని, దానికి ఒక పరిమితి ఉండాలని చెప్పారు. పాలకులు ప్రజల సొమ్మును తమ సొమ్ముగా భావిస్తున్నారని మండిపడ్డారు. ఎల్లకాలం పుచ్చుకోవడం కాకుండా ఎప్పుడూ సంపాదించుకోవడం అలవాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రభుత్వంలో జరుగుతున్న ఏ తప్పును ఎత్తి చూపినా వెంటనే కులం, మతం, ప్రాంతం తెరపైకి తెస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రశాంతంగా, స్వేచ్ఛగా ఓట్లు వేసే అవకాశం ఉంటుందా? అనే సందేహం సర్వత్రా వ్యక్తమవుతోందన్నారు. అసమర్థులు, అవినీతిపరులు పాలకులుగా ఉన్నప్పుడు సంస్కరణలు సాధ్యం కావని చెప్పారు. రాష్ట్రంలో పరిశ్రమలు, ఉపాధి లేవన్నారు. 20శాతం ఉండాల్సిన అప్పులు 43శాతానికి పెరిగాయన్నారు. ఉద్యోగుల బకాయిలు కలిపితే 50శాతానికి అప్పులు పెరిగాయన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు చేసిన అభివృద్ధిని వైసీపీ నిర్వీర్యం చేసిందని, ఈ పరిస్థితుల్లో కూటమి విజయంతో రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందని చెప్పారు.

రూ.54.26 లక్షల నగదు సీజ్

ఎన్నికల కోడ్.. విస్తృతంగా వాహన తనిఖీలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా వాహన తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం చేపట్టిన వాహన తనిఖీల్లో రూ.54,26,400ను పోలీసులు పట్టుకున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి ఘటకేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో పోలీసులు వేర్వేరు వ్యక్తుల నుంచి రూ.37లక్షల నగదు సీజ్ చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో చేసిన తనిఖీల్లో రూ.9.09 లక్షల నగదు, రూ.2925 విలువైన మద్యంను స్వాధీనం చేసుకున్నారు. అలాగే, నిర్మల్ జిల్లా భైంసాలో రూ.1.2 లక్షలు, కామారెడ్డి జిల్లా మద్నూరులో రూ.60 వేలు పట్టుకున్నారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడిలో రూ.5.57లక్షలు, రాజన్నసిరిసిల్ల జిల్లా జిల్లెల్లలో రూ.80,400 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఏపీలో రాజకీయ హత్యలపై ఈసీ కన్నెర్ర

ఏపీలోని 3 జిల్లాల ఎస్పీలకు సీఈవో పిలుపు.. ఆళ్లగడ్డ, గిద్దలూరు, మాచర్ల ఘటనలపై ఆగ్రహం

» హింసను ఎందుకు ఆపలేకపోయారో వచ్చి వివరణ ఇవ్వండి

» ప్రకాశం, నంద్యాల, పల్నాడు ఎస్పీలకు నిర్దేశం



అమరావతి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చాక గత రెండ్రోజుల్లో రాష్ట్రంలో జరిగిన రాజకీయ హింసాత్మక ఘటనలను కేంద్ర ఎన్నికల కమిషన్ (సీఈసీ) తీవ్రంగా పరిగణించింది. ప్రకాశం, నంద్యాల జిల్లాల్లోని గిద్దలూరు, ఆళ్లగడ్డలో జరిగిన రాజకీయ హత్యలు, మాచర్లలో ఒక రాజకీయ పార్టీకి చెందిన వాహనం తగులబెట్టడంపై నివేదిక ఇవ్వాలని సంబంధిత జిల్లాల ఎస్పీలను ఆదేశించింది. సీఈసీ అనుమతిస్తేనే డీఎస్సీ పరీక్షలు జరుగుతాయని స్పష్టం చేసింది. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) ముఖేశ్‌కుమార్ మీనా బుధవారమిక్కడ అమరావతి సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'ఆళ్లగడ్డ, గిద్దలూరుల్లో రెండు హత్యలు జరిగాయి. మాచర్లలో ఓ రాజకీయ పార్టీకి చెందిన కారును తగులబెట్టారు. దీనిపై ప్రకాశం, నంద్యాల, పల్నాడు జిల్లాల ఎస్పీలను గురువారం సాయంత్రం నాలుగు గంటలకు సీఈవో కార్యాలయానికి రమ్మన్నాం. ఆయా సంఘటనలు ఎలా జరిగాయి.. పోలీసు దర్యాప్తులో ఏం తేలింది.. పరిస్థితిని ఎందుకు నియంత్రించలేకపోయారు తదితర వివరాలతో వచ్చి వివరణ ఇవ్వాలని ఆదేశించాం. ఆ ఎస్పీలు ఇచ్చిన నివేదికలు, వివరణలు పరిశీలించి సీఈసీకి పంపుతాం. కమిషన్ ఆదేశాలను బట్టి చర్యలు ఉంటాయి. రాజకీయ హింసను ఎవరూ ప్రోత్సహించొద్దు. ఎన్నికలు రాజకీయ హింసరహితంగా జరపాలని నిర్ణయించాం. ప్రధానమంత్రి పాల్గొన్న టీడీపీ-జనసేన-బీజేపీ సభలో భద్రతా వైఫల్యం మా పరిధిలోకి రాదు. దానిపై మాకు ఫిర్యాదులు వచ్చాయి. వాటిని కేంద్ర హోం శాఖ కార్యదర్శికి పంపాం. ప్రస్తుతం అది ఆ శాఖ పరిధిలో ఉంది' అని తెలిపారు.

ప్రజాప్రతినిధులతో ఉద్యోగులు తిరగొద్దు..

ఎన్నికల షెడ్యూల్ వెలువడగానే కోడ్ అమల్లోకి వచ్చిందని, ప్రభుత్వ భవనాలపై ఉన్న రాజకీయ నేతల ఫొటోలు, ప్రకటనలను తొలగించాలని చెప్పామన్నారు. ప్రజాప్రతినిధులతో ప్రభుత్వ ఉద్యోగులు ఎవరూ తిరగకూడదని స్పష్టం చేశారు.

విద్యా'రత్నం' ఇకలేరు

» రత్నం విద్యాసంస్థల అధినేత కేవీ రత్నం కన్నుమూత

» అనారోగ్యంతో బాధపడుతూ నెల్లూరులో తుదిశ్వాస

» మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య సహా పలువురి దిగ్భ్రాంతి



నెల్లూరు(విద్య), మార్చి 20: విద్యావేత్త, రత్నం విద్యాసంస్థల అధినేత కొర్రపాటి వెంకట రత్నం (కేవీ రత్నం, 82) తుదిశ్వాస విడిచారు. మూడేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం తీవ్ర అస్వస్థకు గురై కన్నుమూశారు. విద్యారంగంలో చెరగని ముద్రవేసిన ఆయన విద్యాసంస్థల విజయాలకు నెలవుగా నెల్లూరు జిల్లా కీర్తిని ఇనుమడింప చేశారు. రాష్ట్రంలోనే తొలిసారిగా కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి లక్షలాది మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారు. ఎంతోమంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్యనందించారు. ఆయన శిష్యులు ఎందరో నేడు ప్రపంచ వ్యాప్తంగా అత్యున్నత స్థానాల్లో ఉన్నారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం చలపనాయుడుపల్లిలో 1943 మే 23న జన్మించిన రత్నం.. ఆత్మకూరు ప్రాంతంలోనే పదో తరగతి పూర్తిచేశారు. 1961-62లో పీయూసీ, 1963-66లో నెల్లూరు వీఆర్ కళాశాలలో బీఎస్సీ కెమిస్ట్రీలో డిస్టింక్షన్ సాధించారు. 1966లో అదే కళాశాల కెమిస్ట్రీ విభాగంలో నెలకు రూ.240 జీతంతో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. అదే ఏడాది నగరంలోని రజిక వీధిలో జయంతి ట్యుటోరియల్స్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత 1983లో రాష్ట్రంలోనే తొలిసారిగా రత్నం కోచింగ్ సెంటర్ ప్రారంభించి, 1985లో ఉద్యోగానికి రాజీనామా చేశారు. అక్కడి నుంచి అంచెలంచెలుగా ఎదిగిన రత్నం విద్యాసంస్థలు రాష్ట్రంలోనే సంచలనాత్మక విద్యావేదికగా గుర్తింపు పొందాయి. ఓవైపు విద్యనందిస్తూనే మరోవైపు సేవా కార్యక్రమాలకూ శ్రీకారం చుట్టారు. 2005లో చిన్నారి హార్ట్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి 140మంది చిన్నారులకు గుండె ఆపరేషన్లు చేయించి అందరి మన్ననలు పొందారు. కేవీ రత్నం మృతిపట్ల మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ క్రిశాంక్‌పై కేసు నమోదు



హైదరాబాద్ సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు మహానందరెడ్డిని కించపరిచే విధంగా ట్విటర్ (ఎక్స్)లో తప్పుడు పోస్టులు పెట్టారన్న అభియోగంపై బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌పై మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం ఆయనను మాదాపూర్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి 41 (ఏ) సీఆర్‌పీసీ కింద నోటీసులు అందజేశారు. ఈ నేపథ్యంలోనే క్రిశాంక్ మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

కృత్రిమంగా మాగబెట్టిన పండ్లతో..

» ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

» టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు

» రూ. 13 లక్షల విలువైన పండ్లు సీజ్, ఐదుగురి అరెస్టు

హైదరాబాద్ సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కార్బైడ్, ఇథిలిన్ రసాయనాలను ఉపయోగించి కృత్రిమంగా మాగబెట్టిన పండ్లను మార్కెట్‌కు తరలించి విక్రయిస్తూ.. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న వ్యాపారుల దుకాణాలు, గోదాములపై టాస్క్‌ఫోర్స్ లా అండ్ ఆర్డర్ పోలీసులు దాడులు చేశారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రశ్మి పెరుమాళ్ బషీర్‌బాగ్‌లోని సీసీఎస్‌లో బుధవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన ఈశ్వర్, సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన ఇర్ఫాన్‌ఖాన్, అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన సయ్యద్ జహార్, చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన సయ్యద్ మస్తాన్, భవానీనగర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ అస్లాం హోల్‌సేల్ పండ్ల దుకాణాలను నిర్వహిస్తున్నారు. రంజాన్ మాసం, పెళ్లిళ్ల సీజన్, వేసవికాలం కావడంతో మార్కెట్లో పండ్లకు విపరీతమైన డిమాండ్ ఉంది. అందుకు తగ్గట్టుగా ఉత్పత్తి లేకపోవడంతో వ్యాపారులు పచ్చి కాయలపై కార్బైడ్, ఇథిలిన్ వేసి కృత్రిమ పద్ధతిలో వాటిని మాగబెట్టి పండ్లుగా మార్చి పండ్ల వ్యాపారులకు హోల్‌సేల్‌గా విక్రయిస్తున్నారు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులతో పాటు.. వివిధ స్టేషన్ల పోలీసులతో కలిసి వరుస దాడులు నిర్వహించారు. ఐదుగురు హోల్‌సేల్ పండ్ల వ్యాపారులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి కార్బైడ్, ఇథిలిన్ రసాయనాలతో పాటు.. రూ.13 లక్షల విలువైన పండ్లను స్వాధీనం చేసుకున్నారు.

రైతులను ఆదుకుంటాం: చిన్నారెడ్డి

హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో పంట నష్ట పోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వెల్లడించారు. పంట నష్టం వివరాలు వచ్చిన తర్వాత పరిహారంపై నిర్ణయం తీసుకుంటుందన్నారు. అకాల వర్షంతో 9 జిల్లాల్లో ఎక్కువగా పంట నష్టం జరిగిందని, కామారెడ్డిలో ఇది ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. వచ్చే ఖరీఫ్ నుంచి పంటల బీమా అమలు కానున్నట్లు తెలిపారు. రైతు బంధు ఇప్పటికే 80% మందికి అందిందన్నారు. కేటీఆర్, నిరంజన్‌లకు ఉద్యోగం లేదు కాబట్టి తమను వి మర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఆయన విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 సీట్లలోనూ గెలవడానికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఒక టీమ్‌గా పని చేస్తున్నారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. తెలంగాణ ప్రయివేటు జూనియర్, డిగ్రీ కాలేజీ అసోసియేషన్ ప్రతినిధులతో టీపీసీసీ మేధావుల సెల్ చైర్మన్ శ్యామ్ మోహన్, అధికార ప్రతినిధి పాపిరెడ్డి తదితరులు గాంధీభవన్‌లో భేటీ అయ్యారు. ప్రయివేట విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను అసోసియేషన్ ప్రతినిధులు వివరించారు

బడ్జెట్ మంజూరైనప్పటికీ అందని బిల్లులు

- అసెంబ్లీ ఎన్నికల పెండింగ్ బిల్లులు ఇవ్వండి
- సీఈవోకు డిప్యూటీ కలెక్టర్ల,తహసీల్దార్ల సంఘాలు వినతి

గత అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్, తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్ల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) వికాస్‌రాజ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన బడ్జెట్ మంజూరైనప్పటికీ నేటికి బిల్లులు అందలేదని గుర్తు చేశారు. మరోవైపు లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ కూడా వచ్చిందన్నారు. పాత బిల్లులు వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మరోవైపు తహసీల్దార్లకు సంబంధించిన అద్దె వాహనాల బిల్లులు కూడా మంజూరైనప్పటికీ నేటికి పెండింగ్‌లోనే ఉన్నాయని వివరించారు.

ఇన్‌చార్జి డీఎంఈగా వాణి నియామకం చెల్లదు

- జీవోను సస్పెండ్ చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు
- చట్టప్రకారం పోస్టు భర్తీ చేయాలని సర్కారుకు ఆదేశాలు

హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్య ఇన్‌చార్జి డైరెక్టర్‌గా సంగారెడ్డి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వాణి నియామకం చెల్లదని హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ మేరకు ఈ ఏడాది ఫిబ్రవరి 19న సర్కారు జారీ చేసిన నియామక జీవో 63ను సస్పెండ్ చేస్తూ బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషనర్ అయిన వనపర్తి గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ ఎ.నరేంద్రకుమార్ డీఎంఈగా ప్రమోషన్‌కు అర్హుడని పేర్కొంది. చట్టప్రకారం డీఎంఈ పోస్టును భర్తీ చేయాలని వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. ఇన్‌చార్జి డీఎంఈగా వాణి నియామకం చెల్లదని పేర్కొంటూ నరేంద్రకుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. తెలంగాణ రాష్ట్ర సబార్డినేట్ సర్వీస్ రూల్స్-1996 లోని రూల్ 10 (హెచ్), గతంలో ఇదే హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పులకు విరుద్ధంగా నియామకం చేపట్టారని తెలిపారు. సీనియార్టీ జాబితా ప్రకారం అత్యంత సీనియర్ అయిన పిటిషనర్ సదరు పోస్టుకు అర్హుడని గతంలో ఇదే హైకోర్టు పలు పిటిషన్లలో స్పష్టం చేసిందని గుర్తు చేశారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. నిబంధనల మేరకు ఇన్‌చార్జిల నియామకాన్ని పూర్తిగా నిషేధించారని పేర్కొంది. ఈ పరిస్థితుల్లో ఇన్‌చార్జి డీఎంఈ నియామక జీవోపై సస్పెన్షన్ విధిస్తున్నామని.. చట్టప్రకారం రెగ్యులర్ డీఎంఈని నియమించాలని ఆదేశాలు జారీ చేసింది. విచారణను జూన్ 10వ తేదీకి వాయిదా వేసింది.

ముగ్గురు చిన్నారులపై గొడ్డలితో దాడి

- యూపీలో ఓ యువకుడి కిరాతకం
- ఇద్దరి మృతి.. ఒకరికి తీవ్ర గాయాలు
- గంటల వ్యవధిలోనే నిందితుడు ఎన్‌కౌంటర్‌లో హతం

బదయూన్, మార్చి 20: ఉత్తరప్రదేశ్‌లోని బదయూన్ జిల్లాలో అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులను ఓ యువకుడు అతి కిరాతకంగా గొడ్డలితో నరికి చంపేశాడు. మరో చిన్నారిపైనా దాడి చేయగా ఆ బాలుడు తప్పించుకొని పారిపోయాడు. తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడు. బదయూన్ పట్టణంలోని బాబా కాలనీలో మంగళవారం రాత్రి 8గంటల సమయంలో ఈ ఘోరం జరిగింది. అయితే, నిందితుడు గంటల వ్యవధిలోనే పోలీసుల కాల్పుల్లో చనిపోయాడు. పోలీసు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడి పేరు సాజిద్. వయస్సు 22 ఏళ్లు. బాధిత పిల్లలు ఆయుష్(12), అహాన్(8), యువరాజ్(10) అన్నదమ్ములు. సాజిద్ ఇటీవలే బాబా కాలనీలో సెలూన్ షాపును తెరిచాడు. అతని షాపునకు ఎదురుగా వినోద్ కుమార్ ఇల్లు ఉంది. మంగళవారం రాత్రి సాజిద్.. వినోద్ ఇంట్లోకి వెళ్లాడు. అప్పుడు ఇంట్లో వినోద్ తల్లి, ముగ్గురు పిల్లలు మాత్రమే ఉన్నారు. తొలుత వినోద్ తల్లితో మాట్లాడిన సాజిద్ తర్వాత ఇంటి రెండో అంతస్తులో పిల్లలు ఉన్న చోటుకు వెళ్లాడు. అక్కడ ముగ్గురు పిల్లలపై విచక్షణారహితంగా గొడ్డలితో దాడి చేశాడు. ఆయుష్, అహాన్ అక్కడికక్కడే చనిపోయారు. యువరాజ్ తీవ్ర గాయాలతో తప్పించుకొని కిందికి పరుగెత్తుకుంటూ వచ్చి ప్రాణాలు కాపాడుకున్నాడు. చిన్నారుల హత్యతో బాబా కాలనీలో స్థానికులు ఆగ్రహంతో ఊగిపోయారు. సాజిద్ షాపును, బైక్‌ను ధ్వంసం చేశారు. దాడి అనంతరం సాజిద్ పారిపోవడానికి ప్రయత్నించాడు. అయితే, హత్యపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఆ ప్రాంతంలో నిర్బంధ తనిఖీలు నిర్వహించారు. "సాజిద్ షేక్‌పూర్ అటవీ ప్రాంతంలో ఉన్నట్లు సమాచారం అందింది. మా బృందం అక్కడికి వెళ్లగానే సాజిద్ పోలీసులపైకి కాల్పులు జరిపాడు. ఎదురు కాల్పుల్లో అతడు తీవ్రంగా గాయపడి చనిపోయాడు" అని ఐజీ ఆర్కే సింగ్ తెలిపారు.

25వ గ్రంథాలయ ప్రారంభోత్సవానికి వస్తా..

- ఆకర్షణకు ప్రధాని ఆశీస్సులు

సనత్‌నగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తాను సేకరించిన పుస్తకాలతో ఈ ఏడాది చివరికి మొత్తం 25 గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తానంటున్న సనత్‌నగర్ విద్యార్థిని ఆకర్షణ సతీష్‌ను ప్రధాని మోదీ ప్రత్యేకంగా అభినందించారు. బేగంపేట హెచ్‌పీఎస్‌లో 8వ తరగతి చదువుతున్న ఆకర్షణ సతీష్ తాను సేకరించిన 7 వేల పుస్తకాలతో పలు ప్రాంతాల్లో ఇప్పటికే 10 గ్రంథాలయాలను నెలకొల్పింది. ఈ విషయం తెలుసుకున్న ప్రధాని మోదీ తన మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రత్యేకంగా ఆకర్షణను అభినందించారు. ఈ మేరకు పీఎంవో కార్యాలయం నుంచి అందిన పిలుపు మేరకు ఈ నెల 18న సాయంత్రం తమిళనాడులోని కోయంబత్తూరు పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ ఆమెను కలుసుకొనేందుకు రెండు నిమిషాల సమయం ఇచ్చారు. అయితే ఊహించని విధంగా ప్రధాని విద్యార్థిని ఆకర్షణతో 23 నిమిషాలు సంభాషించారు. త్వరలో కోయంబత్తూరులోని కేన్సర్ ఆస్పత్రిలో, తిరుపూరులో, తెలంగాణలో మరో 10 భరోసా సెంటర్లలో గ్రంథాలయాలను ఏర్పాటు చేయబోతున్నట్లు ఆకర్షణ సతీష్ ప్రధానికి తెలిపారు. తన సంకల్పానికి సాయంగా ప్రధాని మోదీ 2 వేల పుస్తకాలను బహుమతిగా అందించారని, 25వ గ్రంథాలయ ప్రారంభోత్సవానికి వస్తానని హామీ ఇచ్చి ఆశీర్వదించారని ఆకర్షణ సతీష్ తెలిపారు.



ఆకర్షణను ఆశీర్వదిస్తున్న మోదీ

కాంగ్రెస్‌కు బీఆర్‌ఎస్ నేతలే దిక్కయ్యారు!

- ఆ పార్టీ ఎంపీ అభ్యర్థుల్లో సగం మంది కేసీఆర్ తయారుచేసిన వారే: జగదీశ్ రెడ్డి

హుజూర్‌నగర్, మార్చి 20: కాంగ్రెస్‌లో ఎంపీ అభ్యర్థులు లేరని, ఆ పార్టీకి దిక్కు లేక బీఆర్‌ఎస్ నాయకులనే ఎంపీ అభ్యర్థులుగా పెట్టుకుంటోందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వారిలో సగం మంది కేసీఆర్ తయారుచేసిన బీఆర్‌ఎస్ నాయకులేనని పేర్కొన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్‌లో బీఆర్‌ఎస్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజలు మళ్లీ కేసీఆర్‌ను ఆదరిస్తారన్నారు. హుజూర్‌నగర్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జిగా తానే ఉంటున్నానన్నారు. సమావేశంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, తిప్పన విజయసింహారెడ్డి పాల్గొన్నారు.

ఖమ్మం టికెట్.. పోటాపోటీ!

ఇంకా తేల్చని కాంగ్రెస్ అధిష్ఠానం.. రేసులో ముగ్గురు మంత్రుల బంధుగణం

- పోటీకి సిద్ధమంటున్న కుసుమ్ కుమార్, వీహెచ్
- ప్రయత్నాల్లో మరికొంత మంది ప్రముఖులూ..
- అధిష్ఠానం ప్రకటన కోసం ఎదురుచూపు



మల్లు నందిని





పొంగులేటి ప్రసాద్‌రెడ్డి



తుమ్మల యుగంధర్

ఖమ్మం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయడానికి కాంగ్రెస్ టికెట్ కోసం ఆశావహుల మధ్య బిగ్‌ఫైట్ నడుస్తోంది. ముగ్గురు మంత్రుల బంధుగణం రేసులో ఉండడంతో టికెట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అధిష్ఠానం టికెట్ ఎవరికి ఇస్తుందన్న దానిపై జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రానికి గుమ్మంగా ఉన్న ఖమ్మం లోక్‌సభ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కంటే మెజారిటీ తెచ్చుకోవడమే పోటీ అన్నట్లుగా ఎవరికి వారు అంచనాలు వేసుకుంటున్నారు. కాంగ్రెస్ ఇప్పటికే రెండు జాబితాలు ప్రకటించినా ఖమ్మం అభ్యర్థిని ఖరారు చేయలేదు. జిల్లాకు చెందిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాదరెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని ఖమ్మం నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నారు. దీంతో ముగ్గురు అభ్యర్థులతో పాటు మంత్రులు కూడా తమకున్న లాబీయింగ్, సామాజిక సమీకరణాలను ఉపయోగించి టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. మంత్రుల బంధుగణంతో పాటు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జట్టి కుసుమ కుమార్, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ తదితరుల కూడా పార్టీ టికెట్ ఆశిస్తున్నారు. వీరే కాకుండా పలువురు బడా వ్యాపారవేత్తలూ టికెట్ కోసం నేరుగా అధిష్ఠానం వద్ద ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో కాంగ్రెస్, సీపీఐ కూటమి విజయం సాధించింది. కొత్తగూడెంలో సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు గెలవగా మిగిలిన ఆరు సీట్లల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. ఇందులో మధిర నుంచి గెలిచిన భట్టి విక్రమార్క రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా, ఖమ్మం నుంచి గెలిచిన తుమ్మల వ్యవసాయశాఖ మంత్రిగా, పాలేరు నుంచి గెలిచిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెవెన్యూశాఖ మంత్రిగా ఉన్నారు.

ఇది కాంగ్రెస్ కంచుకోట

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో కాంగ్రెస్‌కు 7,33,293 ఓట్లు లభించగా, ఓటమి చెందిన బీఆర్‌ఎస్ అభ్యర్థులకు 4,67,631 ఓట్లు పోలయ్యాయి. దీంతో ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్‌కు 2,65,662 ఓట్ల ఆధిక్యత లభించింది. మొదటి నుంచి ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్‌కు కంచుకోటగానే నిలిచింది. జలగం వెంగళరావు, పీవీ రంగయ్యనాయుడు, రేణుకాచౌదరి ఖమ్మం నుంచి గెలిచి కేంద్ర మంత్రులయ్యారు. ముఖ్యమంత్రులుగా పనిచేసిన జలగం వెంగళరావు, నాదెండ్ల భాస్కరరావు కూడా ఖమ్మం లోక్‌సభ నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీచేసి ఎంపీలుగా విజయం సాధించారు. కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకు ఉన్న ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో ఈ సారి కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు సులభమేనని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈనేపథ్యంలో ఖమ్మం టికెట్ తెచ్చుకుంటే చాలు విజయం తమదే అన్న ధీమా ఆ పార్టీ నేతల్లో ఉంది. దీంతో ఆశావహులు అధిష్ఠానం ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎంపీ నామా నాగేశ్వరరావు పేరును ఇప్పటికే కేసీఆర్ ప్రకటించారు. దీంతో అదే సామాజిక వర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలనే డిమాండ్ వినిపిస్తోంది. బీజేపీ కూడా మొదట్లో జలగం వెంకటరావు పేరును పరిశీలించింది. అయితే చివరి నిమిషంలో ఖమ్మం జిల్లాలో బలమైన సామాజిక వర్గంగా ఉన్న కమ్మ సామాజిక వర్గం నుంచి ఎవరైనా వస్తే టికెట్ ఇచ్చే ఆలోచనలో ఉంది.



నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ధాన్యం కొనుగోళ్లపై జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న కోమటిరెడ్డి

శ్రీశైలం, సాగర్ నీళ్లను జగన్‌కు అమ్ముకున్న బీఆర్‌ఎస్

- సన్న ధాన్యానికి క్వింటాకు 2,800 ఇవ్వాలి
- చెల్లించని మిల్లులను సీజ్ చేస్తాం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మిర్యాలగూడ, మార్చి 20 : శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టుల నుంచి కృష్ణా జలాలను ఏపీ సీఎం జగన్‌కు అమ్ముకున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టుల్లో బురదను మిగిల్చిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని పలు ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి బుధవారం పాల్గొన్నారు. మార్గం మధ్యలో వేములపల్లి, మిర్యాలగూడ ప్రాంతాల్లోని మిల్లు పాయింట్ల వద్ద ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదేళ్ల పాటు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన పాపాలు కరువు రూపంలో రాష్ట్రాన్ని వెంటాడుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్‌తోనే కరువు వచ్చిందనడం మాజీమంత్రి జగదీష్ రెడ్డి తెలివితక్కువ తనమన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో జైలుకు పోయేవారు ఇంకా చాలామంది ఉన్నారని, త్వరలో బీఆర్‌ఎస్ పార్టీ ఖాళీ అవుతుందని అన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మిల్లర్లు సిండికేట్ అయి గిట్టుబాటు ధర చెల్లించటం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందిస్తూ... సన్నధాన్యానికి క్వింటాకు రూ.2,800 ధర చెల్లించని మిల్లులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుంది.. తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్న మిల్లులపై చర్యలు తీసుకోవాలని జేసీ, డీఎస్‌వోలకు ఫోన్‌లో ఆదేశించారు.

ఎకరాకు రూ. 10 వేలు

(మొదటిపేజీ తరువాయి)

రైతులందరికీ పరిహారం చెల్లించే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం ఎకరానికి రూ.6 వేల వరకే నష్ట పరిహారం చెల్లించాలని ఉన్నప్పటికీ.. రాష్ట్రప్రభుత్వం రూ.10 వేల చొప్పున ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. సర్వే పూర్తికాగానే అధికారుల నివేదిక ప్రకారం రైతులకు ఆర్థికసాయం చేస్తామన్నారు. గతంలో యాసంగి పంట కాలానికి మే నెల వరకు రైతుబంధు వేసిన సందర్భాలు ఉన్నాయని తుమ్మల అన్నారు. ప్రభుత్వ ఖజానా ఖాళీగా ఉన్నా రైతుల ఖాతాల్లో రైతుబంధు జమచేస్తున్నామని వ్యాఖ్యానించారు. 4-5 ఎకరాల విస్తీర్ణం ఉన్న రైతులకు ఒకటి, రెండు రోజుల్లో నగదు బదిలీ పూర్తవుతుందని చెప్పారు. దీంతో 90% రైతులకు రైతు బంధు పంపిణీ పూర్తవుతుందని, మిగిలినవారికి కూడా నగదు బదిలీ చేస్తామని మంత్రి చెప్పారు. వ్యవసాయ రుణాల మాఫీపై ఇంకా ఎలాంటి విధానపరమైన నిర్ణయం తీసుకోలేదని, రూ.2 లక్షల వరకు రుణాలను ఒకేసారి మాఫీ చేయాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చిన సందర్భాలు లేవన్నారు. 2019లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి సీఎం కేసీఆర్ స్వయంగా పంట నష్టాన్ని పరిశీలించి మొదటి కిస్తీ రూ.151 కోట్లు మాత్రమే విడుదల చేశారని, తర్వాత పంట నష్టం జరిగిన బాధితులకు రూ.250 కోట్లు ప్రకటించినప్పటికీ, జీవో విడుదల చేయలేదని మంత్రి గుర్తు చేశారు. తర్వాత పంటనష్టంపై కనీసం నివేదిక కూడా తయారు చేయలేదన్నారు. అలాంటి వ్యక్తులు ఇప్పుడు రైతుల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉన్నదని తుమ్మల ఎద్దేవా చేశారు.



సాగర్‌ను ఖాళీ చేసి.. ఇప్పుడు రాద్ధాంతమా?

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నాగార్జునసాగర్ ఆయకట్టు కింద మొదటి పంటకే నీరివ్వని సందర్భాలు ఉన్నాయని, ఇప్పుడు వాళ్లే రెండో పంటకు కూడా నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. అస్తవ్యస్తమైన విధానాలతో మొదటి పంటకే సాగర్‌ను ఖాళీ చేసి ఈరోజు రెండో పంటకు నీళ్లివ్వాలని రాద్ధాంతం చేయటం సరికాదన్నారు. బీఆర్‌ఎస్ నేతలను రైతులు నమ్మే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఖజానాతో పాటు రిజర్వాయర్లలో నీళ్ల కూడా ఖాళీ చేసిందని ధ్వజమెత్తారు. పంటకు అవసరం లేకున్నా ఎన్నికల కోసం సాగర్ నీళ్లు వదిలారని, ఇప్పుడు తాగు నీటికి కూడా ఇబ్బంది అవుతోందని విమర్శించారు. కర్ణాటక నుంచి నీళ్లు అడిగి తీసుకోవాల్సి వస్తోందని మంత్రి చెప్పారు. నాగార్జునసాగర్, శ్రీశైలం, ఎల్లంపల్లి రిజర్వాయర్లలో ఉన్న నీటిని పంపింగ్ చేసైనా మిషన్ భగీరథ పైపులైన్ల ద్వారా హైదరాబాద్ తాగునీటి అవసరాలు తీరుస్తామని తుమ్మల తెలిపారు. మొదటి ప్రాధాన్యం కింద మంచినీళ్లు, రెండో ప్రాధాన్యం కింద గోదావరి బెల్టులో పంటలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని మంత్రి అన్నారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోత్గల్‌లో పంటను పరిశీలిస్తున్న బండి సంజయ్

రైతాంగాన్ని ఆదుకోవాలి

- వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు 25 వేల పరిహారం ఇవ్వాలి
- ఎంపీ బండి సంజయ్

సిరిసిల్ల, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రైతు ఏడ్చిన రాజ్యం, ఎద్దు ఏడ్చిన ఎవుసం బాగుపడ్డట్లు చరిత్రలో లేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ అన్నారు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, ఎకరానికి రూ.25 వేల చొప్పున తక్షణ సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట, ముస్తాబాద్ మండలాల్లో వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న వరి పంటను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ... అధికారంలోకి వచ్చి వందరోజులైనా రైతులకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతు భరోసా కింద రైతులు, కౌలు రైతులకు ఎకరానికి రూ.15 వేల సాయం, పంటకు రూ.500 బోనస్ తదితర హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటి తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ముస్తాబాద్ మండల కేంద్రంలో గాలి దుమారానికి విద్యుత్ స్తంభం పడి మృతిచెందిన రైతు ఎల్లయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కాగా, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకట్రావుపల్లె వద్ద ఎంపీ సంజయ్ వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. సంజయ్ వాహనంతో పాటు కాన్వాయ్‌లో ఉన్న ఇతర నేతల వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు.

బీఆర్‌ఎస్ ఔట్: పొన్నం

హైదరాబాద్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీ ఔట్ అయిందని, లోక్‌సభ ఎన్నికల్లో ఫైట్ కాంగ్రెస్, బీజేపీల మధ్యే పోటీ ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి బండి సంజయ్‌ను ఎందుకు తొలగించారో ఆయనే చెప్పాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్‌పైన అవినీతి ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. బీజేపీలో ఈటల రాజేందర్, బండి సంజయ్‌లకు పడదని చెప్పారు. సంజయ్‌కి, మాజీ మంత్రి గంగుల కమలాకర్‌కు ఎంత సాన్నిహిత్యం ఉందో అందరికీ తెలుసునన్నారు. అవసరమైతే సాగర్ నుంచి బూస్టర్ పైపుల ద్వారా హైదరాబాద్‌కు తాగునీటిని తరలిస్తామని చెప్పారు. ఎల్లంపల్లి నుంచి కూడా 3 టీఎంసీల నీటిని నగరానికి తరలిస్తున్నట్లు తెలిపారు.

వైద్యశాఖలో కొలువుల జాతర

(మొదటిపేజీ తరువాయి)

ఈ పోస్టులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సర్కారు మంజూరు చేసిన పోస్టుల్లో 60 శాతం వైద్యవిద్య సంచాలకుల పరిధిలోనివే. ఒక్క డీఎంఈ పరిధిలో 3,235 పోస్టులుండగా, తెలంగాణ వైద్యవిధాన పరిషత్ పరిధిలో 1,255 (టీవీవీపీ), ప్రజారోగ్య సంచాలకుల (డీహెచ్) పరిధిలో మరో 575 పోస్టుల భర్తీకి అనుమతినిచ్చింది. ప్రస్తుతం కొత్త మెడికల్ కాలేజీల్లో అధ్యాపకులు, ఇతర సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) తనిఖీల నేపథ్యంలో శాశ్వత ప్రాతిపదికన కొలువుల భర్తీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. కాగా లోక్‌సభ ఎన్నికల కోడ్ ఈ నెల 16నే వచ్చింది. కోడ్‌కు కొద్ది గంటల ముందు సర్కారు ఈ పోస్టుల భర్తీకి అనుమతులిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు వైద్యవర్గాలు తెలిపాయి. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాతనే ఈ నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. జూన్‌లో ఈ పోస్టుల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ వస్తుందని అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత వైద్య ఆరోగ్యశాఖలో ఒకేసారి ఇన్ని పోస్టులకు అనుమతినివ్వడం ఇదే తొలిసారి.

మొత్తం పోస్టుల్లో 1,989 నర్స్ పోస్టులు..

మొత్తం పోస్టుల్లో నర్స్ పోస్టులే 1,989 ఉన్నాయి. ఇందులో వైద్యవిద్య సంచాలకుల పరిధిలో 1,545 ఉండగా, తెలంగాణ వైద్యవిధాన పరిషత్‌లో 332, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో 80, ప్రజారోగ్య సంచాలకులు పరిధిలో 31, నారాయణగూడలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్‌లో ఒక పోస్టు ఉన్నాయి. కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత నర్స్ పోస్టుల భర్తీపై ఎక్కువ దృష్టి సారించింది. గత ప్రభుత్వం ఇచ్చిన 5,204 స్టాఫ్‌నర్స్ పోస్టుల నోటిఫికేషన్‌కు అదనంగా మరికొన్ని పోస్టులను కలిపింది. మొత్తం 6,956 నర్సింగ్ ఆఫీసర్స్‌ను మెడిక్ కాలేజీల కోసం రిక్రూట్ చేసింది. తాజాగా మరో 1,989 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వెరసీ ఒక్క నర్స్ పోస్టులే 8,945 అయ్యాయి.



ఏయే విభాగంలో ఎన్ని పోస్టులంటే..

వైద్యవిద్య సంచాలకులు	3,235
టీవీవీపీ	1,255
ప్రజారోగ్య సంచాలకులు	575
ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి	212
డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్	11
ఆయుష్	26
ఐపీఎమ్	34
మొత్తం పోస్టులు	5,348

మేజర్ పోస్టులు ఎన్నంటే...

సివిల్ అసిస్టెంట్ సర్జన్స్	978
అసిస్టెంట్ ప్రొఫెసర్స్	608
స్టాఫ్‌నర్స్	1,989
ఫార్మాసిస్టులు	612
ల్యాబ్ టెక్నీషియన్స్	344

అందరి సమస్యలూ వింటా

(మొదటిపేజీ తరువాయి)

చర్యలు తీసుకుంటానని రాధాకృష్ణన్ తెలిపారు. గవర్నర్ ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డితోపాటు, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి కొండా సురేఖ, పలువురు ఇతర మంత్రులు, ప్రముఖులు హాజరయ్యారు. గవర్నర్ రాధాకృష్ణన్‌కు సీఎం రేవంత్ రెడ్డి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. గవర్నర్‌తో సీఎం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్ర రాజకీయ పరిస్థితులు ఇతర అంశాలపై చర్చించినట్లు సమాచారం. సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తాతో పాటు ఇతర ముఖ్య అధికారులు నూతన గవర్నర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



యాదగిరిగుట్ట ఆలయంలో గవర్నర్ రాధాకృష్ణన్

నృసింహుడి దర్శనంతో ఆధ్యాత్మిక అనుభూతి

వేల ఏళ్ల చరిత్ర కలిగిన యాదగిరిగుట్ట ఆలయంలో నృసింహుడి దర్శనంతో ఆధ్యాత్మిక అనుభూతిని పొందానని గవర్నర్ రాధాకృష్ణన్ తెలిపారు. గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన రాధాకృష్ణన్ సాయంత్రం 7.10గంటలకు యాదగిరిగుట్ట క్షేత్రానికి చేరుకున్నారు. కొండపైన అతిథి గృహం వద్ద ఉన్న లిఫ్టు ద్వారా ఆలయ తిరువీధుల్లోకి చేరుకున్న ఆయనకు తూర్పు రాజగోపురం వద్ద అర్చకస్వాములు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. గర్భాలయంలో పూజల అనంతరం ముఖమండపంలో వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి గవర్నర్‌కు స్వామివారి శేషవస్త్రాలను, అభిషేకం లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విజిటర్స్ బుక్‌లో తన పర్యటన వివరాలను గవర్నర్ క్లుప్తంగా రాశారు. మహిమాన్విత ఆలయంలోకి అడుగు పెట్టగానే ఆధ్యాత్మిక అనుభూతి కలిగిందని పేర్కొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యాదగిరిగుట్ట ఆలయాన్ని అద్భుతంగా పునర్నిర్మించారని, క్షేత్ర సందర్శనతో తన గుండెల నిండా ఆనందం నింపుకొన్నానని తెలిపారు. అనంతరం ఆయన ఉత్తర దిశలోని లిఫ్టు గుండా అతిథి గృహానికి చేరుకుని, తిరిగి హైదరాబాద్ బయల్దేరి వెళ్లారు. కాగా, అంతకుముందు చార్మినార్ వద్ద ఉన్న భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలోనూ గవర్నర్ రాధాకృష్ణన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాలిసెట్ పరీక్ష తేదీలో మార్పు

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వివిధ ప్రవేశ పరీక్షల తేదీల్లో అధికారులు మార్పులు చేర్పులు చేస్తున్నారు. మే 13వ తేదీన ఎన్నికలున్న క్రమంలో ఆ రోజు, ముందు రోజు, తర్వాతి రోజుల్లో ఉన్న పరీక్షల తేదీలను మారుస్తున్నారు. పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పాలిసెట్) తేదీని మే 17 నుంచి మే 24వ తేదీకి వాయిదా వేశారు. ఈమేరకు బుధవారం సాంకేతిక విద్యా శిక్షణా మండలి కార్యదర్శి పుల్లయ్య ప్రకటన చేశారు. ఇక ఎప్‌సెట్‌కు కూడా ఒకటి, రెండ్రోజుల ముందుగానే ప్రవేశ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించారు. సర్కారు అనుమతి నివ్వగానే... కొత్త తేదీలను ప్రకటించనున్నారు. ఇప్పటికే ప్రకటించిన షెడ్యూల్ మేరకు.. మే 9, 10వ తేదీల్లో ఇంజనీరింగ్, 11, 12వ తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. ఎన్నికల నేపథ్యంలో కొంత ముందుగానే.. మే 7 లేదా 8వ తేదీ నుంచి ప్రారంభించాలని భావిస్తున్నారు. ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలను వచ్చే నెల (ఏప్రిల్) మూడో వారంలో ప్రకటించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి స్పాట్ వాల్యుయేషన్‌ను పూర్తి చేయనున్నారు. తర్వాత అన్నీ సక్రమంగానే ఉన్నాయా లేదా అనేది పరిశీలించి ఫలితాలను ప్రకటించనున్నారు.

జూన్ 23న నీట్ పీజీ ప్రవేశ పరీక్ష

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నీట్ పీజీ ప్రవేశ పరీక్షను నేషనల్ మెడికల్ కమిషన్ రీ- షెడ్యూల్ చేసింది. జూన్ 23న ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు ప్రకటించింది. జూలై 15న ఫలితాలు ప్రకటిస్తామని, ఆగస్టు 5 నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపింది. సెప్టెంబరు 16 నుంచి నీట్ పీజీ తరగతులు ప్రారంభమవుతాయని, మెడికోలు పీజీ కోర్సుల్లో చేరేందుకు అక్టోబరు 21 చివరి తేదీ అని పేర్కొంది. ఈ ఏడాది ఆగస్టు 15 నాటికి ఇంటర్న్‌షిప్ పూర్తి చేసినవారే నీట్ పీజీ రాసేందుకు అర్హులని స్పష్టం చేసింది.

వీవోఐపీ ఫోన్‌కాల్స్.. ఇద్దరి అరెస్టు

హైదరాబాద్ సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఫోన్‌కాల్స్‌ను వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రొటోకాల్(వీవోఐపీ) ద్వారా లోకల్ కాల్స్‌గా మారుస్తున్న ముఠా ఆటను హైదరాబాద్ దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు కట్టించారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లోని ముఠాలతో సంబంధం ఉన్న నిందితులను యాకుత్‌పుర నివాసి హిదాయత్ అలీ, బోరబండకు చెందిన ముజాహిద్ అహ్మద్‌గా గుర్తించారు. ఈదీబజార్, బాలాపూర్, పూల్‌బాగ్, సంతోష్‌నగర్‌లలో వీరు నిర్వహిస్తున్న వీవోఐపీ కాల్స్ డెన్‌లపై దాడులు జరిపి.. 204 బీఎస్ఎన్ఎల్ సిమ్‌కార్డులు, ఆరు ల్యాప్‌టాప్‌లు, ఆరు సెల్ ఫోన్లు, రోటర్లను స్వాధీనం చేసుకున్నారు.

కుల,మతాల వారీగా డెలివరీ బాయ్స్ విభజనా?

జొమాటో 'ప్యూర్ వెజ్ ఫ్లీట్'పై టీజీపీడబ్ల్యూయూ అభ్యంతరం

హైదరాబాద్‌సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో ప్రకటించిన 'ప్యూర్ వెజ్ ఫ్లీట్' సేవలపై తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్(టీజీపీడబ్ల్యూయూ) అభ్యంతరం వ్యక్తం చేసింది. భవిష్యత్తులో డెలివరీ బాయ్స్‌ను కూడా కుల, మతాల వారీ విభజిస్తారా అని టీజీపీడబ్ల్యూయూ అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ జొమాటోను ప్రశ్నించారు. అలాగే, డెలివరీ బాయ్స్‌ను శాఖాహారులు, మాంసాహారులుగా విభజిస్తారా అని అడిగారు. అయితే, తమ వెజ్‌ఫ్లీట్ డెలివరీ బాయ్స్ ఆకుపచ్చ దుస్తులు ధరిస్తారంటూ మంగళవారం చేసిన ప్రకటనను జొమాటో సీఈవో దీపేందర్ గోయెల్ బుధవారం ఉపసంహరించుకున్నారు.

రాడిసన్ హోటల్ డ్రగ్స్ కేసు..

ఇద్దరు డ్రగ్స్ సరఫరాదారుల అరెస్టు

హైదరాబాద్ సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి రాడిసన్ హోటల్ డ్రగ్స్ కేసులో మరో ఇద్దరు నిందితులు అరెస్టయ్యారు. ముషీరాబాద్‌కు చెందిన అబ్దుల్ రహ్మాన్, ఢిల్లీలోని మహిపాల్‌పూర్ ప్రాంతానికి చెందిన నరేంద్రాసి వనత్ అనే డ్రగ్స్ సరఫరాదారులను అరెస్టు చేసినట్లు మాదాపూర్ జోన్ డీసీపీ డాక్టర్ వినీత్ వెల్లడించారు. నిందితులిద్దరూ గోవా, ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లో డ్రగ్స్ నెట్‌వర్క్‌ను విస్తరించినట్లు తెలిపారు. రాడిసన్ డ్రగ్స్ కేసులోనూ వీరే మత్తుమందు సరఫరా చేసినట్లు వివరించారు. మాదాపూర్ ఎస్‌వోటీ, గచ్చిబౌలి పోలీసులు జరిపిన సంయుక్త దాడుల్లో వీరిని అరెస్టు చేశారన్నారు. నిందితులిద్దరిపై గచ్చిబౌలి, జగద్గిరిగుట్ట, డబీర్‌పుర, మలక్‌పేట్, చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్లలో ఐదు కేసులున్నట్లు డీసీపీ తెలిపారు. నిందితుల నుంచి 11 గ్రాముల ఎండీఎంఏ, ఒక జాగ్వార్ కారు, ఏడు సెల్‌ఫోన్లను సీజ్ చేసినట్లు వెల్లడించారు.

కల్వకుంట్ల కన్నారావుకు హైకోర్టులో చుక్కెదురు

హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ బంధువు కల్వకుంట్ల కన్నారావు అలియాస్ తేజేశ్వర్‌రావుకు హైకోర్టులో చుక్కెదురైంది. తనపై ఉన్న భూకబ్జా కేసును కొట్టేయాలంటూ కన్నారావు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. కన్నారావు తన అనుచరులతో కలిసి దాడి చేశారని, భూ ఆక్రమణకు పాల్పడ్డారని ఓఎస్ఆర్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ బండోజు శ్రీనివాస్ గతంలో ఆదిభట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కన్నారావు, అతని అనుచరులపై కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టేయాలంటూ కన్నారావు క్వాష్ పిటిషన్లను దాఖలు చేశారు. విచారణ జరిపిన జస్టిస్ కె.సుజన ధర్మాసనం ఈ పిటిషన్లను కొట్టేసింది.

బిడ్డా.. ఇది నా అడ్డా

- ఒకరి అడ్డాలో మరొకరు ప్రయాణికులను ఎక్కించుకోవడంపై గొడవ
- ఆటోను వెంబడించి మరో ఆటోతో ఢీ
- ప్రమాదంలో ఓ విద్యార్థినికి తీవ్ర గాయాలు
- సిద్దిపేటలో ఘటన, కేసు నమోదు

సిద్దిపేటక్రైం, మార్చి 20 : ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకునే విషయంలో ఆటోడ్రైవర్ల మధ్య తలెత్తిన గొడవ ఓ ప్రయాణికురాలి ప్రాణం మీదకు తెచ్చింది. ప్రయాణికులతో వెళుతున్న ఓ ఆటోను ఓ డ్రైవర్ మరో ఆటోతో వెంబడించి ఢీకొట్టగా ఓ నర్సింగ్ విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. సిద్దిపేటలో బుధవారం ఈ ఘటన జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. చింతమడకకు చెందిన పది మంది విద్యార్థినులు ప్రతిరోజు సిద్దిపేట నుంచి పొన్నాల నర్సింగ్ కళాశాలకు వెళుతుంటారు. బుధవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద ఆనంద్ దర్శని హోటల్ సమీపంలో పొన్నాల అడ్డాకు చెందిన ఓ ఆటోలో ఆరుగురు విద్యార్థినులు ఎక్కారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసిన పాతబస్టాండ్ ప్రాంతానికి చెందిన ఆటోడ్రైవర్లు పొన్నాల అడ్డాకు చెందిన ఆటోడ్రైవర్ శ్రీనుతో వాగ్వాదానికి దిగారు. తమ అడ్డాలో ప్రయాణికులను ఎక్కించుకోవద్దని స్పష్టం చేశారు. దీంతో విద్యార్థినులను వాహనంలో నుంచి దించేసిన శ్రీను.. సమీపంలోని పొన్నాల ఆటోల అడ్డాపైకి వచ్చి ఆటో ఆపాడు. సదరు విద్యార్థినులు పాత బస్టాండ్ నుంచి కాలినడకన పొన్నాల అడ్డా వద్దకు వెళ్లి తిరిగి శ్రీను ఆటోనే ఎక్కారు. ఇది గమనించిన పాతబస్టాండ్ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్లు మళ్లీ గొడవకు దిగారు. ఇది తమ అడ్డా అని పొన్నాల ఆటో డ్రైవర్లు వారించడంతో అక్కడి నుంచి వెనుదిరిగారు. అనంతరం శ్రీను విద్యార్థినులతో పొన్నాలకు బయలుదేరాడు. అయితే, పాతబస్టాండ్ అడ్డాకు చెందిన నవీన్ అనే ఆటోడ్రైవర్ తన ఆటోతో శ్రీను ఆటోను వెంబడించాడు. పాత కలెక్టర్ కార్యాలయం, సిద్దిపేట బ్లాక్ ఆఫీస్ చౌరస్తా సమీపంలో ఓవర్‌టేక్ చేసే క్రమంలో శ్రీను ఆటోను నవీన్ ఢీకొట్టాడు. ఈ క్రమంలో ఆటోలో డ్రైవర్ శ్రీను పక్కన కూర్చున నవ్య అనే విద్యార్థిని కిందపడిపోగా ఆమె తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు ఆమెను వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, ప్రమాదానికి కారణమైన పాత్‌బస్టాండ్ ఆటోడ్రైవర్లపై పొన్నాలకు చెందిన ఆటోడ్రైవర్లు, నవ్య తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన సిద్దిపేట పోలీసులు దర్యాప్తు చేపట్టారు.


సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నవ్య

కవిత సహాయకులపై ఈడీ కన్ను

రాజేశ్, రోహిత్‌రావులను ప్రశ్నించిన అధికారులు .. కవిత అరెస్టు జరిగిన రోజున ఐదుగురి ఫోన్లు స్వాధీనం

- వాటిలో సహాయకుల ఫోన్లు కూడా..
- రేపు సుప్రీంకోర్టు విచారణకు కవిత పిటిషన్

న్యూఢిల్లీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. కవిత వ్యక్తిగత సహాయకులు రాజేశ్, రోహిత్‌రావులను ఈడీ బుధవారం ప్రశ్నించింది. కాగా, కవితను అరెస్టు చేసిన రోజున ఆమె ఇంట్లో ఉన్నవారిలో మొత్తం 16 మంది ఫోన్లను ఈడీ అధికారులు పరిశీలించినట్టు తెలిసింది. వారిలో కవిత, ఆమె భర్త అనిల్‌తోపాటు వ్యక్తిగత సహాయకులు రాజేశ్, రోహిత్‌రావు, శరత్‌ల ఫోన్లను స్వాధీనం చేసుకొని మిగిలిన 11 ఫోన్లను తిరిగి ఇచ్చేసినట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ క్రమంలోనే అవసరమైతే విచారణకు పిలుస్తామని వారికి ఈడీ అధికారులు చెప్పారు. ఈ మేరకు బుధవారం రాజేశ్, రోహిత్‌రావులను ప్రశ్నించారు. మద్యం కేసులో కవితకు సంబంధించి కీలక అంశాలపై వారిద్దరి నుంచి అధికారులు సమాచారం సేకరించినట్లు సమాచారం. మరోవైపు, బుధవారం సాయంత్రం 7 గంటలకు కేటీఆర్, న్యాయవాది మోహిత్‌రావు కవితను కలిసి సుమారు గంటసేపు ఆమెతో మాట్లాడారు. శుక్రవారం సుప్రీంకోర్టులో కవిత పిటిషన్‌పై విచారణ జరగనున్న నేపథ్యంలో దానిపైనే వారు చర్చించినట్టు తెలిసింది. కవితను.. ఆమె తల్లి శోభ, కుమారులు ఆదిత్య, ఆర్య, సోదరీమణులు అఖిల సౌమ్య, వినుత, సోదరుడు ప్రశాంత్ కలుసుకునేందుకు ఢిల్లీలోని స్థానిక కోర్టు అనుమతించిన విషయం తెలిసిందే. శోభ ఇప్పటికే ఢిల్లీ చేరుకున్నారు. గురువారం ఆమె కవితను కలిసే అవకాశం ఉంది. వాస్తవానికి కవితను ఈడీ కస్టడీకి ఇచ్చిన నాడే (ఈ నెల 16న) ఆమె ఆరుగురు వ్యక్తులను కలవటానికి స్థానిక కోర్టు అనుమతించింది. అయితే, వారిలో కేటీఆర్ తప్ప ఇతరుల పేర్లను తొలగిస్తూ, కొత్త పేర్లతో కవిత న్యాయవాది కోర్టుకు మంగళవారం జాబితా సమర్పించారు. మొత్తంగా 8 మందికి అనుమతిస్తూ న్యాయమూర్తి ఎంకే నాగ్‌పాల్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, రోజుకు ముగ్గురు మించి కవితను కలవటానికి వీల్లేదని స్పష్టం చేశారు. మరోవైపు ఈడీ అరెస్టు అక్రమమని, తన విడుదలకు ఆదేశించాలని కోరుతూ కవిత దాఖలు చేసిన పిటిషన్ శుక్రవారం సుప్రీంకోర్టు ధర్మాసనం ముందు విచారణకు రానుంది.

బోయినపల్లి అభిషేక్‌కు మధ్యంతర బెయిల్

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో నిందితుడైన బోయినపల్లి అభిషేక్‌కు సుప్రీంకోర్టు నాలుగు వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. లిక్కర్ కేసులో 2022 అక్టోబరులో అరెస్టయిన అభిషేక్.. గత ఏడాది నవబరు 20న అభిషేక్ సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై బుధవారం జస్టిస్ సంజీవ్ కన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అభిషేక్ ఇప్పటికే 19 నెలల నుంచి జైల్లోనే ఉన్నారని ఆయన తరఫు న్యాయవాది తెలిపారు. అభిషేక్ భార్య అనారోగ్యంతో బాధ పడుతున్నందున బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఈ వాదనలపై ఈడీ తరఫున హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు అభ్యంతరం తెలిపారు. అయితే, ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం అభిషేక్ బోయినపల్లికి నాలుగు వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ట్రయల్ కోర్టు విధించిన షరతులు అమల్లో ఉంటాయని, మొబైల్ నంబర్‌ను ఈడీ అధికారులకు ఇవ్వాలని అభిషేక్‌ను ఆదేశించింది. పాస్‌పోర్టు సరెండర్ చేయాలని, హైదరాబాద్ వెళ్లి భార్యకు చికిత్స చేయించుకుని తిరిగి రావాలని సూచించింది. తదుపరి విచారణను ఏప్రిల్ 29వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు ధర్మాసనం తెలిపింది.


అభిషేక్


డీహెచ్‌పై విచారణ జరిపించాలని మంత్రికి ఫిర్యాదు చేస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నేతలు

డీహెచ్ అవినీతిపై

విచారణ జరపాలి

- మంత్రి దామోదరకు లంబాడిహక్కుల పోరాట సమితి ఫిర్యాదు

హైదరాబాద్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు(డీహెచ్) డాక్టర్ రవీంద్రనాయక్ ఇష్టారాజ్యంగా డిప్యూటేషన్లు, వర్క్ ఆర్డర్లు ఇస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని లంబాడి హక్కుల పోరాట సమితి(హెల్‌హెచ్‌పీసీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు రాజేశ్ నాయక్ ఫిర్యాదు చేశారు. వైద్య ఉద్యోగుల డిప్యూటేషన్లు, వర్క్‌ఆర్డర్ల గడువులను రవీంద్రనాయక్ అక్రమంగా పొడిగిస్తున్నారని, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న డీఎంహెచ్‌వోలను తప్పించకుండా వారి నుంచి ముడుపులు తీసుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ జరిపి డీహెచ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాజేశ్ నాయక్ విజ్ఞప్తి చేశారు. డీఎంహెచ్‌వోలు వైద్య ఆరోగ్యశాఖను భ్రష్టు పట్టిస్తున్నారని, ఎన్నికల కోడ్ వస్తుందని తెలిసి కూడా వారిని బదిలీ చేయకపోవడంలో ఉన్న ఆంతర్యమేంటో డీహెచ్ చెప్పాలని డిమాండ్ చేశారు. తమ ఫిర్యాదుపై మంత్రి సానుకూలంగా స్పందించారని, విచారణకు ఆదేశిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

నా గౌరవాన్ని దెబ్బతీసేందుకే

తప్పుడు ప్రచారం: డీహెచ్

తన గౌరవాన్ని దెబ్బతిసేందుకు కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని డీహెచ్ రవీంద్రనాయక్ అన్నారు. తనకు లంచం ఇచ్చినట్లు ఓ ఉద్యోగి పేర్కొంటున్నట్లు సోషల్‌మీడియాలో వచ్చిన ఆడియో టేపు ఆధారరహితమైనదని, ఉద్దేశపూర్వకంగా చేయించినదని ఇప్పటికే ప్రకటించానని ఆయన తెలిపారు. ఈనెల 18న 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన "డీహెచ్‌పై విచారణ?"కథనంపై వివరణ ఇచ్చుకున్నారు. నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన తాను కష్టపడి వైద్యుడిని అయ్యానని, తాను ఎటువంటి అక్రమాలకు పాల్పడలేదని రవీంద్ర నాయక్ చెప్పారు. కానీ పదేపదే తన వ్యక్తిత్వాన్ని దెబ్బతిసేలా ప్రచారం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు డీఎంహెచ్‌వోలను అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్‌లో మార్చామని, మార్చిన వారంతా జూనియర్లు, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోలేనని పేర్కొన్నారు. సీనియర్ డాక్టర్లను సిద్దిపేట, మెదక్, జనగామ, మహబూబాబాద్ జిల్లాలకు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోలుగా నియమించామని తెలిపారు. తనపై వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని అన్నారు.

ప్రణీత్‌రావు పిటిషన్‌పై తీర్పు నేటికి రిజర్వ్



హైదరాబాద్/ హైదరాబాద్ సిటీ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): దిగువ కోర్టు నిబంధనలకు విరుద్ధంగా తనను పోలీసు కస్టడీకి అప్పగించిందని పేర్కొంటూ ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు ప్రణీత్‌రావు హైకోర్టులో వేసిన పిటిషన్‌పై బుధవారం వాదోపవాదాలు జరిగాయి. జస్టిస్ జి.రాధారాణి ధర్మాసనం ఈ తీర్పును గురువారానికి రిజర్వ్ చేసింది. ప్రణీత్‌రావు తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలను వినిపిస్తూ.. పోలీసులు సమయం, సందర్భం లేకుండా 24 గంటలూ ఇంటరాగేషన్ చేస్తున్నారని.. నిబంధనల ప్రకారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య మాత్రమే విచారించాలని సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంచేస్తున్నట్లు కోర్టుకు తెలిపారు. "దర్యాప్తు అధికారులు పిటిషనర్‌కు విరామం ఇవ్వకుండా.. ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. సెలెక్టివ్‌గా మీడియాకు లీకులు ఇస్తున్నారు. ఇది అక్రమం. నిబంధనల ప్రకారం రెండ్రోజులకోసారి వైద్యపరీక్షలు నిర్వహించాలి. కానీ, పోలీసులు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. కేసు నమోదైంది పంజాగుట్ట ఠాణాలో అయితే.. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో రహస్యంగా విచారణ జరుపుతున్నారు. ఈ కేసులో ఫిర్యాదుదారుడైన అదనపు ఎస్పీ డి.రమేశ్ విచారణలో పాల్గొనడం నిబంధనలకు విరుద్ధం" అని కోర్టుకు తెలిపారు. ప్రభుత్వం తరఫున రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్‌పల్లె నాగేశ్వరరావు వాదలను వినిపిస్తూ.. గత ప్రభుత్వ హయాంలో విపక్ష నేతల ఫోన్ ట్యాపింగ్ కేసులో పిటిషనర్ నిందితుడని, ఇది తీవ్రమైన ఆరోపణలున్న నేరమని తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకే దర్యాప్తు కొనసాగుతోందని.. పోలీసులు ఎక్కడా నిబంధనలను ఉల్లంఘించలేదని వివరించారు. ఫిర్యాదుదారుడైన అదనపు ఎస్పీ రమేశ్‌ను కేవలం దర్యాప్తులో భాగంగా ఆధారాల కోసం మాత్రమే పిలిచినట్లు చెప్పారు. ఆయన దర్యాప్తులో పాల్గొనడంలేదని వివరించారు. పిటిషనర్ అరెస్టు సమయంలో మాత్రమే ఒకేసారి ప్రెస్‌నోట్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలను నమోదు చేసుకున్న ధర్మాసనం.. తీర్పును రిజర్వ్‌చేస్తున్నట్లు ప్రకటించింది. గురువారం తీర్పును వెల్లడించనున్నట్లు తెలిపింది.

కిందిస్థాయి సిబ్బంది విచారణ

ప్రణీత్‌రావు 2018లో ఎస్ఐబీలో పనిచేస్తున్నప్పటి నుంచి అతని కింద పని చేసిన సిబ్బందిని దర్యాప్తు అధికారులు బుధవారం విచారించినట్లు తెలిసింది. ఓ వైపు ప్రణీత్‌రావును నాలుగో రోజు కస్టడీలో భాగంగా విచారిస్తూనే.. ఆయన వద్ద పనిచేసిన సిబ్బంది వాంగ్మూలాలను సేకరించారు. బుధవారం కొందరిని పిలిపించిన ప్రశ్నించగా.. చాలా మంది ఎస్ఐబీ నుంచి బదిలీ అయ్యారని గుర్తించారు. వారిని కూడా రప్పించి, విచారించనున్నట్లు తెలుస్తోంది. "ప్రణీత్‌రావు నడవడిక.. తీరు ఎలా ఉండేవి? మీతో ఎలాంటి పనులు చేయించేవారు? ఫోన్ ట్యాపింగ్‌పై అవగాహన ఉందా?" వంటి ప్రశ్నలతో సమాధానాలు రాబట్టినట్లు తెలిసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● గురువారం 21 మార్చి 2024
diksuchi@andhrajyothy.com

ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీలో ప్రవేశానికి 'నెస్ట్'



భువనేశ్వర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైసర్), ముంబైలోని యూనివర్సిటీ ఆఫ్ ముంబై-డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ బేసిక్ సైన్సెస్(యూఎం-డీఏఈ సీఈబీఎస్)లలో ప్రవేశానికి ఉద్దేశించిన నేషనల్ ఎంట్రెన్స్ స్ర్కీనింగ్ టెస్ట్ (నెస్ట్) 2024 నోటిఫికేషన్ వెలువడింది. దీని ద్వారా అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. బయాలజీ, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, ఫిజిక్స్ స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. దేశవ్యాప్తంగా 120 సెంటర్లలో ఈ ఎగ్జామ్‌ను నిర్వహించనున్నారు. నైసర్‌లో మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఇక్కడ చదివినవారికి హోమి బాబా నేషనల్ ఇన్‌స్టిట్యూట్(హెచ్‌బీఎన్‌ఐ) ఎమ్మెస్సీ డిగ్రీని ప్రదానం చేస్తుంది. యూఎం-డీఏఈ సీఈబీఎస్‌లో 57 సీట్లు ఉన్నాయి. ఇక్కడ చదివినవారికి యూనివర్సిటీ ఆఫ్ ముంబై బీఎస్సీ-ఎమ్మెస్సీ డిగ్రీలను ప్రదానం చేస్తుంది.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి సైన్స్/మేథ్స్ గ్రూప్‌తో ఇంటర్/పన్నెండో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. 2022, 2023 సంవత్సరాల్లో ఉత్తీర్ణులైనవారు; ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

నెస్ట్ వివరాలు: ఇది ఆన్‌లైన్/కంప్యూటర్ బేస్ట్ టెస్ట్. అన్నీ ఆబ్జెక్టివ్ ప్రశ్నలే ఇస్తారు. ఇందులో బయాలజీ, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, ఫిజిక్స్ అనే నాలుగు సెక్షన్‌లు ఉంటాయి. ఒక్కో సెక్షన్ 60 మార్కులకు ఉంటుంది. ప్రతి సెక్షన్‌లో 20 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు 3 మార్కులు నిర్దేశించారు. సమాధానం తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం మూడున్నర గంటలు. ప్రశ్నపత్రాన్ని ఇంగ్లీష్, హిందీ మాధ్యమాల్లో ఇస్తారు. బెస్ట్ స్కోర్ వచ్చిన మూడు సెక్షన్‌లను పరిగణనలోకి తీసుకొని సెక్షన్‌వారీ మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. నైసర్, సీఈబీఎస్ విడివిడిగా మెరిట్ లిస్ట్‌లు రూపొందిస్తాయి.

స్కాలర్‌షిప్: ఎంపికైన అభ్యర్థులకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ-డీఐఎస్‌హెచ్‌ఏ ప్రోగ్రామ్ లేదా డీఎస్‌టీ వారి ఇన్‌స్పైర్ ప్రోగ్రామ్ కింద ఏడాదికి రూ.60,000ల స్కాలర్‌షిప్ ఇస్తారు. సమ్మర్ ఇంటర్న్‌షిప్ కోసం ఏడాదికి రూ.20,000ల గ్రాంట్ చెల్లిస్తారు.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** జనరల్, ఓబీసీ కేటగిరీలకు చెందిన పురుషులకు రూ.1,400; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.700
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **అడ్మిట్ కార్డుల డౌన్‌లోడింగ్:** జూన్ 15 నుంచి
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్
- **నెస్ట్ 2024 తేదీ:** జూన్ 30
- **ఫలితాలు విడుదల:** జూలై 10
- **వెబ్‌సైట్:** www.nestexam.in, www.niser.ac.in, www.cbs.ac.in

ఏపీ గురుకుల పాఠశాలల కామన్ అడ్మిషన్ టెస్ట్

గుంటూరులోని ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ(ఏపీఆర్‌ఈఐఎస్)- రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి ఉద్దేశించిన కామన్ అడ్మిషన్ టెస్ట్ (ఏపీఆర్‌ఈఐఎస్ క్యాట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా అయిదో తరగతి ప్రవేశాలు సహా ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ ప్రక్రియ నిర్వహిస్తారు. బాలురకు, బాలికలకు విడివిడిగా జనరల్, మైనారిటీ కేటగిరీల పాఠశాలలు ఉన్నాయి. అయిదో తరగతిలో ప్రతి గురుకుల పాఠశాలలో 80 సీట్లు చొప్పున మొత్తం 3,920 సీట్లు ఉన్నాయి. ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల్లో మొత్తం 575 సీట్లు మిగిలి ఉన్నాయి.

గురుకుల పాఠశాలల ప్రత్యేకతలు: ఎంపికైన విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. బోధన, వసతి ఉచితం. క్రీడలు, వ్యాయామానికి ప్రాధాన్యమిస్తారు. ల్యాబొరేటరీలు, లైబ్రరీలు, ప్లే గ్రౌండ్స్ అందుబాటులో ఉంటాయి. ప్రతి తరగతికి లోకో పేరెంట్‌ను నియమిస్తారు. మేథ్స్ ఒలింపియాడ్, హిందీ ప్రచార సభ, ఎన్‌టీఎస్‌ఈ తదితర పరీక్షల కోసం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తారు.



అర్హత వివరాలు: అయిదో తరగతిలో ప్రవేశానికి విద్యార్థులు 2022-23 సంవత్సరంలో మూడో తరగతి, 2023-24 సంవత్సరంలో నాలుగో తరగతి చదివి ఉండాలి. ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల్లో ప్రవేశానికి 2023-24 సంవత్సరంలో అయిదు, ఆరు, ఏడు తరగతులు చదివి ఉండాలి.

వయసు: అయిదో తరగతికి 2013 సెప్టెంబరు 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య; ఆరో తరగతికి 2012 సెప్టెంబరు 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య; ఏడో తరగతికి 2011 సెప్టెంబరు 1 నుంచి 2013 ఆగస్టు 31 మధ్య; ఎనిమిదో తరగతికి 2010 సెప్టెంబరు 1 నుంచి 2012 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది.

- జనరల్ పాఠశాలల్లో ప్రవేశానికి ఓసీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు తప్పనిసరిగా గ్రామీణ ప్రాంతాల్లో చదివి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఈ నిబంధన వర్తించదు.
- కుటుంబ వార్షికాదాయం రూ.1,00,000లకు మించకూడదు.

ఏపీఆర్‌ఈఐఎస్ క్యాట్ వివరాలు: పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం రెండు గంటలు. విద్యార్థులు సమాధానాలను బ్లూ/బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌తో ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ప్రశ్న పత్రాన్ని ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఇస్తారు. అయిదో తరగతికి మాత్రం ఉర్దూ, ఇంగ్లీష్ మాధ్యమాల్లో కూడా ఇస్తారు.

- అయిదో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో నాలుగో తరగతి సిలబస్ ఆధారంగా ప్రశ్నలు అడుగుతారు. తెలుగు/ఉర్దూ నుంచి 25, ఇంగ్లీష్ నుంచి 15, మేథ్స్ నుంచి 30, ఈవీఎస్ నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు.
- ఆరోతరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో అయిదో తరగతి సిలబస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. తెలుగు నుంచి 20, ఇంగ్లీష్ నుంచి 20, మేథ్స్ నుంచి 30, ఈవీఎస్ నుంచి 30 ప్రశ్నలు ఇస్తారు.
- ఏడు, ఎనిమిది తరగతుల్లో ప్రవేశానికి ఆరు, ఏడు తరగతుల సిలబస్ ఆధారంగా ప్రశ్నలు ఇస్తారు. తెలుగు, ఇంగ్లీష్, మేథ్స్, సైన్స్, సోషల్ స్టడీస్‌ల నుంచి ఒక్కోదానిలో 20 ప్రశ్నలు ఇస్తారు.

ముఖ్య సమాచారం

- ☆ **దరఖాస్తు ఫీజు:** రూ.100
- ☆ **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- ☆ **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 17 నుంచి
- ☆ **ఏపీఆర్‌ఈఐఎస్ క్యాట్ 2024 తేదీ:** ఏప్రిల్ 25
- ☆ **ఫలితాలు విడుదల:** మే 14
- ☆ **వెబ్‌సైట్:** https://aprs.apcfss.in

జాబ్ కార్నర్

బెల్‌లో సీనియర్ ఇంజనీర్లు

బెంగళూరులోని కేంద్ర ప్రభుత్వ సంస్థకు చెందిన భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్(బెల్)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **ఖాళీలు: 33**

1. సీనియర్ ఇంజనీర్: **19 పోస్టులు**
2. డిప్యూటీ మేనేజర్: **10 పోస్టులు**
3. సీనియర్ మేనేజర్: **4 పోస్టులు**

విభాగాలు: పవర్ ఎలక్ట్రానిక్స్, పవర్ ఎలక్ట్రానిక్స్(మెకానికల్), సిస్టమ్ ఆర్కిటెక్ట్ ఎంబెడెడ్, మాడ్యూల్ డెవలప్‌మెంట్ ఎంబెడెడ్, మాడ్యూల్ డెవలప్‌మెంట్ ఎంబెడెడ్ ఆర్‌టీఓ ఎస్/ఎఫ్‌పీజీఏ, మాడ్యూల్ డెవెలప్‌మెంట్ పీసీబీ డిజైన్, పవర్ ఎలక్ట్రానిక్స్, పవర్ మాడ్యూల్(మెకానికల్), ట్రాన్స్‌పోర్టేషన్, బ్యాటరీ ప్యాక్ డెవెలప్‌మెంట్, బ్యాటరీ బీఎంఎస్ డెవెలప్‌మెంట్, ఏసీసీ సెల్ డిజైన్ డెవలప్‌మెంట్, నేవల్ కంట్రోల్ సిస్టమ్, యాక్టివ్ ప్రొటెక్షన్ సిస్టమ్, నేవల్ బ్యాటరీ ప్యాకింగ్.

అర్హత: ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్‌లో బీఈ/బీటెక్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 32 నుంచి 42 ఏళ్లు మించరాదు

జీతం: సీనియర్ ఇంజనీర్ పోస్టుకు రూ.70,000 - రూ.2,00,000; డిప్యూటీ మేనేజర్ పోస్టుకు రూ.80,000 - రూ.2,20,000. సీనియర్ మేనేజర్ పోస్టుకు రూ.1,00,000 నుంచి రూ.2,60,000.

ఆన్‌లైన్‌దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 31

వెబ్‌సైట్: https://edn.bhel.com/

తెలంగాణ పారిశ్రామికరంగం



ఎకానమీ

తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంట్రప్రెన్యూర్ అడ్వాన్స్‌మెంట్(టీ-ఐడియా) కార్యక్రమాన్ని 2014-15లో ఆరంభించారు. రాష్ట్రంలో పరిశ్రమలను స్థాపించే వ్యవస్థాపకులను ప్రోత్సహించే లక్ష్యంతో దీనిని ప్రారంభించారు. మూలధన సహాయం, పెట్టుబడి రాయితీలు, స్టాంప్ డ్యూటీ మినహాయింపు, వడ్డీ రాయితీ నాణ్యత నియంత్రణ రాయితీ, రిజిస్ట్రేషన్ ఫీ తిరిగి చెల్లింపు మొదలైన వాటి ద్వారా వ్యవస్థాపకులకు ప్రోత్సాహం అందిస్తారు. ఈ పథకం ఆరంభమైన 2014-15 నుంచి 2023 జనవరి వరకు రూ.3457.91 కోట్ల మొత్తాన్ని 2,470 క్లెయిమ్‌ల కింద మంజూరు చేశారు.

టీ-ఐడియా కింద 2014-15 నుంచి 2022-23 వరకు మంజూరు చేసిన క్లెయిమ్‌ల సంఖ్య, రూపాయలను కింది పట్టికలో చూడవచ్చు.

సంవత్సరం	క్లెయిమ్‌ల సంఖ్య	మంజూరు చేసిన మొత్తం(రూ.కోట్లలో)
2014-15	2180	297.77
2015-16	1561	442.44
2016-17	2784	410.98
2017-18	3135	504.06
2018-19	3512	368.66
2019-20	3455	416,35
2020-21	2706	251.27
2021-22	3010	369.93
2022-23 (జనవరి23 వరకు)	2127	395.45



పై పట్టిక ప్రకారం టీ-ఐడియా కింద 2018-19లో ఎక్కువ క్లెయిమ్‌లు(3512) మంజూరు చేయగా 2017-18లో ఎక్కువ మొత్తం రూ.509 కోట్లు మంజూరు చేశారు.

తెలంగాణ ప్రైడ్

పారిశ్రామిక రంగంలో సమ్మిళిత వృద్ధికి షెడ్యూల్ కులాలు, తెగలు, మహిళలు, దివ్యాంగుల ప్రాతినిధ్యం పెంచాలని 2014-15లో తెలంగాణ స్టేట్ ప్రోగ్రామ్ ఫర్ రాపిడ్ ఇంక్యుబేషన్ దళిత ఎంటర్‌ప్రెన్యూర్ కోసం తెలంగాణ రాష్ట్ర కార్యక్రమం(టీ-ప్రైడ్)ను ఆరంభించారు. ఈ పథకం కింద పారిశ్రామిక పార్కుల్లో ప్లాట్ల కేటాయింపు, ప్రత్యక్ష నిధులు, మార్జిన్ మనీని అందించడం, పెద్ద పరిశ్రమలతో ఉప కాంట్రాక్టులు ఏర్పాటు చేయడం, అదనపు పెట్టుబడి రాయితీలు, రీఎంబర్స్‌మెంట్ అందించడం, ఈ వర్గాల్లో సివిల్ కాంట్రాక్టులను ప్రోత్సహించడం చేస్తారు. 2014-15 నుంచి 2023 జనవరి వరకు ఈ పథకం కింద 61,258 క్లెయిమ్‌లను రూ.2,759.3 కోట్లను మంజూరు చేశారు. 2014-15 నుంచి 2021-22 వరకు ఈ పథకం కింద వివిధ వర్గాలకు వార్షికంగా విడుదల చేసిన నిధుల వివరాలు పట్టిక-2లో చూడవచ్చు.

టీ-ప్రైడ్ కింద మంజూరైన నిధులు

సంవత్సరం	మంజూరైన నిధులు(రూ.కోట్లలో) ఎస్టీ	ఎస్సీ	దివ్యాంగులు
2014-15	35.24	19.91	0.00
2015-16	54.01	38.63	0.02
2016-17	131.66	104.08	2.54
2017-18	211.81	137.8	16.60
2018-19	195.33	147.71	21.25
2019-20	202.84	212.54	29.16
2020-21	163.09	200.12	10.54
2021-22	162.93	291.25	15.28
2022-23 (జనవరి 23 వరకు)	122.82	221.27	10.87

ఈ పట్టిక ప్రకారం టీ-ప్రైడ్ కింద షెడ్యూల్ కులాల వారు 2017-18లో గరిష్ఠంగా రూ.211.81 కోట్లు పొందగా షెడ్యూల్ తెగలవారు 2021-22లో గరిష్ఠంగా రూ.291.25 కోట్లు పొందారు. ఇక దివ్యాంగులు 2019-20లో 29.16 కోట్లు గరిష్ఠంగా పొందారు.

మహిళా పారిశ్రామికవేత్తల ప్రోత్సాహ కేంద్రం(వుయ్ హబ్)

తెలంగాణ మహిళల్లో వ్యవస్థాపకులను ప్రోత్సహించడానికి 'వుయ్ హబ్'ను 2017లో ఆరంభించారు. ఈ కార్యక్రమం కింద రాష్ట్రంలోని కొత్త మహిళా పారిశ్రామికవేత్తలకు ఇంక్యుబేషన్ సౌకర్యాలను, ప్రభుత్వ యాక్సెస్‌ను, ప్రపంచ నెట్‌వర్క్‌కు సహకారాన్ని అందిస్తారు. టైర్-2, టైర్-3 నగరాల్లో మహిళల్లో వ్యవస్థాపక నైపుణ్యాలను పెంపొందించడంలో సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితశాస్త్ర విద్యను మహిళలు మరింతగా అభ్యసించేలా ఈ కార్యక్రమంలో ప్రోత్సాహం అందిస్తారు.

'వుయ్ హబ్' ప్రారంభమైన 2017 నుంచి 2023 జనవరి వరకు 2194 స్టార్టప్‌లు ఆరంభం కాగా అందులో 1495 సంస్థలకు కార్యక్రమం కింద మద్దతు లభించింది. ఇందులో భాగంగా రూ.66.3 కోట్ల నిధులు విడుదల కాగా 5235 మంది మహిళా పారిశ్రామికవేత్తలు, 2823 మంది ఇతరులకు ఉపాధి లభించింది.

తెలంగాణ హబ్(టీ-హబ్)

తెలంగాణలో ఇన్నోవేషన్ - ఎకో సిస్టమ్‌ను ప్రారంభించడానికి, సాధికారత కల్పించడానికి, స్టార్టప్‌లు, కార్పొరేషన్, ఇతర వాటాదారులను ప్రభావితం చేయడానికి 2015లో టీ-హబ్‌ను ఆరంభించారు. ఆరంభమైనప్పటి నుంచి 2,500 స్టార్టప్‌లను ప్రభావితం చేసింది. 12వేల ఉద్యోగాలు సృష్టించగలిగారు. నేషనల్ స్టార్టప్ అవార్డ్-2022లో బెస్ట్ ఇంక్యుబేషన్ ఇన్ ఇండియా అవార్డు అందుకుంది. టీ-హబ్ విస్తరణలో భాగంగా 4వేల స్టార్టప్‌లు, ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌లోని కీలక అంశాలు కలిగి ఉండే సామర్థ్యంతో 2022 జూన్ 28న టీ-హబ్ రెండోదశను టీ-హబ్ 2.0 పేరుతో ఆరంభించారు. ప్రపంచంలోని అతిపెద్ద ఇన్నోవేషన్ కేంద్రాల్లో టీ-హబ్-2.0 ఒకటిగా ఉంది.

పారిశ్రామిక హెల్త్ క్లినిక్‌లు

ఖాయిలా పడిన చిన్నతరహా సంస్థల పునరుద్ధరణ, పునరావాసానికి తెలంగాణ ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్ లిమిటెడ్‌ను నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీగా 2017లో ఏర్పాటుచేశారు. ఉద్దేశపూర్వకంగా లేని ఎగవేతదారుల ఆస్తులు నిరర్థక ఆస్తులుగా మారకుండా నిరోధించడానికి అవసరమైన మొత్తాన్ని చెల్లించడానికి ఆర్థిక సహాయం అందిస్తారు. ఖాయిలా పడిన చిన్నతరహా సంస్థలతో సంప్రదింపులు జరపడం, సలహాలు ఇవ్వడం, రుణాలు అందించడం ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్‌ల ముఖ్య కార్యక్రమాలు.

టీఎస్ గ్లోబల్ లింకర్

రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్లోబల్ కొనుగోలుదారులు, అమ్మకందారులను సంప్రదించడం కోసం, ఈ రంగంలోని అవకాశాలను అంచనా వేయడానికి 2019లో డిజిటల్ నెట్‌వర్కింగ్ వేదికగా టీఎస్ గ్లోబల్ లింకర్‌ను ఆరంభించారు. తెలంగాణ నుంచి ఏడువేల సంస్థలు, ప్రపంచవ్యాప్తంగా 3.5 లక్షల సంస్థలు ఇందులో నమోదయ్యాయి. 2021 నవంబరు 8న ఆన్‌లైన్ మాల్, మేడ్ ఇన్ తెలంగాణను ఆరంభించారు. ఇది రాష్ట్రంలోని వ్యవస్థాపకులకు కమిషన్ రహిత సేవలను అందిస్తుంది. ఈ ప్లాట్‌ఫామ్‌లో ముత్యాలు, దుస్తులు, గృహాలంకరణ, కన్సల్టింగ్, ఉపకరణాలు, సేవలు మొదలైనవి రాష్ట్రంలోని అత్యుత్తమ ఉత్పత్తుల క్రాఫ్ట్‌ల నిర్వహణ జరుగుతున్నది.

తెలంగాణ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్

తెలంగాణ వాణిజ్య పరిశ్రమలను ప్రోత్సహించడానికి తెలంగాణ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్‌ను 2014లో ప్రారంభించారు. జాతీయ, అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనలు ఏర్పాటు చేయడం, సదస్సులు నిర్వహించడం, రవాణా-ప్రచార మౌలిక సదుపాయాలు ఏర్పాటుచేయడం, అన్నిరకాల ప్రచార కార్యక్రమాలు చేపట్టడం మొదలైన అనేక విస్తృతస్థాయి లక్ష్యాలతో దీనిని ఏర్పాటుచేశారు. ఈ సంస్థ ద్వారా శంషాబాద్‌లోని మామిడిపల్లిలో కంటైనర్ ఫ్రైట్ స్టేషన్, మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలో తుప్రాన్ సమీపంలోని పార్కిబండ గ్రామంలో మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్క్ అభివృద్ధిని అమలుపరిచే ఏజెన్సీ అభివృద్ధి జరిగింది. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్స్ ఆర్గనైజేషన్(ఎఫ్ఐఈఓ), ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌టీసీసీఐ) సంస్థల సహాయంతో ఎగుమతిదారులు, తయారీదారులు, పారిశ్రామికవేత్తలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోని చిన్నతరహా సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించడానికి 2023 జనవరి 8-10 వరకు జరిగిన 'ఇండస్ ఫుడ్ ఎక్స్‌పో'లో తెలంగాణ రాష్ట్ర పెవిలియన్‌ను ఏర్పాటుచేసింది. చిన్నతరహా సంస్థల పనితీరును మెరుగుపరిచే భారతప్రభుత్వ కార్యక్రమానికి తెలంగాణ స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ నోడల్ సంస్థగా వ్యవహరిస్తున్నది.

తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్

తెలంగాణలో పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేసేందుకు టీఎస్ఐఐసీ నోడల్ ఏజెన్సీగా పనిచేస్తుంది. ఇందుకోసం 1.5 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. 2014-2022 మధ్యకాలంలో కార్పొరేషన్ 28,500 ఎకరాల భూమిని గుర్తించి స్వాధీనం చేసుకొని రూ.7.57 లక్షల కోట్ల పెట్టుబడితో 3.14 లక్షల ఉద్యోగాలను కల్పించింది. హైదరాబాద్ ఫార్మాసిటీ, జహీరాబాద్‌లోని ఇండస్ట్రియల్ పార్క్, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఎలక్ట్రానిక్ తయారీ క్లస్టర్లు, ఫైబర్ గ్లాస్ కాంపోజిట్ క్లస్టర్లు, చందరవెల్లి-దండుమల్కాపూర్‌లోని ఇండస్ట్రియల్ పార్కులు, సుల్తాన్‌పూర్ మెడికల్ డివైజెస్ పార్క్, సుల్తాన్‌పూర్‌లోని ఉమెన్స్ పార్క్, బుగ్గపాడులోని ఫుడ్‌పార్క్, సిరిసిల్లలో అపెరల్ వీవింగ్ పార్కు టీఎస్ఐఐసీ కొన్ని ప్రధాన పార్కులు. ఇప్పటివరకు 59 పారిశ్రామిక పార్కులు అభివృద్ధి చేయగా మరో 70 ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయి.



డా.ఎం.ఏ.మాలిక్,
అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి, హైదరాబాద్.




మీకు తెలుసా


- అడవిలోని జంతువులను వేటాడటంలో హైనాలది అందె వేసిన చేయి. ఇవి ఉత్తర ఆఫ్రికాలోని ఎడారుల్లో ఎక్కువగా కనిపిస్తాయి.
- హైనాలు మూడు రకాలు. చుక్కల హైనా, గోధుమ రంగు హైనా, చారల హైనా. ఈ చారల హైనాలు మిగతా వాటికంటే బలమైనవి. బరువైనవి. డామినేటింగ్‌గా ఉంటాయి. చాలా అగ్రెసివ్‌గా ఉంటాయి.
- అడవిలోని గడ్డిభూముల్లో దాక్కుని ఉండి కంటికి కనపడవు. ఇవన్నీ గుంపులుగా ఉంటాయి. గేదెలు, కంచరగాడిదలు, జింకలు, గుర్రాలు.. ఇలా వేటినైనా తెలివిగా వేటాడతాయి. సింహాలనూ భయపెట్టగలవు. అయితే ఎక్కువగా సింహాలు వేటాడిన ఆహారం మీద ఇవి ఆధారపడతాయి. సింహాలు తింటుంటే మధ్యలో వచ్చి ఆహారాన్ని గుంజుకుని పోతాయి. వీటితో సింహాలు కూడా గొడవపడలేవు. అందుకే ఆహారాన్ని వదిలేస్తాయి.
- వీటికి సోషల్ ఇంటిలిజెన్స్ ఎక్కువ. ఎంతా అంటే.. కొంతమంది పరిశోధకులు పజిల్స్‌లా చేసి మధ్యలో ఆహారాన్ని పెడితే.. అవి చాలా సులువుగా అధికమించాయట. కోతులకంటే స్మార్ట్. లంచ్ బాక్స్‌లను కూడా ఓపెన్ చేయగలవు.
- ఒక పెద్ద శునకం బరువంత ఇవి ఉంటాయి. వీటి వేగం గంటకు 60 కి.మీ.
- హైనాలు ఒకటి నుంచి మూడు పిల్లలను కంటాయి. ఇవి పుడుతూనే కళ్లు తెరచి, గట్టి కండరాలు కలిగి ఉంటాయి. అలా ఉన్నా కూడా తల్లి హైనా ఆర్నెళ్లు పాలిస్తుంది. ఆ తర్వాత కూడా తన కూనకు పాలు ఇచ్చి పెంచుతుంది. అందుకే హైనాలను గ్రేట్ మదర్స్ అంటారు.
- వీటి పంజాలు బలమైనవి. దొరికిన జంతువు మాంసాన్నే కాదు ఎముకలను విరగ్గొడతాయి. ఇక పళ్ల విషయం చెప్పనక్కర్లేదు. అది నోరు తెరుస్తూనే భయపడతాయి జంతువులు.
- హైనా గొంతు విచిత్రంగా ఉంటుంది. నవ్వినట్లుంటుంది గొంతు.
- చల్లగా ఉండటానికి నీటిలో పడుకుంటాయి. రెండు, మూడు హైనాలు గుంపుగా ఉంటే వీటిని సింహాలూ ఏమీ చేయలేక వెనక్కి తిరిగి వెళ్లిపోతాయి.
- కప్పలు, చేపలు, పండ్లు, జంతువులు, పురుగులు.. ఇలా వేటినైనా తింటాయివి.




సరైన నీడ ఏది?



7 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 260

	5			8		6		
7			2		6		5	
			3				4	8
	3	6				2		
1								4
		9				7	3	
9	6				2			
	8		5		3			6
		3		6			1	

సుడోకు - 259 సమాధానం

1	6	5	4	3	2	7	8	9
3	8	7	1	9	5	6	4	2
2	4	9	7	6	8	5	3	1
9	7	6	2	5	3	8	1	4
4	3	1	8	7	9	2	5	6
5	2	8	6	1	4	3	9	7
8	1	4	3	2	7	9	6	5
6	5	2	9	8	1	4	7	3
7	9	3	5	4	6	1	2	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.